
భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 08, సంచిక: 85 | శనివారం | 22-02-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



నేడు రైతులతో కేంద్ర బృందం భేటీ

ట్రంప్ ఫర్మానాలతో ప్రపంచం పరేషాన్

కోస్టారికాకు 135 మంది అక్రమ వలసదారులు

లోపలి పేజీల్లో




## కెఆర్ఎంబి భేటీకి ఎపి డుమ్మా

### కృష్ణా జలాల అక్రమ తరలింపును ఆపాల్సిందే : తెలంగాణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల మధ్య మొదలైన కృష్ణా నదీ జలాల వివాదం పరిష్కారానికి గాను శుక్రవారం కెఆర్ఎంబి రంగంలోకి దిగింది. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన జాతీ య నీటిపారుదల శాఖా మంత్రుల సదస్సు లో పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవ తీసుకుని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సిఆర్.పాటిల్‌తో పాటు కార్యదర్శి దేబాశ్రీ ముఖర్జీతో భేటీ అయిన విషయం విదితమే.ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభ్యర్థన మేరకు రంగంలోకి దిగిన కేంద్రం వివాదం పరిష్కారానికి కెఆర్ఎంబి సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించింది.అందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లో కెఆర్ఎంబి ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సంబంధిత అధికారులు హాజరు కావాలని సూచించింది. కెఆర్ఎంబి సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇఎన్‌సి అనిల్ కుమార్‌తో పాటు నల్లగొండ జిల్లా చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్‌లు హాజరై ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలు అక్రమ వినియోగంపై సమగ్రంగా వివరించారు. వాటాను మించి నీటి వినియోగాన్ని వాడుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కట్టడి చేయాలని వారు తరువాయి 12లో





# కృష్ణ తరలింపు

“పదేళ్ళు ముఖ్యమంత్రిగా ఉన్నాయన మన పరిపాలన బాగా లేదంటుండు. పన్నెండేళ్ళ మోదీ పరిపాలన మీద, పదేళ్ళ చంద్రశేఖర్‌రావు పరిపాలన మీద, 12 నెలల మా ప్రజాపాలన మీద చర్చ చేయటానికి నేను సిద్ధంగా ఉన్న.. చర్చకు సిద్ధమా కిషన్‌రెడ్డి గారూ. నీ పార్టీ ప్రెసిడెంట్‌గా, కేంద్ర మంత్రిగా నువ్వు రా.. చంద్రశేఖర్‌రావు ప్రతిపక్ష నాయకుడిగా, నీ పార్టీ ప్రెసిడెంట్‌గా నువ్వు రా.. కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా నేనొస్తా. చర్చలో ఓడిపోతే ముక్కు నేలకు రాస్తానని సవాలు విసురుతున్న..కెసిఆర్, కెటిఆర్, కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు ఏ తారీఖో, ఏ సెంటరో చెప్పండి. చర్చకు నేను, దామోదర రాజనర్సింహ తయార్”

\- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్

- పదేళ్ళలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయలే
- కృష్ణా నది జలాలను రాయలసీమకు జగన్ తరలించుకుపోతుంటే వీర తిలకం దిద్దావు
- నాటి సిఎం వైఎస్ తరలించుకుపోతుంటే ఊడిగం చేసింది నువ్వు కాదా
- జగన్‌ను ప్రగతిభవన్‌కు పిలిపించి రాయలసీమ లిఫ్ట్ పథకాన్ని రచించలేదా ?
- మాజీ సిఎం కెసిఆర్‌పై రేవంత్‌రెడ్డి ధ్వజం
- నారాయణపేట్ జిల్లాలో రూ.1000 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

# కెసిఆర్‌దే పాపం

ప్రజాపక్షం/ నారాయణపేట్

పదేళ్ళలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయక పోవడంతో, కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయలసీమ తరలించుకుపోతున్న పాపం నీది కాదా చంద్రశేఖర్‌రావు అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నిలదీశారు. ఆ ప్రాజెక్టును పూర్తి చేసినట్లయితే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఎందుకు వస్తుందని అన్నారు. ‘నాడు వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పోతిరెడ్డిపాడు నుండి 4వేల క్యూసెక్కులను 40వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమకు పంపితే, ఆయనకు ఊడిగం చేసింది, చెప్పులు మోసింది నువ్వు కాదా?’ నాటి మంత్రివర్గంలో హరీశ్‌రావు మంత్రిగా లేడా? అని ప్రశ్నించారు. ఆ తరువాత వైఎస్ కొడుకు జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రగతిభవన్‌కు పిలిపించి, పంచభక్షాలు తినిపించి, ఆరుగంటలు చర్చించి, రాయలసీమ ఎత్తిపోతలకు పథకాన్ని రచించింది నువ్వు కాదా? ఇది ద్రోహం కాదా? అని మండిపడ్డారు. నారాయణపేట జిల్లాలో శుక్రవారం పర్యటన సందర్భంగా దాదాపు రూ.1000 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి అప్పక్‌పల్లిలో తరువాయి 2లో



## ఫీజు చెల్లిస్తేనే పరీక్షకు అనుమతి

- ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం హుకూం
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామంటూ ప్రభుత్వం ఓ వైపు విస్తృత ప్రచారం చేస్తుంటే మరో వైపు ప్రైవేటు పాఠశాలలు ఫీజుల పేరుతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం విద్య వ్యాపారంగా మారిందని, ప్రభుత్వం, పాలకులు పట్టించుకోవడం లేదనే అపవాదు మూటగట్టుకుంటున్నా అధికారుల్లో మాత్రం చలనం కన్పించడం లేదు. పెద్దపల్లి జిల్లాలోని అనేక ప్రైవేటు పాఠశాలల వ్యవహారం వివాదాస్పదంగా ఉన్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థి సంఘాలు మాత్రమే ఆందోళనలు చేపట్టి కొంత మేర పేద విద్యార్థులకు ఊరట కల్పిస్తున్నాయి. కానీ ప్రైవేటు తరువాయి 2లో

## ప్రమాదంలో విద్యారంగం

- ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా జాతీయ నూతన విద్యావిధానం
- విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తున్న బిజెపి సర్కార్
- ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్ విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్రంలోని బిజెపి సర్కార్ జాతీయ నూతన విద్యావిధానం2020 తీసుకువచ్చి విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తూ విద్యారంగాన్ని అత్యంత ప్రమాదంలోకి నెట్టిందని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ.స్టాలిన్ విమర్శించారు. అందులో భాగంగానే కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.1,28,651 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది మొత్తం బడ్జెట్‌లో 2.53 శాతమేనని, ఈ నిధుల కేటాయింపులతో తరువాయి 2లో



కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు

## నిధులివ్వడంలో పూర్తి నిర్లక్ష్యం

- ఏటా దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులు 100 టిఎంసిల నీటి నిల్వలను కోల్పోయాయి
- గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం

ప్రజాపక్షం / హైదరాబాద్

గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన బిఆర్ఎస్ నాయకులకు కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని ఆయన తరువాయి 2లో



## ‘అదానీ అంశం వ్యక్తిగతం కాదు’

ప్రధాని మోదీ వ్యాఖ్యలు ఖండించిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**రాయ్‌బరేలి :** అమెరికా మీడియా సమావేశం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. అదానీ అంశం వ్యక్తిగతం కాదని, అది దేశానికి సంబంధించిన అంశమని రాహుల్ వ్యాఖ్యానించారు. తన పార్లమెంట్ నియోజకవర్గం అమేథీలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన రాహుల్ గాంధీ లాల్‌గంజ్‌లో యువతతో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశంపై అమెరికా మీడియా అదానీని ప్రస్తావించినపుడు రెండు దేశాల అధినేతల సమావేశంలో ఒక వ్యక్తికి సంబంధించిన అంశాన్ని ప్రస్తావించడం సముచితం కాదనడంపై రాహుల్ విమర్శలు గుప్పించారు. ట్రంప్‌తో సమావేశం అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ పారిశ్రామిక వేత్త అదానీ తన స్నేహితుడు మాత్రమేనని, ట్రంప్‌తో అతని గురించి ఏమీ మాట్లాడలేదని చెప్పారు. అయితే ఈ విషయమై రాహుల్ గాంధీ విరుచుకుపడుతూ ‘మోదీజీ! అదాని అంశం వ్యక్తిగతం కాదు. అది దేశానికి సంబంధించిన అంశమని గుర్తించాలి’ అన్నారు. అమెరికాలో అదానీపై అవినీతి, దొంగతనం కేసులు ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. ‘మన ప్రధాని ఏమన్నారంటే.. అదానీ అంశం వ్యక్తిగతం. దానిని గురించి తరువాయి 12లో



## ఎస్‌సి, ఎస్‌టి యువతకు రెండు నెలల్లో స్వయం ఉపాధి

- రూ.3 వేల కోట్ల బడ్జెట్‌తో పథకాలు
- ప్రణాళికలు వెంటనే రూపొందించాలి
- అధికారులకు డిప్యూటీ సిఎం భట్టి ఆదేశం
- సంక్షేమ శాఖలో పథకాల అమలుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు సిద్ధమని స్పష్టీకరణ

ప్రజాపక్షం / హైదరాబాద్

‘గత దశాబ్ద కాలం రాష్ట్రాన్ని పరిపాలించిన ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి యువతకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయకుండా పూర్తిగా పక్కన పెట్టింది. రూ.3,000 కోట్ల బడ్జెట్‌తో ఎస్‌సి, ఎస్‌టి, యువతకు రెండు నెలల వ్యవధిలో స్వయం ఉపాధి పథకాలు అందించాలి. ఇందుకు కోసం భారీ ఉపాధి పథకాలకు సంబంధించిన ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలి’ అని సంబంధిత శాఖల అధికారులను తరువాయి 2లో

# ఆటో డ్రైవర్ల సంఘాలతో చర్చలు సఫలం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, ఎంఎల్‌సి కోదండరాం సమక్షంలో ఆటో జెఎసితో చర్చలు జరిపిన రవాణాశాఖ మంత్రి పొన్నం
- వెసులు బాటు ప్రకారం రూ.12 వేలు ఆర్థిక సాయం
- ఆటో రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ



ప్రజాపక్షం / హైదరాబాద్

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర రవా ణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ సమక్షంలో తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి నేతల చర్చలు సఫలమయ్యాయి. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు ప్రకారం చెల్లిస్తామని, దీర్ఘకాలికంగా పెండిరగ్‌లో ఉన్న ఆటో రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఈ బోర్డు ఏర్పాటుకు లేబర్ కమిషనర్, రవాణా శాఖ కమిషనర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి జెఎసి నేతలకు హామీ ఇచ్చారు. ఓలా, ఊబర్, రాపిడోల నుండి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను తీసుకురావటానికి కృషి చేస్తుందని మంత్రి చెప్పారు. గతంలో ఉన్న ప్రమాద బీమాను పునరుద్దరిస్తామని మంత్రి చెప్పారు. ఈ చర్చల్లో తెలంగాణ రాష్ట్ర ఆటో సంఘాల జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం, వివిఎస్.బోస్ (ఎఐటియుసి), వి.ప్రవీణ్ (టియుసిఐ), వి.మారయ్య (బిఆర్‌టియు,) పి.శ్రీకాంత్ (సిఐటియు), ఎం.ఎ.సలీం (యుటిఎడిడబ్ల్యుఎ,) ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్,) పి.రాంరెడ్డి (ఐఎఫ్‌టియు), ఆటో యూనియన్ జెఎసి నాయకులు సి.హెచ్.జంగయ్య, ఎస్.అశోక్, తరువాయి 12లో




## నీటి వాటా సాధనలో బిఆర్ఎస్ సర్కార్ విఫలం

- పదేళ్లు మౌనం వహించి ఇప్పుడు విమర్శలు చేస్తారా : కోదండరాం ఆగ్రహం
- కృష్ణా, గోదావరి నీటి వాటా కోసం పోరాటం ముమ్మరం చేయాలి
- తెలంగాణ హక్కుల కోసం కేంద్రం వెంట పడాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

న్యాయంగా తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాలను సాధించడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఎంఎల్‌సి, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరాం విమర్శించారు. తెలంగాణ కు దక్కాల్సిన కృష్ణా, గోదావరి నీటి వాటా కోసం ఇప్పటికైనా పోరాటం ముమ్మరం చేయాలని తరువాయి 2లో

## కోస్టారికాకు 135 మంది

# అక్రమ వలసదారులు




**మెక్సికో సిటీ:** అమెరికా నుంచి అక్రమ వలసదారుల తరలింపు కొనసాగుతున్నది. తాజాగా 135 మందితో కూడిన విమానం కోస్టారికా చేరుకుంది. ఈ విమానంలో ఎక్కువ మంది ఆసియా వాసులు, పిల్లలు ఉన్నారు. లాటిన్ అమెరికాలో పనామా తర్వాత, అక్రమ వలసదారులను వెనక్కు పంపే క్రమంలో 'స్టాప్ ఓవర్'గా కోస్టారికాను అమెరికా ఎంపిక చేసుకుంది. కాగా, వీరిని విమానాశ్రయం నుంచి పనామా సరిహద్దు ప్రాంతానికి తరలిస్తామని, అక్కడ 30 రోజుల వరకూ బందీలుగా ఉంటారని కోస్టారికా హోం శాఖ సహాయ మంత్రి ఒమెర్ బదిల్లా తెలిపారు. ఆ తర్వాత వారివారి స్వస్థలాలకు పంపుతామని వివరించారు. ఇటీవల కోస్టారికాలో అమెరికా ఆంతరంగిక వ్యవహారాల శాఖ మంత్రి మార్కో రూబియో పర్యటించినప్పుడు కుదిరిన ఒప్పందం మేరకు, అక్రమ వలసవాదులను అమెరికా అక్కడికి పంపినట్లు సమాచారం.

ప్రపంచం

# వాదనకు మతార్ ససేమిరా

## సాల్మన్ రష్దీపై హత్యాయత్నం కేసులో ముద్దాయి నిర్ణయం



**మేవిల్లే (న్యూయార్క్):** ప్రముఖ రచయిత సాల్మన్ రష్దీపై హత్యాయత్నం ఆరోపణలు ఎదుర్కొంటున్న హదీ మతార్ తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి, వాదనలు వినిపించడానికి నిరాకరించాడు. 77 ఏళ్ల రష్దీతోపాటు, పలువురు సాక్షులను చటౌకా కౌంటీ కోర్టు ముందు ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టింది. సాక్ష్యాధారాలను కూడా సమర్పించింది. 2022 ఆగస్టు 12న, చటౌకా ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి రష్దీ హాజరైనప్పుడు, ఆయనపై మతార్ దాడి చేశాడు. ఆ ఘటనలో రష్దీ కన్ను కోల్పోయారు. తీవ్రంగా గాయపడ్డారు. ఘటనా స్థలంలోనే పట్టుబడిన మతార్‌పై హత్యాయత్నం కేసు నమోదైంది. కోర్టులో వాదనలు జరుగుతున్నప్పుడు ముద్దాయి మతార్ ఎవో నోట్స్ రాసుకుంటూ కనిపించేవాడు. కొన్ని సందర్భాల్లో తన లాయర్లతో సంక్షిప్తంగా మాట్లాడేవాడు. కాగా, వాదనలు తుది దశకు చేరుకున్న సమయంలో, మతార్ తరఫున వాదన వినిపించాల్సిందిగా న్యాయమూర్తి డేవిట్ ఫోలే సూచించినప్పుడు, అతని తరఫు లాయర్లు స్పందించలేదు. మతార్ వాదనలకు విముఖత వ్యక్తం చేస్తున్నాడని, కాబట్టి, తదుపరి వాదనలు వినిపించే అవకాశం లేదని వారు కోర్టుకు తెలిపారు. కాగా, కేసు విచారణను కోర్టు వాయిదా వేసింది.

# పారదర్శకంగా విధులు

**ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా యుఎస్ సెనెట్ ఆమోదం పొందిన కాశ్ పటేల్**


**సంస్థపై నమ్మకాన్ని పునరుద్ధరిస్తానని వెల్లడి**



**వాషింగ్టన్:** భారత సంతతికి చెందిన కాశ్ పటేల్ ప్రతిష్టాత్మక అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) డైరెక్టర్‌గా బాధ్యతలువ తీసుకోవడం ఖాయమైంది. ఆయన నియామకాన్ని అమెరికా సెనెట్ 51–49 ఓట్ల తేడాతో ఆమోదించింది. ఈ నియామకాన్ని వ్యతికించిన 49 మందిలో ఇద్దరు రిపబ్లిక్ పార్టీ సభ్యులు సుశాన్ కొలిన్స్, లీసా మర్కొవ్‌స్కీ కూడా ఉండడం గమనార్హం. కాగా, ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా పదవి చేపట్టిన తొలి ఇండియన్–అమెరికన్‌గా చరిత్ర సృష్టించిన కాశ్ పటేల్ 'ఎక్స్' వేదికగా తన నియామకంపై స్పందించారు. పారదర్శకంగా, జవాబుదారీతనంతో విధులు నిర్వర్తిస్తానని తెలిపారు. అమెరికన్లకు హాని చేయాలని ఎవరైనా ప్రయత్నిస్తే సహించేది లేదని వ్యాఖ్యానించారు. ఎఫ్‌బిఐ తొమ్మిదో డైరెక్టర్‌గా తనను నియమించాలని తీర్మానంచడం ఎంతో ఆనందకరంగా ఉందని, తనకు ఈ అవకాశం ఇచ్చిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అటార్నీ జనరల్ పామ్ బోన్డీకి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడులు జరిగిన తర్వాత ఎఫ్‌బిఐ ప్రతిష్ట మసకబారుతూ వచ్చిందని, రాజకీయంగా మారిన న్యాయవ్యవస్థ కారణంగా ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని అభిప్రాయపడ్డాడు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఎఫ్‌బిఐకి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. దేశం గర్వించేలా ఎఫ్‌బిఐని పునర్నిర్మిస్తామని కాశ్ పటేల్ అన్నారు. ట్రంప్ విధేయుడిగా ముద్రపడిన కాశ్ పటేల్ కుటుంబ మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. అయితే, ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాకు చెందిన వారు. ఉగాండాలో ఈదీ అమీన్ బెదిరింపు కారణంగా, కాశ్ పటేల్ తల్లిదండ్రులు, అంజనా, ప్రమోద్ పటేల్ తొలుత కెనడాకు, ఆ తర్వాత అమెరికాకు వలస వెళ్లారు. 1980 ఫిబ్రవరి 25న న్యూయార్క్‌లో జన్మించిన కాశ్ పటేల్ పూర్తి పేరు కశ్యప్ ప్రమోద్ వినోద్ పటేల్. కాగా, అధ్యక్షుడు ట్రంప్‌నకు వీరవిధేయుడిగా కాశ్‌కు పేరుంది. పటేల్ కుటుంబ మూలాలు గుజరాత్‌లో ఉన్నాయి. ఆయన తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. తండ్రి ఉగాండాలో నియంత ఈదీ ఆమిన్ బెదిరింపుల కారణంగా అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీలో పటేల్ జన్మించారు. యూనివర్శిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అనంతరం, యూనివర్శిటీ కాలేజ్ లండన్‌లో న్యాయ విద్యను పూర్తి చేశాడు. తదుపరి మియామీ కోర్టుల్లో పబ్లిక్ డిఫెండర్‌గా పనిచేసి వివిధ హోదాల్లో సేవలందించారు. భారత మూలాలున్న తొలి ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా ఆయన ఏ స్థాయిలో సేవలు అందిస్తారన్నది ఆసక్తి రేపుతున్నది.

# ఆ మృతదేహం పిల్లల తల్లిది కాదు

## ఇజ్రాయెల్ అధికారులు ప్రకటన





**టెల్ అవీవ్:** ఇద్దరు పిల్లలు సహా మొత్తం నలుగురి మృత దేహాలను ఇజ్రాయెల్ అధికారులకు అప్పగించిన హమాస్, అందులో, ఆ పిల్లల తల్లి మృత దేహం కూడా ఉందని తెలిపింది. అయితే, పిల్లలు ఎవరనేది గుర్తించామని, హమాస్ అప్పగించిన మహిళ మృత దేహం వారి తల్లిది కాదని ఇజ్రాయెల్ ప్రకటించింది. తమ వద్ద బందీగా ఉండి, చనిపోయిన నలుగురు ఇజ్రాయెలీల మృతదేహాలను, గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్‌కు హమాస్ అప్పగించిన విషయం తెలిసిందే. అయితే, ఆ సంస్థ అప్పగించిన ఒక మృతదేహం తమ దేశానికి చెందిన మహిళది కాదని ఇజ్రాయెల్ పేర్కొంది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ ఉల్లంఘించిందని ఆ ప్రకటనలో విమర్శించింది. షిర్ బిబాస్, ఆమె ఇద్దరు కుమారులు ఎరియల్, కఫీర్‌లతో పాటు ఇంకొకరి మృతదేహాన్ని ఖాన్ యూనిస్‌లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అప్పగింతకు ముందు శవ పేటికలను ప్రదర్శనకు ఉంచడాన్ని ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు ఖంటడించాయి. ఇలావుంటే, షిర్ బిబాస్ పేరుతో స్వాధీనం చేసిన మృత దేహం ఆమెది కాదని శవపరీక్షలో స్పష్టమైనటుట ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్‌నీరోజ్ ప్రాంతం నుంచి 2023 అక్టోబర్ 7న వీరిని హమాస్ అపహరించింది. ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో వీరు మృతి చెందినట్టు హమాస్ ప్రకటించింది. కానీ, ఇజ్రాయెల్ మాత్రం హమాస్ ఉద్దేశపూర్వకంగా వారిని హతమార్చిందని విమర్శించింది. బందీలను చంపడం ద్వారా, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నదని ఆరోపించింది.

## బస్సుల్లో వరుస పేలుళ్లు..



ఇలావుంటే, ఇజ్రాయెల్‌లోని బాట్‌యామ్ నగరంలో అగి ఉన్న మూడు బస్సుల్లో బాంబు పేలుళ్లు సంభవించాయి. దీనిని ఉగ్రవాద చర్యగా అనుమానిస్తున్న పోలీసులు, పేలుళ్లలో ఎవరూ గాయపడలేదని ప్రకటించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, బాట్‌యామ్‌లోని పార్కింగ్ ప్రదేశంలో ఉన్న మూడు బస్సుల్లో ఈ పేలుళ్లు చోటు చేసుకున్నాయి. ఉసమాచారం అందుకున్న వెంటనే బాంబ్ స్క్వాడ్ ఆ ప్రాంతానికి వెళ్లి, తనిఖీలు చేపట్టింది. మూడు బస్సుల్లో పేలుళ్లు సంభవించగా, మరో రెండు బస్సులో అమర్చిన బాంబులు పేలలేదు. వాటిని నిర్వీర్యం చేశారు. ఈ ఘటన వెనుక కారణాలను అన్వేషిస్తున్న దర్యాప్తు బృందం, అనుమానితుల కోసం వేట మొదులు పెట్టింది.

## పరీక్షకు అనుమతి (మొదటి పేజీ తరువాయి)

పాఠశాలల్లో మాత్రం మార్పు రావడం లేదు. కేవలం డబ్బులు చెల్లించే వారికే ప్రాధాన్యత ఇస్తూ చదువు కొనుక్కునే విధంగా చేస్తున్నారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకునే విద్యార్థులను ఫీజుల పేరుతో ఇబ్బందులు పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని ఆనేక పాఠశాలల్లో ఫీజులు చెల్లించాలని, లేకపోతే పరీక్షలకు అనుమతించమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రజాపతినిధికి చెందిన విద్యా సంస్థలో సైతం ఇలాంటి వ్యవహారం జరిగిందని, ఫీజుల చెల్లింపుపై వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి, అలాగే గోదావరిఖని, పెద్దపల్లికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వ్యవహరించిన తీరు వివాదస్పదంగా మారినట్లు సమాచారం. ఫీజు చెల్లించని విద్యార్థులను తరగతి గదుల్లో తోటి విద్యార్థుల ముందు నిలబెట్టి అవమానపర్చుతున్నట్లు తెలిసింది. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇంటింటికి తిరిగి ఫీజులో రాయితీ, నాణ్యమైన బోధన అంటూ మాయమాటలు చెప్పి అడ్మిషన్‌లు తీయించుకుంటున్నారు. అటు తర్వాత విద్యాసంవత్సరం మధ్య నుంచి ఫీజుల వసూళ్లకు తెరలేపుతున్నారు. ఫీజుకట్టకపోతే ఈ విద్యాసంవత్సరం వెనుకబడి పోవాల్సి వస్తుదనే భయంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుసప్పో చేసి ఫీజులు చెల్లిస్తున్నట్లు ఓ విద్యార్థి తండ్రి వాపోయాడు. ముందుగానే తాము ఫీజు చెల్లించే పరిస్థితిలో లేమని చెప్పినా వినకుండా పాఠశాలలో చేర్పించుకున్నారని, అటు తర్వాత ఫీజుల కోసం పిల్లలను వేదింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపించాడు. అంతేకాకుండా పాత్రికేయుల విషయంలో సైతం పాఠశాలల యాజమాన్యాలు జిల్లా విద్యాధికారి ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించాలంటూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేస్తుంటారు. కానీ అలాంటివి పట్టించుకోకుండా సమాజంలో సేవ చేసే జర్నలిస్టులను సైతం ఫీజుల పేరుతో వేధింపులకు గురి చేసిన సంఘటనలు ఉన్నాయి. ఫీజుల పేరుతో విద్యార్థులు, తల్లిదండ్రులను వేధింపులకు గురి చేస్తూ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు.

## స్వయం ఉపాధి (మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ శాఖలో పథకాల అమలుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం ఎస్‌సి,ఎస్‌టి,బిసి మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పలు అంశాలపై సమీక్షించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించి అద్దెలు, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా ఉన్న బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బకాయిలకు సంబంధించి శాఖల అధికారులు బాధ్యత తీసుకుని ఆర్థికశాఖ నుంచి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయించుకోవాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు సంక్షేమ హాస్టలు, గురుకులాల్లో పర్యటన కార్యక్రమం నిరంతరం కొనసాగేలా సంక్షేమ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖల నుంచి ఎస్‌సి, ఎస్‌టి, శాఖలకు రావలసిన నిధులపై కసరత్తు చేసి తగిన విధంగా పర్యవేక్షించాలన్నారు. కేంద్ర పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు రాబట్టడంలో వేగం పెంచాలని అధికారులను డిప్యూటీ సిఎం కోరారు. ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది మంది గిరిజనులకు భూ పంపిణీ జరిగిందని, ఈ భూముల అభివృద్ధికి ఎస్‌సి, ఎస్‌టి శాఖల అధికారులు విద్యుత్తు, వ్యవసాయ, అటవీ, ఉద్యాన శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఈ భూముల్లో సోలార్ పవర్ ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రచించి రానున్న రెండేళ్ళలో ఫలితాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి ఆవాసాల్లో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆ వర్గాల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని, సంక్షేమశాఖ అధికారులు వివిధ వర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఏ సూచన చేసినా అమలు చేయడానికి సిద్ధంగా ఉంద ని డిప్యూటీ సిఎం భరోసా ఇచ్చారు. సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎస్‌సి కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్‌టి కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, ఇరిగేషన్ సెక్రటరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌దే పాపం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీశ్‌రావులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ''తెలంగాణలో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రాజెక్టుల లో పారాల్సిన కృష్ణా జలాలను రాయలసీమ, ముచ్చుమర్రి ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా తరలించుకుపోతుంటే నాటి ఆంధ్రప్రదేశ్ సిఎం జగన్‌మోహన్ రెడ్డికి వీర తిలకం పెట్టి, పంచబక్షాలు పెట్టింది నువ్వు కాదా? నువ్వు చేసిన పాపం మాకు(పాలమూరుకు) శాపమైంది. మాకు ఉరి అయింది. తొందరలోనే ఎపి ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి, రోజుకు పది టిఎంసిల చొప్పున తీసుకెళ్తే, ఒక్క నెల రోజులు మనం కళ్ళు మూసుకుంటే శ్రీశైలంలో మొత్తం 300టిఎంసిలను తరలించుకుపోయేందుకు పునాదులు వేసింది మీరు కాదా? సాగు నీటి శాఖ మంత్రిగా ఐదేళ్ళు హరీశ్‌రావు, ఐదేళ్ళు కెసిఆర్‌లే కదా ఉన్నది. అయినా పాలమూరు రంగారెడ్డి అక్కడే ఆగిపోయింది. కల్వకుర్తి అక్కడే ఉండిపోయింది కోయిల్‌సాగర్ ఆగిపోయింది. ఆర్‌డిఎస్ అట్లనే ఉండిపోయింది. మా ప్రాజెక్టులను ఎందుకు పదేళ్ళలో పూర్తి చేయలేదు? మా కష్టాలను ఎందుకు తీర్చలేదని'' విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ళలో రూ.2లక్షల కోట్లు ప్రాజెక్టులపై ఖర్చు పెడితే, అందులో వేల కోట్లు కమీషన్‌లుగా చంద్రశేఖర్‌రావు మింగారని, అయినా రూ.లక్షకోట్లతో కట్టిన కాళేశ్వరం కుప్పకూలిపోయిందని, ఆ పాపం మీది కాదా చంద్రశేఖర్‌రావు అని నిప్పులు చెరిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి సిఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో జూపల్లి కృష్ణారావు, చిన్నారెడ్డి, మల్లు రవి, అప్పటి మంత్రిగా ఉన్న డి.కె.అరుణలు కొట్లాడి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రూ.35వేల కోట్లతో మంజూరు చేయించారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. కెసిఆర్ వచ్చాక ప్రాజెక్టు రీడిజైనింగ్ పేరుతో దానిని రూ. 55వేల కోట్లకు పెంచి, టెండర్లు పిలిచి, కమీషన్‌లు మెక్కారని, రంగారెడ్డి– పాలమూరు ప్రాజెక్టుకు జూరాల నుంచి కాకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్స్ నుంచి నీళ్ళు తెచ్చుకునేలా డిజైన్ మార్చారని తెలిపారు. పదేళ్ళలో ఆ ప్రాజెక్టుతో పాటు కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోమల్‌సాగర్, రాజోలిబండ, తుంబిళ్ళ ప్రాజెక్టులు కట్టి ఉండే ఇవాళ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం పెట్టేది కాదని అన్నారు. పదేళ్ళలలో పాలమూరు ప్రాజెక్టులను పడావు పెట్టడంతో, ఈ ప్రాంతం ఎడారిగా మారిందని, ఇప్పుడు ఆ ప్రాజెక్టులపై పగబట్టి ఆన్యాయం జరిగిందంటూ పొంకనాలు చెబుతున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గతంలో దివంగత ఎంఎల్‌ఎ చిట్టెం నర్సిరెడ్డి నాటి సిఎం వైఎస్‌ను మక్తల్–నారాయణ్‌పేట్–కొడంగల్ ఇవ్వాలని కోరారని, తరువాత ఎవరు పట్టించుకోలేదని, తాను 2019లో కొడంగల్ ఎంఎల్‌ఎ అయ్యాక ఆ ప్రాజెక్టును కొట్లాడి సాధించానని చెప్పారు. తన మీద కక్షతో ఆ ప్రాజెక్టును కెసిఆర్ పూర్తి చేయలేదన్నారు. ఇప్పుడు రెండేళ్ళలో పూర్తి చేసి చూపిస్తానని చెప్పారు. రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు మాత్రమే అవుతుందని, ఈ 14నెలల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేశామని తెలిపారు. అంతకు ముందు నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం ఫర్ణికారెడ్డి, మంత్రులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నారాయణపేట జిల్లాఓ దాదాపు 967 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 56 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు. 130 కోట్ల అంచనా వ్యయంతో వైద్య కళాశాల నూతన హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేశారు. 26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనం, 40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. రూ. 5.58 కోట్ల వ్యయంతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేటలో నిర్మించిన రూరల్ పోలీస్ స్టేషన్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. 1.23 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించే పెట్రోల్ బంక్‌ను ప్రారంభోత్సవం చేశారు. అప్పక్ పల్లి గుండిమాల్ రోడ్, మద్దూరు లింగాల్ చెడ్ రోడ్‌లలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 193కోట్ల నిధులతో గుల్బర్గా , కొడంగల్, రావులపల్లి మద్దూరు, కోస్గి , దౌల్తాబాద్ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 12.70 కోట్ల నిధులతో నారాయణపేట నియోజకవర్గ పరిధిలో సిఆర్‌ఆర్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. 7 కోట్లతో మరికల్ లో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి జితేందర్ , ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ , జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ , ఎమ్మెల్యేలు ఫర్ణికారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, వీర్లపల్లి శంకర్ , కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్కార్ విఫలం (మొదటి పేజీ తరువాయి)

అన్నారు. హైదరాబాద్ నాం పల్లిలోని టిజెఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటి పంపకాల్లో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు 10 ఏళ్ల పాలనలో ఏమీ చేయకుండా ఇప్పుడు మాట్లాడుతున్నారని అన్నారు. పదేళ్లపాటు మౌనం వహించి, ఇప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు. తెలంగాణ హక్కుల కోసం ఇప్పటికైనా కేంద్రం వెంటపడాలని సూచించారు. నీటి పంపాకాల్లో కేంద్రం తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. కృష్ణా బేసిన్‌లో ఏపి గతంలో కంటే ఎక్కువ నీటిని తరలించుకుంటోందన్నారు. కెఆర్‌ఎంబి తక్షణం జోక్యం చేసుకుని, ఆంధ్రప్రదేశ్‌ను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఒక అడుగు కూడా వెనక్కి వేయకూడదన్నారు.

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీన్ ఛానల్ కోరుతాం..**

ఉద్యోగుల హెల్త్ కార్డులు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని కోదండరాం చెప్పారు. రాజలింగమూర్తి హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు. నిందితులను తక్షణమే పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోదండరాం డిమాండ్ చేశారు. బిసి కుల గణన సాధారణ విషయం కాదని, కేంద్రం దానిని పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం తమ తల మీద వేసుకొని, కుల గణన ప్రారంభించి, తుది నివేదిక ఇచ్చిందన్నారు. ముస్లిం వెనుకబడిన వర్గాలకు కూడా రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్య, ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

**అవగాహన లేకుండా మాట్లాడుతున్న బండి సంజయ్..**

రాజ్యాంగం పట్ల అవగాహన లేకుండా బండి సంజయ్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. రాజ్యాంగ పరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మొహమాటం పడకుండా బిసిల వర్గీకరణపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఇంకా నాలుగు ఏళ్లు సమయం ఉందని, మాకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్‌ను అడుగుతామని కోదండరాం స్పష్టం చేశారు.

**ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి : కోదండరాం పిలుపు**

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానంలో వై. అశోక్ కుమార్‌కి మద్దతు ఇస్తున్నామని కోదండరాం వెల్లడించారు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి పన్నాల గోపాల్ రెడ్డికి మద్దతు తెలుపుతున్నామని ప్రకటించారు. ఉపాధ్యాయ, సామాజిక ఉద్యమాల్లో ఆయన పాల్గొనడం, విద్యారంగంలో ప్రాముఖ్యత కలిగి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతు కోరిందని, పొత్తు ధర్మంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థిని బలపరుస్తున్నామని తెలిపారు. తెలంగాణ జన సమితి బలపరిచిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోదండరాం పిలుపునిచ్చారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, కుల గణన చేపట్టి, విద్యా, వైద్య రంగాల్లో అభివృద్ధి అవకాశాలు పెంచిందన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు కూడా ఒక ముఖ్యమైన నిర్ణయమన్నారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్ కుమార్, నాయకులు సర్దార్ వినోద్ కుమార్, హన్మంత్ రెడ్డి, సత్యనారాయణ, రామ్ చందర్, ప్రశాంత్ పెరల, పుష్పలిల, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో విద్యారంగం

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో విద్యారంగం ఎలా బాగుపడుతుందని ప్రశ్నించారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యా నారాయణ రెడ్డి భవన్‌లో జరిగింది. సమావేశంలో ఎన్.ఎ.స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ తదితరులు ప్రసంగించారు. స్టాలిన్ మాట్లాడుతూ ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యుజిసి) 2025 జారీచేసిన ముసాయిదా మార్గదర్శకాలు ప్రభుత్వం విద్యా వ్యవస్థను ధ్వంసం చేయడానికి, ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీలలో నియమించడానికి తీసుకుంటున్న చర్యలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10 శాతం నిధులు, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ వాటిని కేంద్ర ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర విభజన సమస్యలపైనా ఎలాంటి ప్రకటన చేయలేదని, ఐఐటి, ఐఐఎం, నవోదయ, సైనిక్ స్కూల్ మంజూరు చేయాలని డిమాండ్ ఉన్నప్పటికీ వాటి ఊసే లేదని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి స్కీమ్‌లో భాగంగా రాష్ట్రానికి కేంద్రం నుంచి రూ.1,800 కోట్లు రావాల్సి ఉన్న కేటాయింపు లేదని అన్నారు. పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా ఇంకా విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న విద్యాసంస్థలపై ప్రత్యక్ష దాడులు తప్పవని మెచ్చరించారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పూర్తి నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే మూడు సంవత్సరాలలో కృష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్ట్ లను అన్నింటిని పూర్తి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రాజెక్టులను గత పదేళ్లలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవము కాదా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను తాకట్టు పెట్టి దాదాపు రూ.1.81 లక్షల కోట్లు అప్పులు తీసుకొచ్చినా కృష్ణా జలాల విషయంలో అన్యాయం చేసింది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కృష్ణా బేసిన్‌లో ఉన్న ఏ ప్రాజెక్టును కూడా పూర్తి చేయకపోగా నిధులు కేటాయించడంలో కూడా పూర్తి నిర్లక్ష్యం వహించారని, ఫలితంగా ప్రతి ఏటా 100 టిఎంసిల నీటిని నిలువ చేసుకునే సామర్థ్యాన్ని దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులు కోల్పోయాయని ఆయన విమర్శించారు. నల్గొండ జిల్లాలోని ఎస్‌ఎల్‌బిసి సొరంగం ద్వారా నిండే రిజర్వాయర్స్ కెపాసిటీ 10 టిఎంసిలు, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ రిజర్వాయర్స్ కెపాసిటి 25 టిఎంసిలు, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ రిజర్వాయర్స్ కెపాసిటి 65 టిఎంసిలకు సంబంధించిన ఈ మూడు ప్రాజెక్టులే కాకుండా కృష్ణా బేసిన్‌లోని వివిధ దశలలో ఉన్న ఇతర ప్రాజెక్టులకు బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించకుండా పూర్తి నిర్లక్ష్యం వహించి దక్షిణ తెలంగాణలో కరువు పరిస్థితులను తెచ్చింది బిఆర్‌ఎస్ హయాంలోనే కాదా మంత్రి నిలదీశారు. గత పదేళ్ల నుండి వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణ కూడా చేయకుండా బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, దీంతో ఆ ప్రాజెక్టుల నిర్మాణం ముందుకు కొనసాగలేదన్నారు. కృష్ణా బేసిన్‌లోని కొన్ని ప్రాజెక్టులలో కాలువలు, డిస్ట్రిబ్యూటర్స్ నిర్మాణం అసంపూర్తిగా ఉన్న విషయం వాస్తవం కాదా, కృష్ణా బేసిన్‌లోని సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడానికి గత పదేళ్లు పరిపాలించిన అప్పటి సిఎం కెసిఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు కారణం కాదా చెప్పాలన్నారు.

# పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లింది




## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

### సిపిఐ కార్యాలయంలో 'రెడ్ బుక్ డే' పంపిణీ

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక రెడ్ బుక్ డే విడుదల సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని భాషలలో అచ్చు అయి నేటికీ ఎక్కువ సంఖ్యలో కమ్యూనిస్టు ప్రణాళికను అధ్యయనం చేస్తున్నారని, దాని మార్గంలో కొనసాగేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలో మతోన్మాదులు మూఢ నమ్మకాలు పెంచి పోషిస్తున్నారని, వారికి సైన్స్ మీద నమ్మకం ఉండదని, ప్రపంచ మానవాళి మనుగడ కోసం కమ్యూనిస్టులు బూర్జువా వర్గంపై నిరంతరం పోరాడుతున్నారని, సైన్స్‌ను, భౌతిక వాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. నేటి కార్పొరేట్ యుగంలో మూఢ మూఢనమ్మకాల విస్తృత ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారని, వేగంగా మానవుడు కంప్యూటర్ యుగంలో కొనసాగుతున్న నేటి సందర్భంలో దేశంలో జాతీయ వాదం పేరుతో వారు అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నారని అన్నారు. పెట్టుబడుదారి వ్యవస్థ బలపడే కొద్దీ సమాజంలో అంతరాల పెరుగుతాయని, పెట్టుబడిదారి వ్యవస్థలో నిరుద్యోగం పెనుభూతంలా కొనసాగుతుందని అన్నారు. కమ్యూనిస్టు ప్రణాళిక ఏర్పడి 177 సంవత్సరాలు కొనసాగుతున్నా ప్రపంచంలో అన్ని భాషల్లో ఎక్కువగా ప్రచురితం అయ్యి ప్రజలు చదువుతున్నారని, కారల్ మార్క్స్, ఎంగెల్స్.. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు ఎలా దోపిడీ గురవుతున్నారో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పెట్టుబడిదారి వ్యతిరేకంగా సమాజ స్థాపన కోసం అంతరాలేని సమాజం కోసం బానిస సమాజానికి వ్యతిరేకంగా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా.. వెట్టిచాకిరి ఎనిమిది గంటల పని విధానం కోసం ఎలా ఉద్యమించాలో తెలిపారన్నారు. ప్రపంచ గతిని మార్చిన కమ్యూనిస్టు ప్రణాళికను కార్యకర్తలు నాయకులు ఎక్కువ సంఖ్యలో నిరంతరం అధ్యయనం చేయాలని, దేశ పరిస్థితులను ఆ ప్రాంతంలో పరిస్థితులను అధ్యయనం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్క్స్ ఎంగెల్స్.. రచనలను. చదవాలని నిరంతరం అధ్యయనం సమాజాన్ని మార్పు కోసం సమాజ స్థాపన కోసం ముందుకు సాగాలని ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు కోరారు. అనంతరం కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకాలను మరి పార్టీసాహిత్యాన్ని కార్యకర్తలకు నాయకులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లెరు వీరస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి, నాయకులు బత్తిని సదానందం, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, కండె నరసయ్య, దామెర సుదర్శన్, ఏదునూరి వెంకటరాజం, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 1,2 తేదీల్లో ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను మార్చి1,2 తేదీలలో మేడ్చల్ జిల్లా ఈసిఐఎల్ లోని లయన్స్ క్లబ్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర చెప్పారు. ఈ సమావేశాలకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో వారు విడుదల చేశారు. ఈ సమావేశాలలో మొదటి రోజు 'సాంకేతికత, అభివృద్ధి, నిరుద్యోగ సమస్య' అనే అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రెండవ రోజు సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న యువజన విధానాలపై చర్చించి నిర్దిష్టమైన ప్రణాళికలను పాలకులకు పోరాటాల ద్వా రా తెలియజేయనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, నాయకులు కళ్యాణ్ పాల్గొన్నారు.




# మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే లక్ష్యం





## సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/నారాయణపేట :** మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా మహిళా సంఘాల సభ్యులకు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. నారాయణపేట జిల్లాలోని సింగారం ఎక్స్ రోడ్డు వద్ద రూ.1.30 కోట్ల వ్యాయంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులు శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి జిల్లాకు ఒక పెట్రోలు బంకు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తామన్నారు. మహిళలు తమ కాళ్లపై నిలబడితే వారి కుటుంబంలోనే పదిమందికి సహకరించే విధంగా ఉంటారని వచ్చిన ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా తమ పిల్లల భవిష్యత్తుకు ఖర్చు చేస్తారని తెలిపారు. మహిళల అభివృద్ధి ద్వారా వారి కుటుంబం గౌరవంగా బతకడానికి ఉపయోగపడుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐకెపి ద్వారా మహిళలకు పెట్రోల్ బంకులు, 600 ఆర్టీసీ బస్సుల యజమానులుగా తయారుచేయడం జరిగిదన్నారు. దేశంలో మొదటిసారిగా సోలార్ పార్కుల ద్వారా 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలు వ్యాపారం చేసుకొని చేసుకొని అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో మహిళా సంఘాల సభ్యులు రూపొందించిన ఉత్పత్తులను కార్పొరేట్ స్థాయిలో మార్కెటింగ్ చేసుకునే విధంగా మూడు ఎకరాల స్థలంలో వెయ్యికోట్ల రూపాయలతో ఆకర్షణీయమైన మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె.అరుణ, స్థానిక ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్ ,చీఫ్ సెక్రటరీ శాంతి కుమార్, సర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొన్నారు.

**సిరులతల్లిని దర్శించుకున్న సిఎం**

**సాంప్రదాయ పద్దతిలో పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి**

**ప్రజాపక్షం / కొడంగల్ :** పోలేపల్లి ఎల్లమ్మ దేవత బ్రహ్మోత్సవాలలో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయానికి చేరుకున్నారు. ముందుగా పట్టు వస్త్రాలతో వచ్చిన ముఖ్యమంత్రికి ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు సమక్షంలో అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలోని హోమగుండం వద్ద అర్చకులు సిఎంతో పాటు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చెవెళ్లే ఎమ్మెల్యే కాలే యాదయ్య, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డిలకు తీర్థ ప్రసాదాలతో పాటు ప్రముఖులకు షాలువా, తలపాగాలతో సన్మానించారు. రేవంత్‌రెడ్డి తన ప్రత్యేక పూజలతో అమ్మవారిపై ఉన్న తన సెంటిమెంట్ భక్తిని చాటుకున్నారు. తన రాజకీయ ప్రస్థానానికి పోలేపల్లి ఎల్లమ్మ దేవత కరుణకటక్షాలు ఉన్నాయని నమ్ముతున్నారు. ఈ మేరకు నారాయణపేట జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ నిర్మాణ పథకం ప్రారంభం నాడు అమ్మవారి దర్శనం కలిసి వస్తుందని సెంటిమెంట్‌గా నమ్మినట్లు విశ్వసనీయ సమాచారం. సిఎం దేవస్థానానికి కాన్వాయ్‌లో రావడంతో భక్తులు పూల వర్షంతో స్వాగతించారు. ఈసారి జాతర భక్తులకు సిఎం రాక ప్రత్యేకం కావడంతో బ్రహ్మోత్సవాలలో జిల్లా కలెక్టర్, అధికారులు సకల సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు జాతర ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును నియమించారు. సిఎంతో పాటు వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నారాయణపేట గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కొడంగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మండల పార్టీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పిఏసిఎస్ చైర్మన్ కట్కం శివకుమార్ గుప్త, జయకృష్ణలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీతో.. తెలంగాణలో సాగు, తాగునీటికి కటకట

## మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ దాచిపెట్టుకున్న కృష్ణా నీళ్లను ఆంధ్రప్రదేశ్ ఎత్తుకెళ్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మాజీ ఎంఎల్‌ఎలు గ్యాదరి కిశోర్, బొల్ల మల్లయ్య యాదవ్‌లతో కలిసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా నీళ్ల దోపిడీ జరుగుతున్నదని, అడ్డుకోవాలని హరీశ్ రావు సలహా ఇచ్చారన్నారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల్లో వాటాకు మించి ఏపి నీళ్లు తీసుకెళ్తున్నదన్నారు. సాగర్ ఎడమ కాలువ కింద సాగు, తాగునీటికి ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మన హక్కుగా ఉన్న 123 టిఎంసిల గురించి మాట్లాడాలన్నారు. నీటి విషయంలో మంత్రులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఏపి నీటి దోపిడీతో తెలంగాణలో సాగు, తాగు నీళ్లకు కటకట ఏర్పడే పరిస్థితి ఉందని హరీశ్ రావు చెప్పారన్నారు. ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ చెత్త మాటలు మాట్లాడారన్నారు. ఉత్తమ్ కుమార్ ఎవరో రాసిచ్చింది చదివారన్నారు. రేవంత్ రెడ్డి తిట్లతో సిఎం అయ్యారని, తాను కూడా అదే భాషతో మాట్లాడితే ముఖ్యమంత్రి అవుతానని ఉత్తమ్ అనుకుంటున్నారేమో అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ అన్యాయం చేసింది కాంగ్రెస్, బిజెపిలే అన్నారు. తెలంగాణకు సరైన నీటి వాటా దక్కకపోవడానికి చంద్రబాబు, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్, బిజెపిలే కారణమని ఆరోపించారు. జగన్ సిఎంగా రాష్ట్రానికి వస్తే గౌరవించుకోవద్దా అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కెసిఆర్‌ను విమర్శించడానికి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి సిగ్గుండాలన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న వారికే కెఆర్ఎంబి అధికారులతో మాట్లాడి తెలంగాణకు రావల్సిన నీళ్లు సాధించడం చేతకాదా అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు.

# సాగునీటిని విడుదల చేసి అన్నదాతలను ఆదుకోవాలి

## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు లేఖ



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** రైతుల ప్రయోజనాల దృష్ట్యా సాగునీటిని పంపింగ్ చేయాలని.. ఆందోళనలో అన్నదాతలను ఆదుకోవాలని యాసంగిపంటకాలం పూర్తి అయ్యేంత వరకు పంట పోలాలకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి హరీష్‌రావు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసారు. ఈమేరకు శుక్రవారం సిద్దిపేటలో విడుదల చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో గత నాలుగు సంవత్సరాల నుండి యాసంగి పంటకు నియోజక ప్రాంతంలోకి రంగనాయక్ సాగర్ కాల్వల ద్వార రైతులకు సాగునీటిని అందిసుతన్నట్లు తెలిపారు. ఈయేట యాసంగి పంటకాలం ముగిసేవరకు సాగునీటిని అందించాలని రైతుల పక్షాన ఎంఎల్ఏ హరీష్‌రావు రాష్ట్ర నీటిపారదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని లేఖలో కోరారు. రంగనాయక్ సాగర్ సాగునీటితో రైతులకు మంచి రాబడి పెరిగిందన్నారు. రంగనాయక్ సాగర్ కింద ప్రతియేట గణనీయంగా రాబడి పెరిగిందన్నారు. ఈయేట 50 వేల ఎకరాల్లో పంట ఉందన్నారు. రంగనాయక్ సాగర్‌లో ఇటీవల 2.4 టిఎంసిల నీరు పంపింగ్ చేశారు. ప్రస్తుతం రంగనాయక్ సాగర్‌లో 1.85 టిఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని ఇంకా 2.5 టిఎంసీల నీరు అవసరం ఉందన్నారు. మిడ్ మానేరు నుండి రెండు విడుతలుగా రంగనాయక్ సాగర్ నీళ్లు పంపింగ్ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాని కోరారు. రైతులు సాగునీరు లేక తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. గత నాలుగు సంవత్సరాల నుండి యాసంగి రైతులకు సాగునీరు అందించామని, ఈ యాసంగి పంట కాలం పూర్తయ్యే వరకు రైతుల పంట పోలాలకు సాగునీరు అందించాలని సిద్దిపేట నియోజక వర్గం రైతుల పక్షాన తమరికి విజ్ఞప్తి చేస్తున్నట్లు మాజీ మంత్రి లేఖలో పేర్కొన్నారు.

# తక్షణం 'అడ్వకేట్ యాక్ట్ 2025' సవరణను ఉపసంహారణ

## ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతదేశంలోని న్యాయవాదులతో ఎన్నికైన రాష్ట్ర, జాతీయ బార్ కౌన్సిల్ ఉనికిని దెబ్బతీసి నీరుగార్చే పద్దతుల్లో 'అడ్వకేట్ యాక్ట్–2025'కు సవరణలు తీసుకురావడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఈ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకుని జాతీయస్థాయిలో విస్తృత చర్చలు జరపాలని ప్రభాకర్ ఒక ప్రకటనలో కోరారు. ముఖ్యంగా ఈ సవరణ చట్టంలో సమ్మె చేసే హక్కును రద్దు చేయడం, బార్ కౌన్సిలపై రిటైర్డ్ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఇతర వ్యక్తులకు ప్రమేయం కల్పించడం అప్రజాస్వామికమైనదని, అది న్యాయవాదులకు ఆమోదయోగ్యం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి బడ్జెట్‌లో నిధులు కేటాయించడానికి బదులుగా వ్యక్తుల దాతృత్వం, సంపన్నుల దయా దాక్షిన్యాలపై ఖర్చులను సంపాదించుకునే విధంగా ఈ చట్టంలో పేర్కొనడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదుల సంఘాలలో ఇతర వ్యక్తుల జోక్యం తీసుకురావడం సరైంది కాదని, రాజ్యాంగం, చట్టాల పరిరక్షణకు న్యాయస్థానాలలో ప్రజలు, కార్మికులు, అవసరమైన వారి కోసం కృషి చేసే న్యాయవాదుల ప్రాథమిక హక్కులను భంగపరిచే ఈ చట్ట సవరణ తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. ఈ చట్టంలో ఉన్న లొసుగుల తొలగింపునకు బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్, ప్రజాప్రతినిధులు తమ గళాన్ని వినిపించాలని ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.


# మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడి ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ లొంగుబాటు

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నిషేదిత సిపిఐ మావోయిస్టు పార్టీ గొత్తికోయ ఏరియా కమిటీ సభ్యురాలు, కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్య నారాయణ రెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా ఆలియాస్ జిన్ని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయింది. ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, పామెడ్ మండలం, రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా తండ్రి హిడ్మా కూడా (ప్రస్తుతం ఇతను జెలులో వున్నాడు) మావోయిస్టు పార్టీలో పని చేసేవాడని, దీనితో కేషా కూడా బాల్యంలో చెతన్య నాట్య మండలి పని చేయడంతో మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులతో పరిచయాలు కావడంతో 2017లో పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ గొట్టే కమల ద్వారా మావోయిస్టు పార్టీలో చేరిన కేషా రెండు సంవత్సరాలు పాటు పున్నెం జోగ ఆధ్వర్యంలో చెతన్య నాట్యమండలిలో పనిచేసిందని, ఇదే సంవత్సరం కేషాను పార్టీ నాయకత్వం అబుజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసి కేంద్ర కమిటీ సభ్యుడు కడారీ సత్యనారాయణ రెడ్డికి ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించిందని, 2021 సంవత్సరంలో కేంద్ర మవోయిస్టు నాయకత్వం కేషాను ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించడం జరిగిందన్నారు. 2022 డిసెంబర్ వరకు ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసి కేషా మరో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు రమేష్‌ను (ప్రస్తుతం మహరాష్ట్ర జెలులో వున్నాడు ) వివాహం చేసుకొని ఉత్తర బస్తర్ డివిజన్లో కొద్ది కాలం పనిచేసిందని, అనంతరం 2024 ఎప్రిల్ మాసంలో తిరిగి కంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయణ రెడ్డి అలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ మహిళా కమాండర్ బాధ్యతలు చేపట్టిందన్నారు. పార్టీలో పనిచేసిన సమయంలో కొహిలబేడా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీ సభ్యులతో కల్సి పోలీసులపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయబడిన సంఘటనతో పాటు, అబుజ్‌మడ్‌లో ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించాడు. ఈ రెండు సంఘటనల్లో వనజం కేషా నిందితురాలు అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు అకర్షితులు కావడంతో పాటు, ప్రధానంగా తాను సురక్షితంగా లొంగుబాటు అయ్యేందుకు పూర్తి సహయ సహకారాలు అందిస్తామని వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఇచ్చిన వాగ్దానంతో పాటు ప్రస్తుతం మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కుడా సహకరించకపోవడంతో కేషా లొంగిపోయిందని. పోలీసుల ఎదుట లొంగిపోయిన వంజెం కేషాపై 4లక్షల రూపాయల ప్రభుత్వ రివార్డు వున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.




# ఏప్రిల్‌లోగా పెండింగ్ బిల్లులు, డిఏల చెల్లింపులు

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సిఎం హామీ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** రాబోయే ఏప్రిల్‌లోగా పెండింగ్ బిల్లులను, 2 డిఏలను చెల్లిస్తామని, ఇతర ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం శుభసూచకమని టిఎన్‌జిఒ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. కరీంనగర్‌లోని టిఎన్‌జిఒ సంఘ కార్యాలయంలో జరిగిన ఉద్యోగ సంఘ నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యోగుల సమస్యలను ఏకరువు పెట్టగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ప్రతి సమస్యకు తాను ముందుండి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ క్రమంలో త్వరలోనే తెలంగాణ ఎన్‌జిఒల సంఘం 80వ సంవత్సర వేడుకలను హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ బిల్లులు, ఉద్యోగుల డీఏలు, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. టిఎన్‌జిఒల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహస్వామి, రాగి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మీందర్‌సింగ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, టీజీవోల జిల్లా సంఘం అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్, కార్యదర్శి అరవింద్ రెడ్డి, మాజీ టిఎన్‌జిఒల సంఘం నాయకులు ఎంఏ.హమీద్, రాజయ్య గౌడ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నాగేందర్, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్ రావు, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, నాయకులు ప్రసాద్‌రెడ్డి, కోట రామస్వామి, శంకర్, సునీత, సబితా కొండయ్య, నగేష్ గౌడ్, శైలజ, విజయలక్ష్మి, అభిషేక్ రెడ్డి, శారద, బోనాల రవి, అరసవెల్లి రాజేశ్వర్‌రావు, మల్కా రాజేశ్వర్‌రావు, నాగుల అనిల్, అనిల్ కుమార్ తదితరులున్నారు.

# సిఎంలు మారారు తప్ప.. పాలన మారిందా?

## మార్పు పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం : కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రులు మారారు తప్ప పరిపాలన మారలేదని, పది సంవత్సరాలలో కేసీఆర్ బంగారు తెలంగాణ అంటూ ఆయన బంగారు కుటుంబం చేసుకున్నారని, మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మోసం చేసిందని, ఆరు గ్యారెంటీల పేరుతో ఆగం చేసిందని తెలంగాణ బిజెపి అధ్యక్షులు, కేంద్ర బొగ్గు, గనుల శాఖామంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. త్వరలో జరగబోయే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్రానికి దిశా నిర్దేశం చేస్తాయని, సమగ్ర అభివృద్ధి బిజెపితోనే సాధ్యమన్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మాయా గార్డెన్స్‌లో బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో పూర్తిగా ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని, ముఖ్యమంత్రి మారారు తప్ప ప్రజల బతుకులు మాత్రం మారలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈనెల 27న జరుగనున్న టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి మాత్రమే అన్ని స్థానాలకు పోటీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, ప్రకటనలు ఫస్ట్ పేజీల్లో ఉన్నాయని తెలిపారు. 14 నెలలు అయినా జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల భర్తీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐదు డిఏలపై నోరుమెదపడం, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. ఎంపీ ఎన్నికల్లో 8మంది బిజెపి అభ్యర్థులను గెలిపించారని తెలిపారు. బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్, మెదక్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డిలకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బిజెపి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఉద్యోగాల కల్పనలో తెలంగాణదే తొలిస్థానం



**ప్రజాపక్షం / ధర్మపురి :** బిజెపి పాలిత రాష్ట్రాలలో కూడా చేయలేని విధంగా అధికారం చేపట్టిన 14 నెలల కాలంలో ఏకంగా 56వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర పౌరసరఫరాల, ఐటీ శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వుట్కూరి(ఆల్ఫోర్స్) నరేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిలతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పట్టభద్రులు, ప్రయివేట్ టీచర్స్, గెస్ట్ లెక్చరర్లను ఉద్దేశించి శ్రీధర్ బాబు ప్రసంగించారు. ఉద్యోగుల స్థానికత ఇబ్బందులు సడలించే క్రమంలో జీవో 317ను సవరించి వెసులుబాటు కల్పించామని అలాగే ఉద్యోగులైన భార్యభర్తలు ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వి. నరేందర్ రెడ్డి ఆంధ్రా ప్రాంతానికి చెందిన శ్రీ చైతన్య, నారాయణ కాలేజిలకు ధీటుగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి క్రమశిక్షణతో నాణ్యమైన విద్యాబోధన అందించి తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని చెప్పారు. నరేందర్ రెడ్డికి మద్దతు ఇవ్వండి. సమస్యల పరిష్కార బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రభుత్వ విప్ అడ్లూరి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం కోసం ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి వివిఎన్ఆర్ మాట్లాడుతూ 30సంవత్సరాలుగా ఉత్తర తెలంగాణ ప్రజానీకంతో మమేకం అయ్యానని తన గెలుపు పట్ల ఎలాంటి సంశయం లేదన్నారు. పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాల్సిందిగా నరేందర్ రెడ్డి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.దినేష్, వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, చీపిరిశెట్టి రాజేష్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
కాప్రా సర్కిల్ - 1

NIT No. GHMC/KC/E/1/28/2024-25 ప్రకటన తేదీ: 21.02.2025

**పని పేరు:** నిర్వహణ పనులు - 4, **అంచనా విలువ:** రూ.5.85లక్షలు. **ప్రారంభ తేదీ & సమయం:** 22.02.2025న మ.3.00గం.లకు, **బిడ్ల స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 25.02.2025న మ.3.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఎల్.నాగేందర్, ఇ.ఇ., కాప్రా సర్కిల్-1, జిహెచ్ఎంసి. సెల్ నం. 9989930401. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కాప్రా సర్కిల్-1, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 10521-PP/CL/ADVT/1/2024-25, Date: 21-02-2025

ప్రజాపక్షం
శనివారం, ఫిబ్రవరి 22

# ఢిల్లీ పీఠంపై మరో మహిళ

ఢిల్లీ (జాతీయ రాజధాని టెరిటరీ) ముఖ్యమంత్రిగా బిజెపి తొలిసారి ఎమ్మెల్యే శ్రీమతి రేఖా గుప్తతోపాటు మరో అరడజను మంది మంత్రులుగా గురువారం పదవీ ప్రమాణం స్వీకరించటంతో ఢిల్లీలో అధికారంకోసం బిజెపి 26 సంవత్సరాల నిరీక్షణ ఫలించింది. ఈ ఉత్సవాన్ని రాంలీలా మైదాన్‌లో ఏర్పాటు చేయటం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నడ్డా, పలువురు కేంద్రమంత్రులతోపాటు, 13 బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్‌డిఎ కూటమి ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈ వేడుకలో పాలుపంచుకోవటాన్నిబట్టి ఈ పట్టాభిషేకాన్ని బిజెపి ఎంత ఘనమైన ఈవెంట్‌గా నిర్వహించిందో అర్థం చేసుకోవచ్చు. ఫిబ్రవరి 8 వ తేదీని ఎన్నికల ఫలితాలు వెల్లడికాగా 20వ తేదీనగాని ప్రభుత్వం కొలువు తీరలేదు. ముఖ్యమంత్రి పదవికోసం పార్టీలోపల ప్రాంతాలు, కులాలు, సీనియారిటీ, వారసత్వం వంటి క్లెయిములను సంతృప్తి పరచటానికి నడ్డా నాయకత్వంలో పెద్ద కసరత్తు జరిగిందని ఊహించవచ్చు. వాటన్నిటికీ విరుగుడుగా అధినాయకత్వం మహిళా అభ్యర్థిని రంగం మీదకు తెచ్చింది. రేఖా గుప్త ఆర్‌ఎస్‌ఎస్, ఎబివిపి శిబిరాలనుంచి బిజెపి రాజకీయాల్లోకి వచ్చారు. ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థి యూనియన్ అధ్యక్షురాలిగా, మూడుసార్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు ఓటమి పొందిన ఆమె ఈ పర్యాయం మంచి మెజారిటీతో గెలిచారు. పైగా ఢిల్లీలో అనాదిగా బిజెపికి బలమైన పునాదిగా ఉన్న బనియా(వర్తక) సముదాయానికి చెందినవారు రేఖ గుప్త(50సం.). శ్రీమతి గుప్త ఢిల్లీకి నాల్గవ మహిళా ముఖ్యమంత్రి, బిజెపికి చెందిన రెండవ మహిళా ముఖ్యమంత్రి. లోగడ పార్టీ జాతీయ స్థాయి నాయకురాలైన సుష్మా స్వరాజ్ ఎన్నికలకు కొద్ది నెలలముందు ముఖ్యమంత్రిగా పంపారు. ఆ ఎన్నికల్లో బిజెపి ఓడిపోయింది. ప్రస్తుత 14మంది బిజెపి ముఖ్యమంత్రుల్లో ఏకైక మహిళ ఆమె.

'డబుల్ ఇంజిన్ సర్కార్'తో పాలన సజావుగా సాగే అవకాశమున్నప్పటికీ ఎన్నికల వాగ్దానాల అమలు అంత సులభం కాదు. ప్రధాని, హోంమంత్రి స్వయంగా అంచెలంచెలుగా ఉచితాల హామీలు పెంచుకుంటూ పోయినందున, 'మోదీ గ్యారంటీ'తో అవి అమలు జరుగుతాయని ఓటర్లు విశ్వసించారు.

కేంద్ర పాలిత ప్రాంతమైన ఢిల్లీలో శాంతి–భద్రతలు, భూములు కేంద్రప్రభుత్వం చేతిలో ఉంటాయి. అంతేగాక ఢిల్లీ పాలనా నిర్వహణ నిర్ణయాలేవైనా ముందుగా లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం పొందాలి. ఐఎఎస్ అధికారులు సైతం కేంద్రం కిందే ఉంటారు. ఈ కారణంగానే మాజీ ముఖ్యమంత్రి ఆప్ నేత కేజ్రీవాల్‌కు ఎల్‌జితో నిరంతరం ఘర్షణ తప్పలేదు. అధికార పరిధిలో పరిపాలన చేయటంకన్నా, పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తిగల రాష్ట్రం ముఖ్యమంత్రిలాగా ఆయన అధికారాలు కోరుకోవటం కూడా కేంద్రంతో ఘర్షణను పెంచింది. కేంద్రంలో అధికారం చలాయిస్తున్న బిజెపి ప్రచారం, ధనం, వీధివీధికీ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల మోహరింపు, ఉచితాల వాగ్దానాలతో కేజ్రీవాల్ పోటీపడలేకపోయారు. అయినా 1.70శాతం ఓట్ల ఆధిక్యతతోనే బిజెపి అధికారంలోకి రాగలిగింది. అధికారం కోల్పోయినా ప్రజాదరణ బలంగా ఉన్న పార్టీగా ఆప్ కొనసాగుతున్నది.

'డబుల్ ఇంజిన్ సర్కార్'తో పాలన సజావుగా సాగే అవకాశమున్నప్పటికీ ఎన్నికల వాగ్దానాల అమలు అంత సులభం కాదు. ప్రధాని, హోంమంత్రి స్వయంగా అంచెలంచెలుగా ఉచితాల హామీలు పెంచుకుంటూ పోయినందున, 'మోదీ గ్యారంటీ'తో అవి అమలు జరుగుతాయని ఓటర్లు విశ్వసించారు. ప్రమాణ స్వీకారం వెనువెంటనే పదవీ బాధ్యతలు చేబట్టిన రేఖా గుప్త మంత్రివర్గం తమ తొలి సమావేశంలో రెండు నిర్ణయాలు తీసుకున్నారు. ఒకటి, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని ఢిల్లీలో అమలు చేయటం. దీనికింద ఆ కార్డు ఉన్న రోగులకు రూ.10లక్షల వరకు (కేంద్రం రూ.5లక్షలకుతోడు రాష్ట్రం రూ.5లక్షలు ఇస్తుంది) ఉచిత వైద్య సహాయం లభిస్తుంది. తమ పథకమే గొప్ప అని కేజ్రీవాల్ ప్రభుత్వం దాన్ని అమలు జరపలేదు. రెండు, కేజ్రీవాల్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టని 14 కాగ్ నివేదికలను తొలి అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టటం. ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఉచిత నగదు సహాయం హామీని చర్చించామని, ఏ కేటగిరీల మహిళలు అర్హులో నిర్ణయించేందుకు మరికొంత చర్చ అవసరమని ముఖ్యమంత్రి చెప్పారు. ఇలాంటివే ఉచితాలు అనేకం ఉన్నాయి. అవి ఉచిత వాగ్దానాలుగా మిగిలితే బిజెపి మూల్యం చెల్లించుకోక తప్పదు!

# ట్రంప్ ఫర్మానాలతో ప్రపంచం పరేషాన్

అమెరికా అనేక దశాబ్దాలుగా తన ఆధిపత్య స్థాపన కోసం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కూటములు ఏర్పాటు చేసుకునేది. నియంతలను బలపరుస్తూ అభ్యుదయ శక్తుల అణచివేతకు, ఊచకోతకు తోడ్పడేది. సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకునేది. తన ఆర్థిక, సైనిక బలంతో ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా జోక్యం చేసుకునేందుకు వెనకాడేది కాదు. తమ ప్రయోజనాల రక్షణ అనే సాకును ముందుకు తెస్తుండేది. సోవియట్ యూనియన్ నాయకత్వంలోని సోషలిస్టు శిబిరం ప్రథమ శత్రువుగా అది సాగించిన ప్రచ్ఛన్నయుద్ధంలో విజయం తదుపరి కూడా, టెర్రరిజాన్ని ప్రపంచానికి పెనుముప్పుగా ప్రచారంలోకి తెచ్చి ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియాల్లో సైనిక జోక్యం చేసుకుంది. 'ప్రభుత్వాలను మార్చటం', 'ప్రజాస్వామ్యాన్ని నేర్పటం' వంటి పెత్తందారీ పోకడలు పోయింది. ఇటువంటి దురహంకార పోకడలన్నింటికీ నాటో కూటమి ఉమ్మడి రక్షణవాదంతో ఐరోపా దేశాలు వత్తాసు పలికేవి. తమ వంతు సైనిక భాగస్వామ్యాన్ని అందించేవి. ఐక్యరాజ్యసమితిలో కలిసికట్టుగా వ్యవహరించేవి. నయా ఉదారవాదం పేరుతో పెట్టుబడికి సంపూర్ణ స్వేచ్ఛ యిచ్చే సరళీకరణ విధానాన్ని ప్రపంచంపై విధించింది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ సిద్ధాంతంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పరస్పరాధారితం చేసింది. దశాబ్దాలుగా అమెరికా విదేశాంగ విధానాన్ని నిర్వచించిన బహుళపక్ష వాదం ట్రంప్ రెండవ పర్యాయం అధ్యక్ష పదవీకాలంలో ఏకపక్షవాదంగా, ఆదేశికవాదంగా మారింది. 'అమెరికా ఫస్ట్', 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (ఎంఎజిఎ–మాగా) దృక్పథం దీన్ని ప్రతిబింబిస్తోంది. 'ప్రపంచ దేశాలు అమెరికా నుంచి ఎంతో తీసుకుంటున్నాయి. కాని అందుకు తగిన రీతిలో మాకు అండగా నిలబడటం లేదు. కాబట్టి వాటిని ఎండగట్టి అమెరికాను బలోపేతం చేయటం' ట్రంప్ తాత్వికతగా ఉంది. అయితే ఈ దృక్పథం వృథా ఖర్చుల తగ్గింపు పేరుతో సామాన్య అమెరికన్‌లను బాధితుల్ని చేస్తున్నది; సంపన్న తరగతులను మరింతగా కుబేరులను చేస్తున్నది. రెండోవైపున, పరస్పర సమాన సుంకాల పేరుతో వాణిజ్య భాగస్వామ్యులపై, 'అక్రమ' ప్రవేశాల పేరుతో వలస ప్రజలపై ట్రంప్ విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో, తమ రక్షణ వ్యయం పెంచుకోకుండా అమెరికాపై ఆధారపడుతున్న ఐరోపా దేశాల మెడలు వంచుతున్నారు ట్రంప్. 'ప్రపంచం ఏమైపోయినా ఫరవాలేదు. నాకు నా అమెరికా యే ప్రధానం' అనే కూపస్థమండూకంలాగా ట్రంప్ పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలిగారు. యుఎస్‌ఎయిడ్ కార్యక్రమాన్ని ఉపసంహరించారు. మరికొన్ని రోజు లు పోతే 'మా సొమ్ముతో పనిచేస్తూ మమ్ము విమర్శించే ఐక్యరాజ్యసమితితో మాకేం పనిలేదు–వెళ్లిపోండి అమెరికా గడ్డ నుంచి అనో లేదా ధనం కేటాయించం' అనో ట్రంప్ హెచ్చరించినా ఆశ్చర్యం లేదు. అయితే ట్రంప్‌తోనే ఈ ప్రపంచ వ్యవస్థ ఆరంభం కాలేదు – నాలుగేళ్లలో ముగిసిపోయే పదవీకాలంతో ముగిసిపోదు.

## గాజా, అభివృద్ధి

తన పదవీస్వీకారం(జనవరి 20)లోపు గాజాయుద్ధంపై ఇజ్రాయిల్–హమాస్ కాల్పుల విరమణ ఒప్పందానికి రాకపోతే తీవ్ర పర్యవసానాలుంటాయని హెచ్చరికతో వారిని ఒప్పందానికి తీసుకువచ్చారు ట్రంప్. ఒప్పందం అమలు మూడంచెల్లో ఒకటి ముగిసింది. ట్రంప్ కార్యసాధకుడని ప్రపంచం అనుకునేలోపు ఆయన నిజ ఉద్దేశ్యం బయటపెట్టారు. 'గాజా ప్రాంతం చాలా భాగం బాంబుదాడులతో నివాసయోగ్యం కాకుండా ధ్వంసమైంది. ఆ భూభాగాన్ని మందుగుండు పేలుడు ప్రభావాలనుంచి శుభ్రం చేయటం సునాయాసం కాదు. అందువల్ల గాజా ప్రాంతంలోని 20లక్షల మంది పాలస్తీనీయులను ఈజిప్టు, జోర్డాన్ తీసుకుని పునరావాసం కల్పించాలి. నదీ తీర సుందర విహార యాత్రా నగరాన్ని నిర్మించి ప్రపంచ పర్యాటక కేంద్రంగా తయారు చేస్తా'రంటూ ట్రంప్ తమ రియల్ ఎస్టేట్ వ్యాపార బుద్ధిని, గాజా, వెస్ట్ బ్యాంక్‌లనుంచి పాలస్తీనియన్‌లను పార ద్రోలి వాటిని ఇజ్రాయిల్‌కు అప్పగించే కుటిలత్వాన్ని వెల్లడించారు. ఈ పథకాన్ని పాలస్తీనియన్‌లు, అరబ్ దేశాలు ఖండించాయి, వ్యతిరేకించాయి. అయితే ట్రంప్ తమ ఆలోచనను విరమించుకున్నారని అనుకోవటానికి వీల్లేదు.

## ఉక్రేన్ ఖనిజ సంపదపై కన్ను

ఉక్రేన్–రష్యా యుద్ధం ముగింపుకోసం ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారన్న వార్తలు ఆహ్వానించదగినవే. అంతమాత్రాన ఆయన శాంతియోధ కాజాలరు. యుద్ధ విరమణ త్వరలో జరిగితే నోబెల్ కమిటీ ఆయనకు ప్రపంచ శాంతి దూత బహుమతిని ఇచ్చినా ఆశ్చర్యం లేదు. యుద్ధంలో భాగస్వాములుగా ఉన్న ఉక్రేన్, యూరోపియన్ యూనియన్‌ను పక్కనబెట్టి యుద్ధం నిలుపుదల ఒప్పందం కోసం రష్యాతో – అధ్యక్షుడు పుతిన్‌తో సంభాషణలు జరపటం, ప్రాతిపదికల ఏర్పాటు, చర్చల కొనసాగింపుకోసం అధికారులను పురమాయించటం యూరప్ నేతల్లో అనుమానాలు పెంచుతున్నది. ఇది ఉక్రేన్‌ను అడ్డం పెట్టుకుని పరోక్ష యుద్ధం సాగిస్తున్న యూరప్ నేతలు తన మార్గంలోకి వచ్చేటట్లు వారిపై ఒత్తిడి చేయటం తప్ప రష్యామీద ప్రేమకాదు. యుద్ధం విరమణ చర్చలు అవకాశంగా అమెరికాతో సంబంధాల పునరుద్ధరణకు మహదవకాశాన్ని రష్యా చూస్తున్నది.




'యూరోపియన్ యూనియన్‌లో సభ్యత్వం ఆశ వదులుకో. నాటోలో చేరిక మరిచిపో' అని ఉక్రేన్ అధ్యక్షుడికి స్పష్టం చేసిన ట్రంప్ – రష్యాతో రాజీకి మీ కోర్కెలేమిటో ఆలోచించుకోమని చెప్పాడు. నీ పదవీకాలం అయిపోయింది. యుద్ధం అడ్డంపెట్టుకుని కొనసాగుతూ నియంతలా వ్యవహరిస్తున్నావు అని కూడా జెలెన్స్కీని హెచ్చరించాడు. రష్యా నాలుగేళ్ల క్రితం ఆక్రమించుకున్న క్రిమియాను, నాలుగు రాష్ట్రాల్లోని రష్యన్‌ల మెజారిటీ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే యత్నాలు మానుకోమని సలహా ఇచ్చాడు.

యుద్ధం కొనసాగించటం, అవసరమైతే తమ సైన్యాలను సైతం దించి ఉక్రేన్‌కు అండగా నిలవాలనుకునే యూరప్ నేతల ఆలోచనలు, యుద్ధాన్ని విరమింపజేసి తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకోవాలనుకుంటున్న ట్రంప్ ఆలోచనలకు మూలం ఒక్కటే – ఉక్రేన్‌లో ఉన్న అపారమైన ఖనిజసంపద, అత్యంత సారవంతమైన వ్యవసాయ భూములు. ట్రంప్ ఉక్రేన్ నుంచి 500 బిలియన్ డాలర్ల రుణం తిరిగి చెల్లింపు ఒప్పందాన్ని డిమాండ్ చేస్తూ, ప్రకృతి వనరులపై అజమాయిషీని తమకు అప్పగించాలని జెలెన్ స్కీని ఒత్తిడి చేస్తున్నట్లు 'టెలిగ్రాఫ్' పత్రిక వెల్లడించింది. కాలమిస్ట్ అంబ్రోస్ ఇవాన్స్ – ప్రిట్‌చార్డ్ కథనం ప్రకారం ట్రంప్ ప్రతిపాదించిన షరతుల ప్రకారం ఉక్రేన్ చెల్లించాల్సిన సొమ్ము మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీపై విధించిన పరిహార చెల్లింపు ప్యాకేజీకన్నా ఎక్కువగా ఉంది. ఉక్రేన్‌లో

"ఉక్రేన్‌లో ఖనిజాల వెలికితీతనుండి భవిష్యత్‌లో వచ్చే ఆదాయంలో 50 శాతం అమెరికాకు చెల్లించాలి. అంతేగాక భవిష్యత్ ఎగుమతి కాంట్రాక్టులను తిరస్కరించే తొలి అధికారం కూడా దానికే ఉంటుంది. ''ప్రజా–స్వామ్యం ప్రథమ శ్రేణిలో'' ఉన్న ఉక్రేన్ స్వేచ్ఛా ప్రపంచం పక్షాన యుద్ధం చేస్తున్నదని కొనియాడిన వారు ఇప్పుడేమో గత మూడు సంవత్సరాలుగా దాని యుద్ధానికి అమెరికా అపారమైన నిధు లు సమకూర్చిందని, అందుకుగాను దాని భవిష్యత్‌ను సంపూర్ణంగా కుదవపెట్టాలని చెబుతున్నారు.

ఖనిజాల వెలికితీతనుండి భవిష్యత్‌లో వచ్చే ఆదాయంలో 50 శాతం అమెరికాకు చెల్లించాలి. అంతేగాక భవిష్యత్ ఎగుమతి కాంట్రాక్టులను తిరస్కరించే తొలి అధికారం కూడా దానికే ఉంటుంది. ''ప్రజాస్వామ్యం ప్రథమ శ్రేణిలో'' ఉన్న ఉక్రేన్ స్వేచ్ఛా ప్రపంచం పక్షాన యుద్ధం చేస్తున్నదని కొనియాడిన వారు ఇప్పుడేమో గత మూడు సంవత్సరాలుగా దాని యుద్ధానికి అమెరికా అపారమైన నిధు లు సమకూర్చిందని, అందుకుగాను దాని భవిష్యత్‌ను సంపూర్ణంగా కుదవపెట్టాలని చెబుతున్నారు.

ఉక్రేన్‌పై పశ్చిమం, రష్యా మధ్య కుమ్ములాట ప్రారంభంనుంచీ ఉక్రేన్ వనరులకోసమే. ఇయు, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ అనేక సంవత్సరాలుగా ఉక్రేన్‌ను దోచుకుంటున్నాయి. 2014లో, ఇయుతో సహకార ఒప్పందం నిరాకరించినందుకే అప్పటి ఉక్రేన్ అధ్యక్షుడు విక్టర్ యనుకోవిచ్‌ను సైనిక తిరుగుబాటు ద్వారా పదవీచ్యుతుణ్ణి చేశారు. పెన్షన్‌లు, ప్రభుత్వరంగంలో వేతనాల కోత, బ్యాంక్ ప్రైవేటీకరణ, నీరు, ఇంధన ధరల మానిటైజేషన్‌కు అంగీకరించిన తర్వాత ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ ''బెయిలౌట్'' సహాయం ప్రకటించాయి. 2013–19 మధ్య ఇంధనం ధరలు 12 రెట్లు పెరిగాయి. వ్యవసాయ భూమి ప్రైవేటు విక్రయంపై ఉన్న మారిటోరియం ఎత్తివేయాలని పశ్చిమ సంస్థలు గట్టిగా ఒత్తిడి చేశాయి. భూమి డీ రెగ్యులరైజేషన్‌ను వివిధ పోల్స్‌లో 70–80 శాతం మధ్య ఓట్లతో ఉక్రేనియన్‌లు వ్యతిరేకించారు. కాగా కోవిడ్ కాలంలో ఉక్రేన్ ప్రభుత్వం డీరెగ్యులరైజ్ చేసింది. 2022లో రష్యా దండయాత్ర తదుపరి సామాజిక భద్రతల్లో మరింతగా కోతలు, ప్రైవేటీకరణలతో ముడిపెట్టి పశ్చిమ దేశాలు సహాయం అందించాయి. ఇవేవీ రష్యా దండయాత్రను సమర్థించవు. రష్యన్ శతకోటీశ్వరుడు, మాజీ వ్యవసాయ మంత్రికి చెందిన టికచెవ్ ఆగ్రో కాంప్లెక్స్ ఉక్రేన్ ఆక్రమిత ప్రాంతంలో 4లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిని ఆక్రమించుకున్నట్లు ఆరోపణలున్నాయి.

ఉక్రేన్ యుద్ధం దాని భూమి, ఖనిజ సంపద కోసం జరుగుతున్న పోరాటం. ఉక్రేనియన్ సైనికులు స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసంగాక, అమెరికా, ఇయు పెట్టుబడిపక్షాన ప్రాణాలు వదులుతున్నారని అంటున్నారు బ్రిటిష్ కమ్యూనిస్టు బెన్ చాక్కో.


**– పరిశీలకుడు**

# పౌర నైపుణ్యాలను నేర్పే 'స్కౌట్స్ అండ్ గైడ్స్'

ప్రపంచ స్కౌటింగ్ ఉద్యమాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించి బాయ్స్ స్కౌట్స్ ఉద్యమాన్ని స్థాపించిన లార్డ్ రాబర్ట్ బాడెన్ పావెల్ జన్మదినం ఫిబ్రవరి 22న ప్రపంచ స్కౌట్ దినోత్సవంగా జరుపుకుంటారు. ప్రపంచ స్కౌట్ 11 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలుర కోసం ఒక కార్యక్రమంగా ప్రారంభమైంది.

**విలువలు నేర్పుతున్న స్కౌట్:** స్కౌటింగ్ యువత విద్యా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నైతికత, నాయకత్వ నైపుణ్యా లు, వారి వయోజన జీవితాలను ప్రభావితం చేసే పౌర నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. స్కౌటింగ్ యువతకు వ్యక్తులుగా తాము ముఖ్యమని భావాన్ని అందిస్తుంది. స్కౌటింగ్ కుటుంబానికి చెందిన వారు ఒక గేమ్‌లో గెలిచినా ఓడినా అనే దానితో సంబంధం లేకుండా వారికి ఏమి జరుగుతుందనే దాని గురించి వారికి తెలియజేయబడుతుంది. స్కౌటింగ్ వ్యక్తిగత బాధ్యత, అధిక ఆత్మగౌరవానికి దారితీసే కార్యకలాపాలను ప్రోత్సహిస్తుంది. తత్ఫలితంగా కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు దానికి కావల్సిన సరైన మార్గాన్ని ఎంచేకునేటప్పుడు ఏర్పడే ఒత్తిడిని జయించవచ్చు. స్కౌటింగ్ మన సమాజంలో పెరుగుతున్న యువకుల ఆరు ముఖ్యమైన అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది. అవి మార్గదర్శకత్వం, జీవితకాలం నేర్చుకోవటం, విశ్వాస సాంప్రదాయాలు, ఇతరులకు సేవ చేయడం, ఆరోగ్యవంతమైన జీవితం, బిల్డింగ్ క్యారెక్టర్. వంద సంవత్సరాలకు పైగా స్కౌటింగ్ కార్యక్రమాలు యువతలో స్కౌట్ ప్రమాణం స్కౌట్ చట్టంలో ఉన్న విలువలను నింపాయి. స్కౌటింగ్ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలు, భూభాగాలలో 5.7 కోట్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. విద్య, సాహసం, వినోదం కలయికల ద్వారా మెరుగైన మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.

**స్కౌట్ చరిత్ర :** 1908 లో బాడెన్‌పావెల్ 'స్కౌటింగ్ ఫర్ బాయ్స్' అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇది తక్షణ విజయాన్ని సాధించింది. అప్పటి నుండి 100 మిలియన్ కాపీలు అమ్ముడవ్వడమే కాకుండా 1909లో ఐదు భాషల్లోకి అనువదించబడింది. ఇది 'ది బాయ్ స్కౌట్స్' అనే పేరుతో ఒక ఉద్యమాన్ని రూపొందించింది. 1910లో బాడెన్ పావెల్ తన సోదరి ఆగ్నెస్ నాయకత్వంలో గర్ల్ గైడ్స్‌ను ప్రారంభించారు. 1916లో 'వోల్ఫ్ కబ్స్ హ్యాండ్‌బుక్' ప్రచురణ, రుడ్‌యార్డ్ కిప్లింగ్ 'జంగిల్ బుక్'ను ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగించడం ద్వారా 11 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయిల కోసం కబ్ స్కౌట్స్ ప్రారంభించబడింది. 1920లో మొదటి ప్రపంచ స్కౌట్ కాన్ఫరెన్స్ (నాటి పేరు అంతర్జాతీయ స్కౌట్ కాన్ఫరెన్స్ ) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో జరిగింది. మొదటి ప్రపంచ స్కౌట్ జంబోరీలో 33 జాతీయ స్కౌట్ సంస్థలు హాజరయ్యాయి. వరల్డ్ స్కౌట్ బ్యూరో (అప్పట్లో బాయ్ స్కౌట్స్ ఇంటర్నేషనల్ బ్యూరో ) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో స్థాపించబడింది. 1922లో 31 జాతీయ స్కౌట్ సంస్థలు ప్రాతినిధ్యంతో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో 2వ ప్రపంచ స్కౌట్ సమావేశం జరిగింది. గ్లోబల్ సభ్యత్వం ఒక మిలియన్ కంటే ఎక్కువ స్కౌట్‌లకు చేరుకుంది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య, స్కౌటింగ్ కార్యకలాపాలు నిషేధించబడిన నిరంకుశ ప్రాంతాలలో మినహా స్కౌటింగ్ అభివృద్ధి చెందుతూనే ఉంది.




**200 పైగా దేశాలలో:** ఒక శతాబ్దం క్రితం స్కౌటింగ్ ప్రారంభించినప్పటి నుండి 50కోట్లకు పైగా యువకులు, పెద్దలు స్కౌటింగ్‌లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చురుకైన పౌరులుగా ఉండటానికి, వారి కమ్యూనిటీలలో సానుకూల మార్పును సృష్టించడానికి ఉద్యమంలో చేరారు. నేడు, స్కౌటింగ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు, భూభాగాల్లో 5.7 కోట్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. మెరుగైన మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై ఉన్న చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.

**మన దేశంలో...** స్కౌటింగ్ అధికారికంగా బ్రిటిష్ ఇండియాలో 1909లో స్థాపించబడింది. మొదట బెంగళూరులోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూల్‌లో ప్రారంభమైంది. స్థానిక భారతీయుల కోసం స్కౌటింగ్‌ను జస్టిస్ వివియన్ బోస్, మదన్ మోహన్, హృదయనాథ్ కుంజ్రు, గిరిజా శంకర్ బాజ్‌పాయ్, అనిబిసెంట్, జార్జ్ అరుండేల్ 1913లో ప్రారంభించారు. మొదటి గర్ల్ గైడ్స్ కంపెనీ జబల్‌పూర్‌లో 1911లో క్రైస్ట్ చర్చ్ స్కూల్‌లో స్థాపించబడింది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశంలో పనిచేస్తున్న స్కౌట్ , గైడ్ అసోసియేషన్ల ఏకీకరణకు కృషి జరిగింది. భారతదేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, భారతదేశ మొదటి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్, సెంట్రల్ ప్రావిన్స్ గవర్నర్ మంగళ్ దాస్ పక్వాసా, ఇతర స్కౌట్ నాయకులు పండిట్ హృదయ్ నాథ్ కుంజ్రూ వంటి వారు, జాతీయ నాయకులు తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. స్కౌట్ అండ గైడ అసోసియేషన్ల విలీనం కోసం పండిట్ శ్రీరామ్ బాజ్‌పాయ్, జస్టిస్ వివియన్ బోస్, ఇతరులు కృషి చేశారు. విలీన పత్రాన్ని ఖరారు చేయడంలో భారత ప్రభుత్వ విద్యా కార్యదర్శి డాక్టర్ తారా చంద్ గణనీయమైన కృషి చేశారు. చివరికి విలీనం 7 నవంబర్ 1950న జరిగింది. ఏకీకృత సంస్థ 'ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్' పేరుతో ఉనికిలోకి వచ్చింది. గర్ల్ గైడ్స్ అసోసియేషన్ అధికారికంగా 1951 ఆగస్టు 15న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరింది.



**కింజరాపు అమరావతి**
82472 86357

# తెలుగు పాఠ్యాంశాలను పునఃసమీక్షించండి

గత ప్రభుత్వం ముద్రించిన తెలుగు పాఠ్యపుస్తకాలలో కొన్ని పాఠ్యాంశాలు ఒక పార్టీకి అనుకూలంగా ఉండి మరికొన్ని విద్యార్థులకు అనవసరమైన పాఠ్యాంశాలుగా ముద్రించబడి ఉన్నాయి. అధిక సిలబస్ ఉండడంతో విద్యార్థుల గుణాత్మక, సృజనాత్మక శక్తులు సన్నగిల్లే అవకాశం ఉంది. పదవ తరగతి విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకంలో 5వ పాఠం నగరగీతంలో కవి పట్టణంలో నివసించడం, ప్రతికూల అంశాల గురించి పట్టణ నగరీకరణ గురించి భిన్నమై న అభిప్రాయాలు ఉండడంతో నేడు పట్టణాలలో నివసించే పౌరుల అస్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా ఉంది. పట్టణాల కంటే పల్లెల్లో నివసించడమే బాగుంటుందనే ధోరణి విద్యార్థులలో నెలకొనే అవకాశం ఉంది. నేడు గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు విద్య కోసం, ఉపాధి అవకాశాల కోసం వలస వెళ్లిన వారందరి చేత ఈ పాఠం విమర్శలకు గురవుతున్నది. 8వ పాఠం లక్ష్య సిద్ధిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి, పోరాట ఉద్యమాల గురించి, ఆంక్షల ధిక్కరణ గురించి తెలియజేయడం జరిగింది. గత ప్రభుత్వానికి అనుకూలంగా ఈ పాఠం ఉన్నందున విద్యార్థులపై రాజకీయ అంశాల ప్రభావం పడే అవకాశం ఉన్నది. పరీక్షలలో కూడా బంగారు తెలంగా ణ సాధించడానికి విద్యార్థుల అభిప్రాయాల్ని అడుగుతున్నారు. 10వ పాఠం గోలకొండ పట్టణములో కుతుబ్ షాహీ ల పరిపాలన గురించి, వారి రాచరిక వ్యవస్థ ఏ విధంగా ఉండేదో తెలియచేయబడింది. అంతేగాక ద్రాక్ష రసం వంటి విషయాలు ఉండడం వల్ల విద్యార్థులు ఆల్కహాల్ వంటి వ్యసనాలకు గురి అయ్యే అవకాశం ఉంది. ఈ పాఠ్యాంశం పూర్తి గా వ్యవహారిక గ్రాంథికంలో ఉండటం వల్ల విద్యార్థులు సరి గా అర్థం చేసుకోలేకపోతున్నారు. 4వ పాఠం కొత్త బాట పూర్తిగా మాండలిక భాషలో ఉండడంవల్ల విద్యార్థులు చదవడానికి అర్థం చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇక 9వ తరగతిలో 6వ పాఠం దీక్షకు సిద్ధం కండి పాఠంలో 1969 తెలంగాణ ఉద్యమంకోసం ఎలాంటి నిరసనలు వ్యక్తం చేయాలో నేడు విద్యార్థులు నేర్చుకోవడం అప్రస్తుతం. 8వ పాఠం ఉద్యమ స్ఫూర్తిలో నేటి రాజకీయ అంశాల పట్ల రాజకీయ నాయకుల పట్ల విమర్శించే రీతి లో ఉండటం వల్ల ప్రస్తుత ప్రభుత్వంపై అసహనం వ్యక్తం అయ్యే అవకాశం ఉంది.10వ పాఠం వాగ్భూషణంలో వ్యాసం అధికంగా ఉండటంతో విద్యార్థులకు వక్తృత్వం మీద అనాసక్తి ఏర్పడుతున్నది. 11వ పాఠం వాయసంలో కాకి గురించి అద్భుతంగా పద్యాల ద్వారా చెప్పినప్పటికీ ఈ పాఠం విద్యార్థులను ఆకట్టుకోలేకపోతున్నది.

8వ తరగతి తెలుగు వాచకం లో 9వ పాఠం అమరులులో 1969 తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారిని స్మరిస్తూ తెలంగాణ రాష్ట్రం సాధిస్తాం అని ఉండడం వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు ఈ పాఠ్యాంశం అప్రస్తుతం.12వపాఠం మాట్లాడే నాగలి మలయాళ భాష అనువాదంగా ప్రచురించిన ఈ పాఠం లో ఎద్దు మాంసం తినడం గురించి ఉండడంతో ఉపాధ్యాయులు బోధించాలంటే ఇబ్బంది అవుతున్నారు. దీనివల్ల కేరళ ప్రజలు అంటే ఎద్దు మాంసం తింటారనే విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారు. అంతేకాక ఈస్టర్ పండుగ, క్రైస్తవుల పండుగలు అన్నా, క్రైస్తవ మత స్థల,సోదరుల గురించి అపార్థం చేసుకునే అవకాశం లేకపోలేదు.ఉపవాచకంలో 1వ పాఠం చిత్రగ్రీవం పాఠం విద్యార్థులకు అదనపు భారంగా ఉంది.అదేవిధంగా ఉన్నత తరగతులలో సిలబస్ లో 12పాఠాలు, 6 పాఠాలు ఉపవాచకంలో ఉన్నాయి. ఈ సిలబస్ అధికంగా ఉండడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం, విద్యాశాఖ విద్యార్థుల మానసిక ఒత్తిడి తగ్గించేందుకు సిలబస్ లో మార్పులు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

**కృష్ణమూర్తి. కె**
9705196097

# కవలల జంట...కన్నుల పంట

సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని పెద్దలు చెబుతుంటారు. ఆ ఏడుగురు.. ఎవరు ఎక్కడుంటారో.. ఎవరికీ తెలియదు. కానీ అందు లో ఒకే రూపం..కలిగిన ఇద్దరు పిల్లలు.. ఒకే ఇంట్లో ఉంటే.. అబ్బో అది గొప్ప అనుభూతే. ఒకే రూపంతో ఉండే కవలలంటే ఇష్టపడని హృదయముండదు.

ఒకే తల్లికి ఒకసారి పుట్టిన లేదా ఒకే గర్భం నుంచి జన్మించిన ఇద్దరు పిల్లలను కవలలు అంటా రు. వాళ్ళు ఏ లింగానికైనా చెంది ఉండవచ్చు. వారు ఒకే పోలికలతో ఉంటే మోనోజైగోటిక్, వేర్వేరు పోలికలతో డైజీగోటిక్ అని వ్యవహరిస్తారు. గర్భంలో ఇద్దరు పిల్లల శరీరాలు కలిసిపోయి జన్మిస్తే వారిని అవిభక్త కవలలు. లేదా సియామీ కవలలు అంటారు. చాలా అరుదైన పరిస్థితుల్లోనే ఇలా జన్మించడం జరుగుతుంది. సాధారణంగా ఇది 50 వేలలో ఒకరి నుం చి రెండు లక్షలలో ఒక పుట్టుకల్లో సంభవించే అవకాశం ఉంది. 2006వ సంవత్సరంలో జరిపిన ఒక సర్వే ఆధారంగా ప్రపంచం మొత్తంమీద 12.5 కోట్ల కవలలు నివసిస్తున్నట్లు ఒక అంచనా. ఇది ప్రపంచ జనాభాలో 1.9 శాతం. వీరిలో మోనోజైగోటిక్ కవల లు 10 మిలియన్లు కాగా మిగతా వారందరూ డైజీగోటి క్ కవలలే. తల్లి కావడం అనేది ప్రతీ తల్లికి ఓ అపురూపమైన ఘట్టం. ఓ రూపానికి పురు డు పోయడానికి ఆ తల్లి ఎన్నో కష్టాలను ఇష్టంగా భరిస్తుంది. ఇక పురుషుల్లోని ప్రత్యుత్పత్తి వ్యవస్థ నుంచి విడుదలయ్యే శుక్రకణాలు మహిళల్లోని అండంతో ఫలదీకరణం చెంద డం వల్లనే పునరుత్పత్తి జరుగుతుందని అందరికీ తెలుసు. అయితే ఒక్కోసారి మహిళల్లో రెండు అండాలు విడుదలై, శుక్రకణం రెండు అండాలతో ఒకేసారి ఫలదీకరణం చెందుతుంది. అంటు వంటి సమయంలో కవలలు పుడుతారంట. కవలలకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవు. ఎంతో సంతోషపడుతుంటారు. కవలలను పెంచడంలో ఆ తల్లికి సమస్యలు ఎదురైనా.. వారి అల్లరి చూ స్తూ ఆనందంగా కవలలను కంటిపాపలా కాపాడుకుంటూ వస్తుంది. ఇద్దరికీ ఒకే రంగు, ఒకే డిజైన్ ఉన్న డ్రెస్‌లు వేస్తూ, ఒకే రకమైన బొమ్మ లు కొనిస్తూ వారిని చూసుకుంటూ మురిసిపోతుంది అమ్మ.

పొలెండ్‌లో మోజస్, ఆరన్ విల్కాక్స్ అనే కవల సోదరులు మరణించిన రోజున ప్రపంచ కవలల దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న జరుపుకుంటున్నారు. ఈ ఏడాది చీర్స్ టూ ఫిఫ్టీ ఇయర్స్ అను థీమ్‌తో ఈ దినోత్సవాన్నిజరుపుతున్నారు.

**(ఫిబ్రవరి 22 అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా)**

## ట్విన్స్‌కు ప్రత్యేకం వేపకుంట్ల

ఒకే రూపం... ఒకే ఆలోచన... ఒకే అతృత...ఒకే ఆక్రోశం... ప్రేమ, దయ, కోపం అన్ని ఒక్కటే దేహాలు మాత్రం రెండు.... పుట్టక ఒక్కటే. జీవితాలు మాత్రం రెండు. రెండు దేహాలు ఒక్కటే రూపం ఇంతకంటే అపురూపం ఇంకేముంటుంది. కవల పిల్లలు పుడితే ఆ తల్లిదండ్రులు ఎంతో ఆనందంతో మురిసిపోతారు. ప్రపంచంలో మనుషులను పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని చెబుతుంటారు. కానీ ఏడుగురినీ ఇంత వరకు ఎవరు చూసి ఉండరు. కానీ దేహాలు వేరైనా ఒకే రూపంతో ఉండే ఇద్దర్ని మాత్రం ఎక్కడో ఒక చోట చూస్తునే ఉంటాం. వారినే కవలలంటాం. మరి కొంతమందికి రూపంతో పాటు శరీరాలు కూడా కలిసి ఉంటాయి. వారిని అవిభక్త కవలలంటా రు. ఇద్దరు అబ్బాయిలు లేదా ఒక పాప, బాబు కవలలుగా జన్మిస్తుంటారు. దేహాలు వేరుగా ఉన్న ఒకే రూపంతో వారు ఉండ డం తల్లిదండ్రులు వారిని అదృష్టవంతులుగా భావిస్తుంటారు. వారిని ఎంతో అల్లారుముద్దుగా అపురూపంగా చూసుకుంటారు. వారికి పెట్టే పేర్లు సైతం ఒకేలా ఉండేలా చూసుకుంటారు. రఘునాథపాలెం మండలంలోని వేపకుంట్ల గ్రామం ట్విన్స్‌కు ప్రత్యేకం. ఆ గ్రామంలో ఏకంగా తొమ్మిదిమంది జంట కవలలు ఉన్నారు. అందులో ఓ మహిళకు రెండు కాన్పుల్లో కవలలే జన్మించారు. కుర్రా టిటో, నాగశ్వేత దంపతులకు 2017లో కుర్రా సరయు, కుర్రా సూర్య కవల లు జన్మించారు. వీరి తాత కుర్రా భాస్కర్‌రావు, నాయనమ్మ లీలావతి, గుగ్గిళ్ల సుధాకర్, కోటేశ్వరి దంపతులకు 2002లో కవలలు జన్మించా రు. వారికి రమ్య, లావణ్యలు గా నామకరణం చేశారు. చావగాని శ్రీనివాసరావు, ఉపేంద్ర దంపతులకు 1999 సంవత్సరంలో కవలలు జన్మించారు. వారికి రాము, లక్ష్మ ణ్‌లుగా నామకరణం చేశా రు. చింతగుర్తి గ్రామానికి చెందిన రంగారావు, విజయలక్ష్మి దంపతులకు కవలలు జన్మించారు. వారికి రేవంత్, రేష్మంత్‌లుగా నామకరణం చేశారు. జాలాది సందీప్, మౌనిక దంపతులు 2017 జనవరిలో కవలలు జన్మించారు. ఒక పాప, బాబు జన్మించారు. వారికి భావన, భార్గవసాయిలుగా నామకరణం చేశారు. అదేవిధంగా ఖమ్మం నగరంకు చెందిన పూనాటి మనోజ్, శ్రీహార్మ్య దంపతులకు ఇద్దరు కవలలు జన్మించారు. వారి పేర్లు అలోక్, అయాన్‌లుగా నామకరణం చేశారు.



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్**



## ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి: బినయ్ విశ్వం

**తిరువనంతపురం:** ఆశా వర్కర్ల సమస్యలు, డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని కేరళ ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం కోరారు. ఆశా వర్కర్ల డిమాండ్ల పరిష్కారానికి సానుకూల పరిస్థితులు కల్పించాలన్నారు. గౌరవ వేతనంతో పాటు మిగతా ప్రయోజనాల కోసం డిమాండ్ చేస్తూ 11 రోజులుగా సెక్రటేరియట్ వద్ద ఆశా వర్కర్లు నిరవధిక దీక్ష చేస్తున్న క్రమంలో బినయ్ విశ్వం వారికి సంఘీభావం ప్రకటించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజానికి నిబద్ధతతో అందించే సేవలకుగాను కేరళ ప్రజలు ఎప్పుడూ ఆశా వర్కర్లకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. కోవిడ్ కాలంలో ఆశా వర్కర్లు ఎనలేని సేవలు అందించారని, వారు కోవిడ్ యోధులని ప్రశంసించారు. ఆశా వర్కర్ల డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని త్వరలోనే సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు కేరళ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బినయ్ విశ్వం అన్నారు. అధికారంలో ఉన్నది వామపక్ష ప్రభుత్వం కాబట్టి చర్చల ద్వారా ఆశా వర్కర్ల సమస్యలన్నీ పరిష్కారం కాగలవని ఆకాంక్షించారు. ఈ ఆందోళనను ఇతరులు తమ రాజకీయ దురుద్దేశాలతో హైజాక్ చేసేందుకు వీలు లేకుండా ప్రభుత్వం సత్వరమే తగు విధంగా చర్యలు తీసుకోవడం అవసరమని బినయ్ విశ్వం సూచించారు.



## హత్రాస్ కేసులో భోలే బాబాకు క్లీన్ చిట్

**లక్నో:** దేశవ్యాప్తంగా సంచలనం సష్టించిన హత్రాస్ తొక్కిసలాట కేసులో భోలేబాబాఉకు క్లీన్ చిట్ లభించింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావడమే ఈ దుర్ఘటనకు కారణమని, దీంతో బాబాకు సంబంధం లేదని విచారణ కమిటీ నివేదిక ఇచ్చింది. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతత్వ ముగ్గురు సభ్యుల జ్యుడిషియల్ కమిషన్ యూపీ ప్రభుత్వానికి పూర్తి నివేదికను సమర్పించి... ఈ ఘటనతో భోలే బాబాకు సంబంధం లేదని పేర్కొంటూ సమాచారం. ఈ నివేదికపై రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన తర్వాత, దీనిని బడ్జెట్ సెషన్‌లో అసెంబ్లీకి సమర్పించే అవకాశం ఉందని తెలిసింది. సత్సంగ్ నిర్వహకులు సరైన ఏర్పాట్లు చేయనందువల్ల, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ఘటన జరిగినట్లు జ్యుడిషియల్ కమిషన్ పేర్కొంది. గతంలో ఈ కేసును విచారించిన ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) సైతం భోలే బాబా ప్రమేయం లేదని పేర్కొనడం విదితమే.



## తొలి ఇపిఎల్ అందుకున్న మహిళా పైలట్

**జబల్‌పూర్ :** గురువారం ఆవిష్కరించిన ఎలక్ట్రానిక్ పెర్సనల్ లైసెన్స్(ఇపిఎల్)ను జబల్‌పూర్‌కు చెందిన 22 ఏళ్ల మహిళా పైలట్ శుక్రవారం అందుకున్నారు. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు మొబైల్ అప్లికేషన్ ద్వారా ఇపిఎల్‌ను పొందే మొబైల్ అప్లికేషన్‌ను గురువారం ఆవిష్కరించారు. భౌతిక లైసెన్స్‌కు బదులుగా సులభతరంగా పైలట్లు లైసెన్స్ పొందేందుకు ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇది ఎంతో భద్రత, సురక్షితం, సమర్ధమైన విధానంగా పేర్కొనవచ్చు. చైనా తరువాత ప్రపంచంలో ఈ విధానాన్ని అమలు చేసిన రెండో దేశంలో భారత్ రికార్డులకెక్కింది. గురువారం మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో జరిగిన కార్యక్రమంలో 22 ఏళ్ల ఇషిత భార్గవ ఇపిఎల్‌ను అందుకున్నట్టు ఆమె తండ్రి రజత్ భార్గవ తెలిపారు. ఆమె గత డిసెంబర్‌లో అమేథీలోని పౌర విమానయాన గుర్తింపు పొందిన ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉరాన్ అకాడమీనుంచి కమర్షియల్ పైలట్ కోర్సును పూర్తిచేసింది. ఇపిఎల్ ద్వారా ఒక పైలట్ ఎన్ని గంటల అనుభవం సంపాదించారన్న విషయాన్ని తెలుసుకోవచ్చు. 'ఇపిఎల్ అనేది పైలట్ భౌతిక లైసెన్స్‌కు డిజిటల్ రూపమని, అది ఒక పైలట్‌కు ఎన్ని గంటల అనుభవం ఉంది అనే విషయాన్ని తెలుపుతుందని పౌర విమానయాన శఖాఖ వెల్లడించింది. మోదీ ప్రవేశపెట్టిన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'డిజిటల్ ఇండియా' పథకాలలో భాగంగా ఈ నూనత ఆవిష్కరణను ప్రవేశపెట్టినట్టు పేర్కొన్నారు. ఇపిఎల్ ద్వారా విమానయాన రంగంలో భారత్ ఆవిష్కరణల గొప్పదనాన్ని తెలియజేస్తోందని, ట్యాంపరింగ్‌కు అవకాశం లేని లైసెన్సింగ్ విధానం ఇపుడు భారత్ సొంతమని తెలియజేశారు.




# ప్రపంచశ్రేణి నాయకులు కావాలి

### ప్రధాని మోదీ ఉద్బోధ

**న్యూఢిల్లీ :** ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో భారత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ప్రపంచస్థాయి నాయకుల అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్బోధించారు. స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్(ఎస్ఒయుఎల్–సోల్) విద్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రధాని ప్రసంగిస్తూ దేశానికి ఇపుడు అన్ని రంగాలలో చురుకైన నాయకుల అవసరం ఉందని, పాలనా వ్యవస్థ, విధాన నిర్ణయాలు, వాణిజ్యం తదితర రంగాలలో ప్రపంచ దృష్టిని కలిగి స్థానిక ప్రయోజనాలను నెరవేర్చగల నాయకులను తయారు చేయడంలో ఎస్ఒయుఎల్‌వంటి విద్యాలయాలు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రతి రంగంలో భారత్‌ను దృష్టిలో ఉంచుకుని దేశాన్ని గ్లోబల్ పవర్‌హౌస్‌గా రూపొందించడంలో భాగస్వాములు కావాలన్నారు. 'ప్రతి రంగంలో చురుకైన నాయకులు అవసరం. ప్రపంచ సమస్యలను పరిష్కరిస్తూ అంతర్జాతీయ వేదికపై దేశ ప్రయోజనాలను కాపాడే నాయకులు అవసరం. నాయకులంటే ప్రపంచ దృక్పథం కలిగి ఉండాలి. అదే సమయంలో దేశ ప్రయోజనాలను కాపాడే ఆలోచనా విధానం కావాలి' అన్నారు. భావి నాయకులు కేవలం అధికారానికే పరిమితం కారాదని, అందుకు రాజకీయ రంగాన్ని ఉదహరిస్తూ.. నూతన ఆవిష్కరణలు, వాటి ప్రభావం దేశ ప్రయోజనాలను ప్రతిబింబించేలా ఉండాలన్నారు. అటువంటి నాయకులే అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తూ అంతర్జాతీయ మార్కెట్లలో, ప్రపంచస్థాయి సంస్థలలో భారత్ సత్తాను చాటగలుగుతారన్నారు. అభివృద్ధి చెందుతున్న రంగాలైన డీప్ టెక్, అంతరిక్షం, పునరుత్పాదక శక్తి తదితర రంగాలతోపాటు సాంప్రదాయక వ్యవసాయం, క్రీడలు, తయారీ, సామాజిక సేవా రంగాలలో చురుకైన నాయకులను తయారు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించడమేకాదు, సాకారం చేసుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. గ్లోబల్ ఎక్సలెన్స్ స్థాయి సంస్థలను రూపొందించగలిగే సమర్ధ నాయకులు కావాలన్నారు. భారతదేశ చరిత్రలో గొప్ప సంస్థల ప్రస్తావన ఉందని, తిరిగి ఆ స్థాయిని సాధించుకోవాలన్నారు.



మానవ వనరుల అభివృద్ధి అంశాన్ని ప్రధాని నొక్కిచెపుతూ జాతి నిర్మాణంలో మెరుగైన పౌరులను రూపొందించుకోవాలని, 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకు గుజరాత్‌ను ఉదాహరణగా పేర్కొంటూ గుజరాత్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసే సమయంలో ప్రతి ఒక్కరూ అక్కడి సహజ వనరుల లేమిని ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అక్కడి నాయకుల కృషి వల్ల ప్రస్తుతం ఆ రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. అక్కడ వజ్రాల గనులేమీ లేవని, కానీ ప్రపంచానిక అందే ప్రతి పది వజ్రాలలో తొమ్మిది గుజరాతీల చేతుల మీదుగానే వెళుతున్నాయన్నారు. గుజరాత్ 'గిఫ్ట్' సిటీకి సమీపంలో 'సోల్' భావి అవసరాలకు విశాల ప్రాంగణం సిద్ధమౌతోందని మోదీ వెల్లడించారు. 'సోల్' చురుకైన నాయకత్వాన్ని రూపొందించే విద్యా సంస్థగా ఎదుగుతోందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

వివిధ రంగాలలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలను సరైన దిశలో వినియోగించుకోగలిగిన మెరుగైన నాయకులను రూపొందించుకోవాలని మోదీ అన్నారు. అటువంటి సమర్ధ నాయకులను సోల్ సంస్థ రూపొందించగలదన్న ఆశాభావం వ్యక్తంచేశారు. వారు మూస ధోరణిని అనుసరించక తమదైన నూతన విధానాలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించగలరన్నారు. దౌత్య రంగంతోపాటు సాంకేతిక ఆవిష్కరణలు తదితర రంగాలలో బలమైన నాయకత్వాన్ని రూపొందించుకుంటే వారు జాతి భవిష్యత్తును, ప్రగతిని నిర్దేశించగలరన్నారు. మనమంతా ఒకే లక్ష్యంతో ముందుకు సాగితే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. 21వ శతాబ్దిలో జన్మించిన అటువంటి నాయకులే నేటి భారత్ అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భూటాన్ ప్రధాని త్సెరింగ్ తోబ్గె ప్రసంగిస్తూ ప్రధాని మోదీ నాయకత్వాన్ని ప్రశంసించారు.

## మహాయుతిలో ముసలం?

### ప్రభుత్వ కార్యక్రమాలకు షిండే దూరం
### మంత్రుల ఎంపిక, శాఖల కేటాయింపుపై తీవ్ర అసంతృప్తి



**ముంబై:** మహారాష్ట్రలో మహాయుతి కూటమి ప్రభుత్వంలో ముసలం మొదలైనట్లు కనిపిస్తోంది. సంకీర్ణ ప్రభుత్వం చీలికల దిశగా వెళ్తున్నట్లుగా జరుగుతున్న పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. ఇటీవల ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు 'వై' భద్రతను ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో విభేదాలు మొదలయ్యాయి. దీంతో ఏక్‌నాథ్ షిండే తీవ్రం అసంతప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలకు షిండే హాజరు కావడం లేదు. మూడు ప్రభుత్వ కార్యక్రమాలకు డుమ్మా కొట్టారు. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వంలో ముసలం మొదలైనట్లుగా కనిపిస్తోంది. ఈ మూడు కార్యక్రమాలకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ హాజరయ్యారు. గార్డియన్ మంత్రి పదవి మొదలుకొని ప్రత్యేక వైద్య విభాగాలకు వేర్వేరుగా సమీక్షా సమావేశాలు, పర్యవేక్షణ ప్రాజెక్టుల కోసం 'వార్‌రూమ్'ల వరకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఆయన డిప్యూటీ ఏక్‌నాథ్ షిండే మధ్య భిన్నాభిప్రాయాల కోల్డ్‌వార్ జరుగుతున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం.ముఖ్యమంత్రిగా ఉన్న రెండున్నరేళ్లలో షిండే నాయకత్వం, అభివద్ధి సంక్షేమ నిర్ణయాల వల్లే బీజేపీ, శివసేన, ఎన్సీపీ(ఏపీ)ల మహాయుతి కూటమి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించిందని ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు.డిప్యూటీ సీఎం పదవిని స్వీకరించేందుకు షిండే మొదట్లో విముఖత వ్యక్తంచేశారని, అయితే ఫడ్నవీస్ నేతత్వంలోని ప్రభుత్వంలో భాగం కావాలంటూ ఆయన సహచరులు, బీజేపీ అగ్రనేతలు ఒప్పించారని శివసేన నేతలు పేర్కొంటున్నారు. అయితే ఫడ్నవీస్, షిందేలిద్దరూ తమ విభేదాలున్నాయన్న వార్తలను ఖండిస్తున్నారు. అదేవిధంగా రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధితో పాటు మెడికల్ ఎయిడ్ సెల్‌ను కూడా శిందే ఏర్పాటు చేశారు. అలాగే రాష్ట్రంలో 2027 కుంభమేళా సన్నాహాల గురించి చర్చించేందుకు నాసిక్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్ఆర్‌డీఏ) సహా ఫడ్నవీస్ ఏర్పాటు చేసిన అనేక సమావేశాలకు షిండే దూరంగా ఉన్నారు. తాజాగా ఫడ్నవీస్ పరిశ్రమల శాఖ సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం షిండే మరో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. దీనికి తోడు 20 మంది శివసేన ఎమ్మెల్యేల భద్రత తగ్గింపు కూడా శివసేనలో మరింత అసంతప్తిని రాజేసింది.

## 'పెట్టుబడులకు గమ్యస్థానం'గా కేరళ రాష్ట్రం


### 'ఐకెజిఎస్ సదస్సు'లో సిఎం పినరయి విజయన్ వెల్లడి



**కొచ్చి (కేరళ) :** రాష్ట్రంలో వృద్ధి సామర్థ్యాలు గణనీయంగా పెరుగుతున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నొక్కిచెప్పా రు. కేరళ రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియజేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇక్కడ ఏర్పాటు చేసిన 'ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్ '(ఐకెజిఎస్)ను శుక్రవారం ప్రారంభించారు. సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ కేరళ రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడానికి ప్రతీ నరం ఉప్పొంగుతోందని, రాష్ట్రాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే సందర్భంలో ఎలాంటి అవకాశాన్ని చేజార్చుకోమని సిఎం విజయన్ స్పష్టంచేశారు. 'మేం విమర్శలను కూడా పరిగణనలోనికి తీసుకుంటాం. కేరళను పెట్టుబడులకు గ మ్యస్థానంగా మార్చే విషయంలో ముందుకు అడుగువేయాల్సిన వాటిని అర్థం చేసుకుని పురోగమిస్తాం' అని ఆయన నొక్కిచెప్పా రు. పినరయి విజయన్ రెండవసారి కేరళ రాష్ట్రంలో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వానికి వరుసగా రెండవసారి నాయకత్వం వహిస్తున్నారు. ప్రొసీజర్స్‌ను సులభతరం చేయడంలో సరళీకృతం చేయబడ్డాయని ముఖ్యమంత్రి విజయన్ చెప్పారు. మార్పులు పెరుగుతున్నవి కావని అవి గణనీయమైనవన్నారు. 'ప్రభుత్వం త నను తాను సులభతరంగా, పెట్టుబడులుగా పరిగణిస్తోంది. ఉన్న త విద్యారంగాన్ని మార్చేందుకు తీవ్రమైన చర్యలు చేపట్టాం'అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కేరళ పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ మాట్లాడుతూ పెట్టుబడులకు స్వర్గధామమైన కేరళ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే తగిన సమయం అన్నారు. రాష్ట్రం 22 ప్రాధాన్యతా రంగాలను గుర్తించిందన్నారు. పారిశ్రామిక విధానంలో ప్రకృతి, ప్రజలు, పరిశ్రమలపై దృష్టి కేంద్రీకరించినట్లు రాజీవ్ చెప్పారు.ఈ రెండు రోజుల సదస్సులో దాదాపు 3,000మంది ప్రతినిధులు పాల్గొంటారని అంచనా.

## మహా కుంభమేళాతో యుపికి రూ.3 లక్షల కోట్ల వృద్ధి

**లక్నో :** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.3 లక్షల కోట్లకు పైగా వద్ధి చెందడానికి మహా కుంభ మేళా దోహదపడుతుందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రం ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం దిశగా అడుగులు వేస్తోందని అన్నారు. 'ప్రపంచం నేడు చూస్తున్న ఉత్తర ప్రదేశ్ సామర్థ్యాన్ని మహాకుంభమేళాతో అనుసంధానించవచ్చు' అని సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే రాగిణి సోంకర్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఎస్పీ ఎమ్మెల్యేను విమర్శిస్తూ, 'మీ బాధను నేను అర్థం చేసుకోగలను. ఎందుకంటే భారతదేశం ఎప్పటికీ అభివృద్ధి చెందిన దేశంగా మారలేదని మీ నాయకులు చెప్పినప్పుడు మీరు వారిని అనుసరించాలి' అని అన్నారు. 'నేడు భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారింది. 2027లో భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా



మారుతుంది. దీనిపై ఎటువంటి సందేహం లేదు' అని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం నేడు ముందుకు సాగుతోందని, 140 కోట్ల మంది భారతీయులు దీని పట్ల గర్వపడాలని ఆయన అన్నారు. 'కొంతమందికి ఇది నచ్చకపోవచ్చు ఎందుకంటే వారి స్వంత వ్యక్తిగత ఎజెండా ఉన్నవారు దేశ అభివద్ధిని సరిగ్గా అంగీకరించరు' అని చెప్పారు.

## ఆ రూ.182 కోట్లు బంగ్లాదేశ్‌కు మళ్లాయా?

**న్యూఢిల్లీ/వాషింగ్టన్:** భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యూఎస్ఎయిడ్ ద్వారా అందిన 21 మిలియన్ డాలర్ల (మన కరెన్సీలో దాదాపు రూ.182 కోట్లు)పై రాజకీయ దుమారం సాగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపణలతో ఈ వివాదం మరో మలుపు తిరిగింది. ఆ నిధులను బంగ్లాదేశ్‌కు మళ్లించారంటూ ఓ కథనం వెలువడింది. దాన్ని షేర్ చేస్తూ బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. వాస్తవానికి యూఎస్ ఎయిడ్ ద్వారా భారత్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు అందిన సాయంపై ఓ ఆంగ్ల మీడియా పరిశోధనాత్మక కథనం ప్రచురించింది. అందులో అమెరికా తాజాగా ఆరోపణలు చేస్తోన్న 21 మిలియన్ డాలర్ల సాయాన్ని 2022లో బంగ్లాదేశ్ కోసం కేటాయించినట్లు పేర్కొంది. 'బంగ్లాలో అమర్ ఓట్ అమర్ (నా ఓటు నాదే) అనే ప్రాజెక్టు కోసం ఈ నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే 13.4 మిలియన్ డాలర్లు ఆ దేశానికి ఇచ్చారు' అని అందులో ఉంది. దీనిని కాంగ్రెస్ నేతలు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. 'ఈ అబద్ధం మొదట వాషింగ్టన్‌లో చెప్పారు. ఆ తర్వాత బీజేపీ ఆర్మీ దాన్ని విస్తతంగా ప్రచారం చేస్తోంది. నిజానిజాలు తెలుసుకోకుండా ప్రతిపక్షాలపై వేలెత్తిచూపారు. ఇప్పుడు వారంతా క్షమాపణలు చెబుతారా?' అని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. అయితే ఆ కథనం అవాస్తవమని బీజేపీ పేర్కొంది. ఇదిలావుంటే, ఇతర దేశాలకు ఇచ్చే నిధుల్లో కోత విధిస్తూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతత్వంలోని డోజ్ విభాగం ఈనెల 16న జాబితా ప్రకటించింది. అందులో భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఉద్దేశించిన నిధులను రద్దు చేసింది. డోజ్ నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించారు. బైడెన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆ నిధులను భారత్‌లో ఎవరినో గెలిపించడానికి కేటాయించారని అర్థమవుతోందని అన్నారు. అది కిక్‌బ్యాక్ స్కీమ్ అంటూ యూఎస్ ఎయిడ్‌నుద్దేశించి ట్రంప్ అన్నారు.

## అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం

### యుఎస్ ఎయిడ్‌పై భారత్ ఆందోళన



**న్యూఢిల్లీ :** భారత్‌లో ఎవరినో గెలిపించడానికి గత అధ్యక్షుడు జో బైడెన్ రూ.182 కోట్ల నిధులను కేటాయించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై తాజాగా భారత ప్రభుత్వం స్పందించింది. ఓ టింగ్‌ను పెంచడం ద్వారా భారత ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు యుఎస్ఎయిడ్ ప్ర యత్నించిందనే వార్తలు తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయని పేర్కొంది. దీనిపై సంబంధిత విభాగాలు దృష్టి సారించాయని వెల్లడించింది. యుఎస్ కార్యకలాపాలు, నిధులకు సంబంధించి అమెరికా ప్రభుత్వ యంత్రాంగం వెల్లడించిన సమాచారాన్ని చూశాం. అవి తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ఆందోళనలకు దారితీశాయి. ఈ దశలో దీనిపై బహిరంగంగా మాట్లాడటం తొందరపాటే అవుతుంది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం వచ్చిన తర్వాతే దీనిపై మరిన్ని వివరాలు వెల్లడిస్తాం అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత వివిధ దేశాలకు అమెరికా చేసే సాయంపై పునఃసమీక్ష చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇం దులో భాగంగా యుఎస్ ఎయిడ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు యుఎస్ ఎయిడ్ ఖర్చు చేసిందనే విషయాన్ని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఆ దేశంలో మరెవర్నో గెలిపించేందుకు వారు (బైడెన్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ప్రయత్నించినట్లు అర్థమవుతోందన్న ఆయన.. ఈ విషయాన్ని భారత్‌కు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు.

## గిరిజనుల ఆరోగ్యం మెరుగుదలపై స్పందించాలి

### కేంద్రం, ఇతరులకు 'సుప్రీం' నోటీసులు
### విచారణకు అంగీకరించిన ధర్మాసనం-4వారాల తర్వాతకు విచారణ వాయిదా

**న్యూఢిల్లీ :** దేశంలోని గిరిజన జనాభా ఆరోగ్యం మెరుగుదల కోసం చర్యలు చేపట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం, ఇతరులు స్పందించాలని శుక్రవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గ వాయ్, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారించడానికి అంగీకరించింది. ఈ పిటిషన్‌పై వారి ప్రతిస్పందనలను కోరుతూ షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్, కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీచేసింది. ఎన్‌జిఓ మహాన్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆశీష్ సతావ్ సహా మరో ఇద్దరు పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లను ధర్మాసనం నాలుగు వారాల తర్వాత విచారణ చేపడతామంటూ వాయిదా వేసింది. మహారాష్ట్రలోని మెల్‌ఘాట్ ప్రాంతంలోని గిరిజన వర్గాలకు ఎన్‌జిఓ తరపున ఉచిత వైద్య సంరక్షణ, ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు అడ్వకేట్ రాణు పురోహిత్ దాఖలు చేసిన పిటిషన్ ద్వారా వెల్లడించారు. గిరిజన జనా భా ఆరోగ్యసమస్యలను ట్రస్ట్ అత్యంత నిశితంగా పరీక్షించిందని, వారికి నిర్దిష్ట పరిష్కారాలను కూడా అందించిందని చెప్పారు. ఇంటి ఆధారిత శిశు సంరక్షణ, తీవ్రస్థాయిలో పోషకాహారలోపం, ఆర్థికంగా ఉత్పాతదకత కలిగిన వయస్సు గ్రూప్ వారి మరణాల నియంత్రణ సహా ఆర్థికరంగంలో ప్రభు త్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో చర్యలను అమలు చేయాలని పిటిషన్‌లో కోరింది. 'బహుళ సంఖ్యలో ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు (పిల్స్), రిట్ పిటిషన్లలో గిరిజన సంక్షేమ పథకాలకు సంబంధించి న సమస్యలపై బాంబే హైకోర్టు జోక్యం చేసుకుని ఆదేశాలు జారీచేయడం ద్వారా ఈతరహా అనేక గి రి జన సంక్షేమ చర్యలను మహారాష్ట్రలో అమలు చేయడం సాధ్యమైంది' అని పిటిషన్‌లో తెలిపారు. జాతీయస్థాయిలో గిరిజనుల ఆరోగ్యస్థితిని మెరుగుపర్చేందుకు ట్రస్ట్, అధికారుల మధ్య 2015 నుండి 2023వరకు పలుసార్లు సమావేశాలు జరి గి అభిప్రాయాలకనుగుణంగా చర్యలు చేపట్టడం జరిగిందని పిటిషన్‌లో తెలియజేశారు. పిటిషనర్ మహారాష్ట్రలో అమలుచేసిన ఈ చర్యలకు సంబంధించి తన సిఫారసులను అమలుచేసినందుకు ప్రతివాదులకు ప్రాతినిథ్యాలు కూడా సమర్పించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో గిరిజన జనా భా ఆరోగ్య సంక్షేమం కోసం అధికారులు చర్యలు చేపట్టేలా వారికి ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. స తావ్ ప్రతిపిదించిన సిఫారసులు మహారాష్ట్రలోని మెల్‌ఘాట్, గిరిజన ప్రాంతాలలో విజయవంతం గా అమలు చేయబడ్డాయని, అవి జాతీయస్థాయి లో అన్ని గిరిజనవర్గాల సంక్షేమం కో సం ప్యాన్ ఇండియా ప్రాతిపదికన సూత్రప్రాయం గా అమలుచేయవచ్చని పేర్కొంది. ఈ సిఫారసులను అమలుచేయాలని పిటిషనర్లు పదేపదే వివిధ ప్రభుత్వ అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకపోయింది. అయితే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కే టాయించిన నిధులు దుర్వినియోగం కావడం లేద ని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ సంస్థల సమన్వ య లోపంవల్ల ఏకపక్షంగా, అసమానంగా ప్ర యోజనాల పంపిణీ జరుగుతోందని తెలిపారు. జీవించే హక్కును ఉల్లంఘిస్తున్నారని పిటిషన్‌లో ఆవేదన వ్యక్తపరిచారు.

## రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతితో ఢిల్లీ సిఎం రేఖా గుప్తా భేటీ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. అలాగే ఉప రాష్ట్రపతి ధన్కర్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కొద్దిసేపు ముచ్చటించారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో పాటు ఆరుగురు మంత్రులుగా ప్రమాణం చేసిన సంగతి విదితమే. ఇక ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ సహా ఎన్డీఏ మిత్రపక్షాల నేతలు హాజరయ్యారు. గురువారమే రేఖా గుప్తా తొలి కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ఆమోదించారు. దీంతో రూ.10 లక్షల వైద్య సాయం అందనుంది. త్వరలో మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయాన్ని కూడా అందిస్తామని రేఖా గుప్తా హామీ ఇచ్చారు.

## వలసలు, ఆర్థిక సంక్షోభం మధ్య రేపు జర్మనీ పార్లమెంటు ఎన్నికలు

**బెర్లిన్ :** జర్మనీ పార్లమెంటుకు ఆదివారంనాడు (23వ తేదీ) జరిగే ఆకస్మిక ఎన్నికలు ఆ దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. 733 స్థానాలు ఉన్న పార్లమెంటు 'బుందేస్టాగ్'లో సీట్లసంఖ్య ఈసారి 630కి తగ్గింది. జర్మనీలోకి పెరిగిన వలసలు, ఆర్థిక వ్యవస్థకు ఎదురవుతున్న సమస్యలు, సామాన్య ప్రజల కండగండ్లు రెండే ప్రధానాంశాలుగా ఈసారి ముందుకు వచ్చాయి. తాత్కాలికంగా పదవిలో ఉన్న ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్‌కు ఈసారి ఎన్నికల్లో అతిపెద్ద సవాలు ఎదురైంది. క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్ (సిడియు), బవేరియా రాష్ట్రానికే పరిమితమైన క్రిస్టియన్ సోషల్ యూనియన్ (సిఎస్‌యు)పార్టీలు ఈసారి ఎన్నికల్లో ప్రధాన ప్రత్యామ్నాయంగా తెరమీదకు వచ్చాయి. వీటికే విజయావకాశాలు ఎక్కువ ఉన్నట్లు ముందస్తు సర్వేలు చెబుతున్నాయి. ఇప్పుడు జర్మనీ ఎన్నికల్లో సిడియు నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ (69) చుట్టూ ఓటర్ల రాజకీయం తిరుగుతోంది. 15 జర్మనీ రాష్ట్రాలలో ఆయన పార్టీ ఆధిక్యం ప్రదర్శిస్తున్నట్లు ఓటర్లనాడి చెబుతున్నది. ఈసారి ఎన్నికల్లో ఛాన్సలర్ పదవికి షుల్జ్‌తోపాటు ఐదుగురు పోటీ పడుతున్నారు. వామపక్షాలు కూడా ఈ ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. దేశంలో పార్లమెంటుకు, 16 రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో పచ్చిమితవాద వలస వ్యతిరేక ఎఎఫ్‌డి (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ)పార్టీకి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ మద్దతు ఇస్తున్నారు. వలసల నిర్మూలనలో ట్రంప్ రిపబ్లికన్‌పార్టీ, ఎఎఫ్‌డిపార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయి. ఈసారి ఎఎఫ్‌డి నాయకురాలు కురాలు ఆలిస్ వీడెల్ (46) ఛాన్సలర్ పదవికి పోటీ పడుతున్నారు.



రెండో ప్రపంచయుద్ధం తర్వాత జర్మనీలో ఆవిర్భవించిన సిడియు–సిఎస్‌యు రెండింటినీ ''సోదరపార్టీలు''గా పిలుస్తారు. బుందేస్టాగ్‌లో ఈ రెండుపార్టీలూ ఎప్పుడూ ఒకేపార్లమెంటు గ్రూపుగా కొనసాగుతాయి. ఈ రెండు పార్టీలకు దేశంలోని అన్ని రంగాలలోనూ ఉమ్మడి అనుబంధ సంస్థలు, సంఘాలు ఉన్నాయి. యూరోపియన్ పార్లమెంటులో 1999 నుండీ అతిపెద్ద పార్టీగా ఉన్న యూరోపియన్ పీపుల్స్ పార్టీ (ఇపిపి)లో ఈ 'సోదరపార్టీలు' భాగస్వాములుగా ఉన్నాయి. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు రోబెర్టా మెట్సోలా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండెర్‌లేయన్ ఇద్దరూ మెజారిటీ ఇపిపికి చెందినవారే.

దేశంలో ఇలా గడువుకు ముందే ఆకస్మిక ఎన్నికలు జరగడం దేశంలో ఇది నాలుగోసారి. జర్మనీ పార్లమెంటు చరిత్రలో ఇప్పటివరకూ 1972, 1983, 2005 సంవత్సరాలలో ఇదేవిధంగా ఆకస్మిక ఎన్నికలు జరిగాయి. 2024 డిసెంబరు 16న పార్లమెంటులో జరిగిన విశ్వాసపరీక్షలో సోషల్ డెమొక్రాట్స్ సారథ్యంలోని మూడు పార్టీల కూటమి ప్రభుత్వం ఓడిపోవడంతో ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ ప్రభుత్వం కుప్పకూలింది. నిర్ణీత ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరు 28న ఎన్నికలు జరగాల్సి ఉండగా ముందుగానే ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకూ షుల్జ్ ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారు. మూడు పార్టీల కూటమి ప్రభుత్వంలో ఫ్రీ డెమొక్రటిక్ పార్టీ (ఎఫ్‌డిపి) తరపున ఆర్థికమంత్రిగా ఉన్న క్రిస్టియన్ లిండ్నెర్‌ను మంత్రివర్గం నుండి ఓలాఫ్ షుల్జ్ గత ఏడాది నవంబరు 6న పదవి నుండి తొలగించడంతో ప్రభుత్వంలో సంక్షోభం ముదిరిపాకానపడింది. దేశ ఆర్థిక సమస్యల పరిష్కారంలో విధానపరమైన విభేదాలు కూటమిలో తలెత్తడంతో షుల్జ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కూటమిలో అధికార భాగస్వామ్యపార్టీ ఎఫ్‌డిపి కాస్తా ప్రతిపక్షంగా మారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది. భిన్న సైద్ధాంతిక ఆలోచనలున్న ఈ మూడుపార్టీ కూటమి ప్రభుత్వం మొదటి నుండీ సవాళ్ళను ఎదుర్కొంటూ వస్తున్నది. 2021 నుండి షుల్జ్ ఛాన్సలర్‌గా కొనసాగుతున్నారు.

కూతురుపై అత్యాచారానికి పాల్పడ్డ

## కసాయి తండ్రికి 20 ఏళ్ల జైలు

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** కన్న కూతురు పై అత్యాచారం చేసిన కేసులో అత్యాచారం ,పోక్సో కేసుల ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్ రావు 20 సంవత్సరాల జైలు,10వేలు జరిమానా విధించడం జరిగిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.గ 2023 సంవత్సరం డిసెంబర్ 14న నిందితుడు కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామానికి చెందిన అక్కెనపల్లి ఆంజనేయులు 6 వ తరగతి చదువుతున్న తన సొంత కుమార్తెను ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అత్యాచారం చేసి ఎవ్వరికీ చెప్పవద్దని బెదిరించాడు.తన తల్లి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి గమనించి అడగగా, కూతురు జరిగిన విషయం వివరించింది. వెంటనే తల్లి కట్టంగూర్ పోలీసు స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు అక్కనపల్లి ఆంజనేయులుపై కేసు నమోదు చేసి సరైన ఆధారాలను కోర్టుకి సమర్పించగా నిందితుడిని న్యాయమూర్తి విశ్వనాథ్ దిలీప్ రావు దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.ఇట్టి కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ ఎస్.రాఘవరావు,సిఐ సి.శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ డి.రాజు,ప్రస్తుత సిఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ ఎం.రవీందర్,ఎపిపి వేముల రంజిత్ కుమార్, సిడిఓ రువ్వ నాగరాజు,కల్పన, లీగల్ ఆఫీసర్, బరోసా సెంటర్,కోర్టు లైజైనింగ్ ఆఫీసర్స్ పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్ ను జిల్లా ఎస్‌పి అభినందించారు.

## కరెంటు షాక్‌తో చెట్టుపైనే మేకల కాపరి మృతి



**ప్రజాపక్షం/ నల్లగొండ(తిప్పర్తి):** నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మర్రి గూడెం గ్రామ సమీపంలో మేకల కాపరి నిండు ప్రాణాలు బలి తీసుకుంది. మేకల కోసం చెట్టు ఆకులు సమకూర్చేందుకు ప్రయత్నించిన మేకల కాపరి కరెంటు షాక్ తో మృత్యువాత పడ్డాడు. ఈ హృదయ విదారక సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామాని కి చెందిన సింగం భాస్కర్ (48) మేకల కాపరిగా జీవనం కొనసాగిస్తున్నాడు.మేకల మేత కోసం తుమ్మ చెట్టు ఎక్కి కొమ్మలు కొట్టే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు కిందికి ఉండడంతో విద్యుత్ తీగలు తగిలి షాక్ తో చెట్టు మీదనే ప్రాణాలు వదిలాడు. గత కొద్ది రోజులుగా గ్రామ సమీపం లో ఉన్న విద్యుత్ వైర్లు కిందికి ఉ న్నాయని గ్రామస్తులు చెప్పినప్పటికీ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఒక నిండు ప్రాణం బలైందని విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని మృతుని కుటుం బానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ఇద్దరు అధికారులకు షోకాజు నోటీసులు




**ప్రజాపక్షం /మునుగోడు:** జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం మండలంలో కస్తూర్బాగు గురుకుల పాఠశాల,బిసి బాలుర హాస్టల్ ప్రభుత్వ అర్యోగ కేంద్రం తహసిల్దార్ కార్యాలయంను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ముందుగా బిసి హాస్టల్ వెళ్లి పరిశీలంచగా అక్కడ వార్డెన్ లేకపోవడం తో అతనికి సోకాజు నోటీసు జరిచేశారు.అనంతరం కెజిబివి పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థినిలకు గణితం బోధించారు.కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన విద్యానిలకు చోక్లెట్ ఇచ్చారు.ఆ సమయంలో ఆ పాఠశాల ఎస్ఓ కు సోకాజు నోటీసు లు ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ హాస్పెటల్ ను తనిఖీ చేసి అధికారుల అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు.అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో మండలంలో ఉన్న ప్రభుత్వ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.ఆమె వెంట ఆర్డిఓ శ్రీదేవి, తహసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ శాంతి కుమారి ఉన్నారు.

## ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో జరిగిన బీసీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీలకు ఇస్తానన్న పథకాలను అమలు చేయాలన్నారు. బీసీలలో చేతివృత్తిదార్లుకు చేయుతనందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ మాటను నిలబెట్టుకోవాలన్నారు. తమ డిమాండ్ల సాదనకై బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధూళిపాళ శ్రీనివాస్ నాయుడు,చికలరాజు శ్రీను,కొమర్రాజు వెంకట్,ఇనుగుర్తి వెంకటరమణాచారి,నిగిడాల వీరయ్య, పరికే భరత్,జడ వెంకన్న,పిల్లుట్ల కనకయ్య,ఉప్పతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కాంగ్రెస్ కంకణం

మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణను ఏడారిగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని మాజీ ఎంపి, బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణ నీళ్లు ఆంధ్రకు అక్రమంగా తరలిస్తున్న కళ్లున్న కబోదిలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నతారు. కెఆర్ఎంబికి తెలంగాణ ప్రభుత్వం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. నాగార్జున సాగర్‌కు 1000 టిఎంసిల నీరు వస్తే అందులో 60శాతం ఆంధ్ర, 40శాతం తెలంగాణను వాడుకోవాల్సి ఉన్నప్పటికి 10వేల క్యూసెక్కుల నీటిని ఆంధ్రాకు దొంగతనంగా తరలించారన్నారు. వాళ్లకు రావాల్సిన నీటినే కాకుండా ఇంకా అక్రమంగా నీటిని తరిస్తున్న ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మా నాయకులు హరీష్ రావు కృష్ణజలాలను అక్రమంగా వాడుకుంటారన్ని కెఆర్ఎంబి వద్ద ధర్నా చేస్తామని, ఢిల్లీకి వెళ్తామని హెచ్చరించిన తరువాత కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్, నెమ్మాది భిక్షం, తూడి నర్సిహ్మారావు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు




**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి తెలియజేశారు.శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ను కోరగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ వ్యాప్తంగా 200 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని,జిల్లాకు సంబంధించి 37 ఉన్నాయని ,ఇందుకుగాను 50 మంది ప్రిసైడింగ్ అధికారులను ,50 మంది పోలింగ్ అధికారులను నియమించడమే కాకుండా, వారికి శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశామని తెలిపారు.22 వేల 439 ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులకు గాను, 3358 వరకు పంపిణీ చేయడం జరిగిందని, ఈనెల 25 లోపు తక్కినవి పంపిణీ చేస్తామని, నల్లగొండ జిల్లాకు సంబంధించి 4182 ఓటర్ స్లిప్పులకు గాను ,ఇప్పటివరకు 501 పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికలకు జంబో బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నామని, నియోజకవర్గ పరిధిలో అన్ని జిల్లాలలో సరిపడే విధంగా జంబో బాక్సులు ఉన్నాయని తెలిపారు. 28 వేల బ్యాలెట్ పేపర్లను ఈ ఎన్నికలలో వినియోగించడం జరుగుతున్నదని, వీటన్నింటినీ ఇదివరకే పరిశీలించడం జరిగిందని, శనివారం అన్ని జిల్లాలకు వీటిని పంపిస్తున్నట్టు తెలియజేశారు.నల్లగొండ పట్టణం సమీపంలోని ఆర్జాల బావి గోదాము వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రత్యక్షంగా అర్జాలబావి గోదాం సందర్శించి ఆమోదం తెలిపారని చెప్పారు. అలాగే 50 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వారికి శిక్షణ కార్యక్రమాన్నీ కూడా పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు.జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 37 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 5 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందని, 13 రూట్లను ఏర్పాటు చేశామని, అలాగే ఇందుకు సంబంధించి 15 స్ట్రైకింగ్ ఫోర్సు , 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 29 ఫ్లయింగ్ స్పాడ్స్ ,41 ఎం సి సి బృందాలను నియమించామని, మొత్తం ఎన్నికలలో518 మంది పోలీసుల సేవలను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులను ఎన్నికల సిబ్బంది పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విధులు నిర్వహించే పిఒ, ఎపిఒ, ఓపిఒ, మైక్రో అబ్జవర్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల నుండి ఏ ఒక్కరికి మినహాయింపు లేదని అందరు తప్పక హాజరు కావాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పింక్ కలర్ బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తారని, బ్యాలెట్ పేపర్‌పై ప్రాధాన్యత ప్రకారం ఎన్నికల కమిషన్ వారు ఇచ్చే వైలెట్ స్కెట్ పెన్నుతో మాత్రమే పోటీ చేసే అభ్యర్థుల పేరుకు ఎదురుగా ఉన్న బాక్సులో వరుస క్రమంలో రోమన్ అంకెల సిరియల్ ప్రకారం ఓటు వేయాలన్నారు. మధ్యలో అంపూర్తిగా నెంబర్లు వేసిన, పేర్లు రాసిన, ఇంగ్లీష్ అక్షరాలతో రాసిన ఆ ఓటు చెల్లదన్నారు. ఈనెల 26న ఉదయం 7 గంటలకు సిబ్బంది బ్యాలెట్ పంపిణీ కేంద్రాలకు చేరుకొని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓటరు జాబిత, ఎన్నికల సామాగ్రిని తీసుకోవాలన్నారు. వారికి కేటాయించిన బస్సుల ద్వారా ఎస్‌కాట్ సహాయంతో కేంద్రాలకు చేరాలన్నారు. పోలింగ్ కేంద్రానికి పిఒ, ఎపిఒ, ఇద్దరు ఓపిఓలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి మొత్తం సూపర్‌వైజ్ చేయాలని ఓపిఓ మార్కెడ్ కాపికి ఇన్‌చార్జ్‌గా ఉంటూ పురుషులకు రెడ్ పెన్‌తో మార్కింగ్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో రాజకీయ ప్రచారం చేయరాదని, 200 మీటర్ల దూరంలో పోలింగ్ స్లీప్పులను పంపిణీ చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ముగ్గురు ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఒకసారి ఒకరికి మాత్రమే అనుమతి ఉంటుందని, మరో ముగ్గురు బయట ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డిటి వేణు, ఎన్నికల శిక్షకులు రమేష్, వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఆధార్‌లో పేరు మార్ఫింగ్‌తో భూమి కాజేసిన కేటుగాళ్లు?

ధరణి ఆపరేటర్ సస్పెన్షన్,

సంఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించిన కలెక్టర్

**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం తహసిల్దార్ కార్యాలయంలో ఆధార్‌కార్డులో పేరు మార్ఫింగ్ చేపట్టి భూమిని అక్రమంగా రిజిస్టర్ చేసుకున్న కేటుగాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు గుండాల తహసిల్దార్ కార్యాలయం ధరణి ఆపరేటర్‌ను తక్షణమే విధులను తొలగించి, సంఘటన పూర్వాపరాలపై జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. సంఘటన వివరాలలోకి వెళితే గుండాల మండల కేంద్రంలోని 177/1, 177/2 సర్వే నెంబర్లలో ఎకరాలు 9.17 గుంటలకు ఒరిజినల్ పట్టాదారుడు యూసుఫ్‌ద్దీన్ తండ్రి వలీ మహ్మద్ జీవనోపాధి కోసం హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. ఇదే అదనుగా భావించిన నల్లగొండ నివాసి సయ్యద్ ఇబ్రహీం తన ఆధార్ కార్డులో తన పేరుతోపాటు తండ్రి పేరును మార్ఫింగ్ చేసుకొని గుండాల తహసిల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్‌తో యూసుఫుద్దీన్‌కు చెందిన తొమ్మిది ఎకరాల 9.17 గుంటల భూమిని గుండాల మండలానికి చెందిన బాదరబోయిన నరసిహ్మ తండ్రి రాంమల్లు, మంద మహేశ్వరి భర్త నరసింహ అనె వ్యక్తులపైకి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినారు. విషయం తెలుసుకున్న యూసుఫుద్దీన్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా సత్వరమే స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టడంతో జరిగిన భూభాగోతం బయటపడింది. ధరణిలో అవకతవకలకు పాల్పడ్డ ధరణి ఆపరేటర్ ఎన్.రాజును విధులనుండి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయడమే కాకుండా జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తహసిల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ అధికారులవ్రాతపై నివేదిక సమర్పించాలని భువనగిరి రాజస్వవ మండలాధికారి క్రిష్ణారెడ్డిని ఆదేశించారు. అదేవిధంగా ధరణి రికార్డుల నుండి తొలగించిన యూసుఫుద్ధీన్ పేరును తిరిగి రికార్డులో నమోదుచేసి బాధితునికి కలెక్టర్ న్యాయం చేసి ఆదుకున్నారు. ఈ సంఘటనతో జిల్లాలోని అన్ని తహసిల్దార్ కార్యాలయాల్లో యంత్రాంగం అప్రమత్తమయింది. నాకు న్యాయం చేసి తన భూమిని కాపాడిన కలెక్టర్ దేవునితో సమానమని యూసుఫుద్దీన్ భావోద్వేగంతో మీడియాకు తెలియజేశారు. ఇలాంటి ఘటనలు ధరణిలో చేస్తున్న ఆగడాలు, అక్రమాలకు అడ్డుకట్టపడనున్నాయని కలెక్టర్ చొరవను పలువురు సామాజిక కార్యకర్తలు, ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## పెద్దగట్టు జాతరలో పోలీసుల సేవలు అభినందనీయం : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట: శ్రీ లింగమంతుల స్వామి(పెద్దగట్టు) జాతరలో ఐదు రోజులు పోలీసులు చేసిన సేవలను గుర్తించిన జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం వారిని అభినందించారు. దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర ప్రశాంతంగా ముగియడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. సూర్యాపేట డిఎస్‌పి రవి, రూరల్ సిఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్‌లు ప్రణాళికతో పని చేశారని చెప్పారు. జిల్లా పోలీస్ శాఖకు ఆయా శాఖల అధికారులు, భక్తులు, మీడియా ప్రతినిధులు సహకరించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని రెండవ అతిపెద్ద జాతరగా పేరొందిన పెద్దగట్టు జాతరకు 2వేల మంది పోలీస్ సిబ్బందిని మూడు విడతలుగా 24 గంటల పాటు విధులు నిర్వహించినట్లు తెలిపారు. మఫ్టిటీం, క్రైం, టెక్నికల్ టీమ్స్, కమ్యూనికేషన్ విభాగం, షీటీమ్స్, స్పెషల్ పార్టీ, డాగ్ స్క్వాడ్స్, బాంబ్ స్క్వాడ్స్‌తో పటిష్టమైన భద్రత ఏర్పా టు చేయడంతో జాతర ప్రశాంతంగా ముగిసిందన్నారు. జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపుకు సహకరించిన వాహనదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల జిల్లా :** జిల్లాలో ఇంటర్మీడియల్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏరాకపట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్ విద్య,పాఠశాల విద్య,రెవెన్యూ, పోలీసు,రవాణ.వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులను ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో దృష్టిలో ఉంచుకుని పరీఓ కేంద్రాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.జిల్లాలో 14 పరీక్షకేంద్రాలలో 8,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,057,ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,284 మంది విద్యార్థులు ఉన్నారన్నారు.పరీఓలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్స్,ఫ్లయింగ్ స్క్వాడ్స్,సిట్టింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని శాఖల సహకారం తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఆర్డీవో శ్రీనివాస రావు, డిఎస్పీ మోగిలయ్య, హృదయరాజు పాల్గొన్నారు.

**నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు**

ప్రస్తుత రబీ సీజన్,రానున్న వేసవిలో జిల్లాలో నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను జిల్లా కలెక్టర్ సంతోష్ ఆదేశించారు.శుక్రవారం జూరాల విద్యుత్ జనరేషన్ ప్లాంట్ 220/132 కేవి,జూరాల సబ్ స్టేషన్ 132/33 కువి,33/11 కేవి గద్వాల సబ్‌స్టేషన్,మానిటరింగ్ సెల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.

## భవిష్యత్ రాష్ట్ర రాజకీయాలను శాసించేది 'బిసి'లే

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు

జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో బిసి అభ్యర్థులను బీసీలంతా ఏకమై అఖండ మెజార్టీతో గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. భువనగిరి పట్టణ కేంద్రంలోని ఎస్‌వి హోటల్లో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించడం ద్వారా బీసీల రాజకీయ శకం ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్ర రాజకీయాలను బీసీలే రేపటి భవిష్యత్ శాసించనున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అంతా సంఘటితమై గెలిపిస్తే నల్లగొండ జిల్లాలో రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేసి, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి బీసీ సీఎం కావడం ఖాయమని అన్నారు. నేడు బీసీ సంక్షేమ సంఘం బీసీల ఓటు బీసీలకే ఓటు మనదే సీటు మనదే అనే నినాదంతోటి చేపట్టిన బీసీల ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఐదు శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి అన్ని ఉపాధ్యాయ సంఘాలు గెలుపు గుర్రాల పెరుతో రెడ్లకు బిఫామ్‌లు ఇచ్చాయని, బీసీలకు మాత్రం టికెట్లు నిరాకరించి బహుజనులను అవమానించారని చెప్పారు. ఈ ఎన్నికలలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గంలో ఓటును ఆయుధంగా చేసుకుని రెడ్ల పాలనకు బహుజనులు అంత ఏకమై వారికి చరమగీతం పాడాలంటే ప్రస్తుతం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'బీసీల ఓటు బీసీలకే వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘంజిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి, భువనగిరి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సాబన్ కార్ వెంకటేష్, యాదగిరిగుట్ట మండలం అధ్యక్షులు అశోక చారి, వలిగొండ మండలం అధ్యక్షులు సాయిని యాదగిరి, ఆలేరు నియోజకవర్గం అధ్యక్షులు పేరపురాములు, కంబాలపల్లి శ్రీరాములు, వట్టిపల్లి రాజు, పల్లె రాజాలు గౌడ్, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులపై పోలీసుల కర్కశం

జాతర నుండి వెళ్లిపోవాలని లేకుంటే జెసిబిలతో తొలగిస్తామని హుకూం

పోలీసుల తీరుపై విమర్శల వెల్లువ



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరలో చిరు వ్యాపారులపై పోలీసులు కర్కశంగా వ్యవహరిస్తున్నారు. జాతరలో ఐదు రోజుల పాటు వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని తక్షణమే వెళ్లిపోవాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే జెసిబిలతో తొలగిస్తామని హెచ్చరించారు. గతంలో ఎన్నడు లేని విధంగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతరగా పేరొందిన శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర ఈనెల 16 నుండి మొదలై 20వ తేదీతో ముగిసింది. అనేక మంది చిరు వ్యాపారాలు పొట్టకూటి కోసం భార్య పిల్లలతో సుదూర ప్రాంతాల నుండి ఒక్కడ జాతరలు జరిగితే అక్కడికి వెళ్లి వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలోనే వ్యాపారం చేసుకునేందుకు వందలాది వివిధ రకాల వ్యాపారులు దురాజ్‌పల్లి జాతరకు వచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారు వ్యాపారం సాగించే స్థలానికి నిర్ణయించిన డబ్బులను చెల్లించడం, విద్యుత్ వాడకానికి కూడా బిల్లులు చెల్లిస్తూ వ్యాపారం చేస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే జాతరలో ఈ సంవత్సరం వ్యాపారాలు సరిగ్గా నడవక చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోయ్యారు. జాతర ముగిసిన భక్తులు పెద్దగట్టుకు పెద్ద ఎత్తున తరలి వస్తుండడంతో మరో మూడు రోజుల పాటు వ్యాపారాలను కొనసాగించుకునేందుకు గట్టు పరిసర ప్రాంతాల్లో ఉండగా జాతర ముగిసింది వెంటనే ఈప్రాంతం ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. ఇదేమని ప్రశ్నించి ఓ గాజుల వ్యాపారిపై లాఠీ ఝులిపించారు. ఐదు రోజుల నుండి తాము విధులు నిర్వహిస్తున్నామని తాము ఇంటికి వెళ్లాలంటూ నానా దుర్భాషలాడారు. గతంలో ఎన్నడు లేని విధంగా వ్యాపారులపై పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**బడా వ్యాపారుల జోలికి వెళ్లని పోలీసులు..?**

చిరు వ్యాపారుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్న పోలీసులు బడా వ్యాపారుల జోలికి వెళ్లడం లేదు. జాతర ప్రాంగణంలో ఎగ్జిబిషన్ నిర్వహకుల జోలికి, కొబ్బరికాయలు, లడ్డూ అమ్మకందారులను వైపు మాత్రం వెళ్లడం లేదు. ఈ వ్యాపారాలు కొనసాగించే వారు రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులు కావడం, లక్షలాది రూపాయల పెట్టుబడితో సాగిస్తున్న వ్యాపారాలు కావడంతో వారికి రక్షణ కవచంగా పోలీసులు నిలుస్తున్నారు. దీనికి ప్రతిఫలంగా వారి నుండి కొంత మంది పోలీస్ అధికారులకు భారీగానే నజరానాలు అందినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎగ్జిబిషన్ రాత్రి 10గంటల సమయం దాటితే ఆపాలనే నిబంధన ఉన్నా అడ్డుకొకుండా విద్యుత్ దీపాలు బంద్ చేసి పొద్దుపోయేంత వరకు నడిపించారు. బడా వ్యాపారులను ఒకలా... తమను మరోలా చూడడం చిరు వ్యాపారులు కంటతడి పెడుతున్న పరిస్థితి. ఇదే విషయమై పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరగా తాము ఎవరిని వెళ్లిపోవాలని చెప్పలేదంటూ సమాధానం దాటవేయడం కొసమేరుపు.

## కలెక్టర్‌గారూ పెట్టుబడి కూడా రాలేదు..

జాతరలో వ్యాపారానికి చేసుకునేందుకు మరో మూడు రోజులు అవకాశం ఇవ్వండి

**ప్రజాపక్షం/చివ్వెంల:** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరలో తాము వ్యాపారం చేస్తే పెట్టుబడులు కూడా రాలేదని వ్యాపారం చేసుకునేందుకు తమకు మరో మూడు రోజులు అవకాశం ఇవ్వాలని చిరు వ్యాపారులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను వేడుకున్నారు. జాతరలో వ్యాపారాలు సాగిస్తున్న చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను పోలీసువారు తక్షణమే తొలగించాలని ఇబ్బందులకు గురి చేస్తుండడంతో వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ జాతరలో వ్యాపారాలు దక్కించుకునేందుకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన జాతర జరిగిన ఐదు రోజులు బేరాలు నడవకా తాము తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. గతంలో ఎన్నడు లేని విధంగా తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్ల పాపలతో తాము పొట్టకూటి కోసం జాతరాల్లో వ్యాపారాలు సాగిస్తూ సంచార జీవుల్లా బతుకుతున్నామన్నారు. వ్యాపారాలు చేసి తాము లక్షలు గడిస్తలేదని, కేవలం తమ పొట్టకూటి కోసమే వ్యాపారం చేస్తున్నామన్నారు. మరో మూడు రోజుల పాటు జాతరలో వ్యాపారాలు సాగించుకోవాలని చూడగా పోలీసులు దుకాణాలను ఎత్తివేయాలంటూ తమపై జూలుం చేయడం జరుగుతుందన్నారు. పెద్ద వ్యాపారులను వదిలిపెట్టి తమపై పోలీసులు ప్రతాపం చూపడం ఎంత వరకు సబబుమని ప్రశ్నించారు.



## శ్రీచైతన్యలో విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఒత్తిడి మరో విద్యార్థిని ప్రాణాలు తీసింది. ఖమ్మం లోని శ్రీచైతన్య కళాశాల ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న బ్రాంచ్‌లో ఇ ంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న దేగల యోగానందిని (16) శు క్రవారం ఉదయం హాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇ ది గమనించిన సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. యోగాన ందినిది అల్లూరి సీతారామరాజు జిల్లా భద్రాచలం సమీపంలోని ఏటపాక గ్రామం. విద్యార్థి ఆత్మహత్యను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళన ను నిర్వహించాయి. ఖమ్మంలో సైతం హాస్టల్‌లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఆత్మహత్య జరిగిన ప్ర తిసారి తల్లిదండ్రులను కూర్చోబెట్టడం నయానో భయానో బెదిరించి ఎ ంతో కొంతకు పరిహారం పేరుతో సెటిల్‌మెంట్ చేసుకోవడం అలవాటుగా మారింది. తల్లిదండ్రులు సైతం ఇక చనిపోయిన బిడ్డ తిరిగొస్తుందా అన్న భావనలో ఉండడం యాజమాన్యాలకు కలిసి వస్తుంది. అధికారులు సై తం ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు స్పందించకపోవడం గమనార్హం.

## ఎసిబి రైడ్‌పై అధికారులు లోతైన విచారణ చేపట్టాలి




**ప్రజాపక్షం/అశ్వాపురం:**అశ్వాపురం మండలంలో ఏవో సాయి శాంతన్‌పై ఎసిబి దాడి జరగడం దురదృష్టకరమని, మండల వ్యవసాయ శాఖ అధికారిక రైతుల పక్షపాతిగా 24గంటల పాటు రైతులకు సేవలు అందిస్తున్నా ఏవో సాయి శాంతన్‌పై కొందరు కావాలనే కుట్రపూరితంగా పన్నాగంతోనే ఎసిబి రైడ్ జరిగిందని, మండలంలో మంచి అధికారిని ఎలా అభాసిపాలు చేయడం దురదృష్టకరమైన విషయమని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ అన్నారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సూచనలు సలహాలు చేయడంలో ఎఒసాయి శాంతన్ ముందుండి చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి రైతుకు అన్ని విషయాలను అర్థమయ్యేలా తెలియపరిచే అధికారి, ఆయనకు ఇలాంటి పరిస్థితి రావడం చాలా బాధాకరమని అన్నారు. ఈ ఘటనపై ఎసిబి పూర్తిగా న్యాయ విచారణ జరపాలని, లేని యెడల అశ్వాపురం మండలంలో ఉన్న రైతులందరినీ వేదికగా ఏర్పరచుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూమి కాపాడాలని ఆర్‌డిఒకు వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిని ప్రైవేటు వెంచర్ వారు ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని అట్టి భూమిని కాపాడాలని కోరుతూ శుక్రవారం గ్రామానికి చెందిన పావురాల వీరబాబు, ఖమ్మం ఆర్‌డిఒజి. నర్సింహారావుకు వినతి పత్రం సమర్పించారు. పోలేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.141, 142 లో ప్రభుత్వ భూమి లో డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించారని ఆ ఇండ్ల వెనక భాగంలో కొంత ప్రభుత్వ భూమి ఉందన్నారు. అట్టి భూమిని గ్రామంలోని పేదల ఇండ్ల స్థలాల కోసం కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వ స్థలం పక్కన ప్రైవేటు వెంచర్ నిర్మాణం జరుగుతుందని సుమారు ఆరు కుంటల ప్రభుత్వ భూమిని వారు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారని వినతి పత్రంలో తెలిపారు. దీనికి సంబంధించి గ్రామస్తులంతా వెళ్లి సదరు వెంచర్ వారిని అడిగినా ఎటువంటి ఫలితం లేదన్నారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వ భూమిని ఆక్రమణ నుంచి కాపాడి హద్దులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## 'వారబందీ' నీటి సరఫరాను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :**రైతులు వారబంధీ విధానం నీటి సరఫరా ను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ జె.మానిక్రావ్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో శుక్రవారం రైతులకు అవగాహన సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాగు నీటికి ప్రభుత్వం వారబంధీ విధానం ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం నీటి సరఫరా జరుగుతుందని సూచించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని అన్నారు. వచ్చే నీటిని క్రమ పద్ధతిలో వినియోగించుకోవాలని అన్నారు. నీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి యం.రాధ. ట్రాన్స్కో ఏఈ కె.రామారావు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో అక్రమార్కులు

జెసిబి, ఐదు ట్రాక్టర్లు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:**మండల పరిధి లోని బేతాళ పాడు పెద్దవాగులో గత కొంత కాలంగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ డబ్బు సంపాదనకు అలవాటు పడ్డ కొందరు ఇసుకతో వ్యాపారం చేస్తున్నారు. ఏకంగా జెసిబిలను పెట్టి గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి, తెల్లవారుజామున అనే తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. సామాన్యులకు ఎక్కువ ధరలకు ఇసుకను అమ్ముతూ తరలించే పనిలో ఉన్నారు. ఇటీవల పోలీస్‌లు అక్రమ ఇసుక దారులకు చెక్ పెట్టడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలయ్యాయి. జూలూరుపాడు సబ్ ఇన్స్పెక్టర్ రవి అక్రమ ఇసుక తరలించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో గురువారం తెల్లవారుజామున బేతాళపాడు పెద్దవాగులోజెసిబి తో ఇసుక తోడుతూ ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్నారనే సమాచారంతో పోలీస్‌లకు అక్కడికి చేరుకొని అక్కడ కొందరిని అదుపులోకి తీసుకొనిజెసిబిని, ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. జెసిబి యజమాని రమేష్, రాందాస్, ట్రాక్టర్ యజమానులు అనిత,భీమ్లా, హుస్సేన్‌లుగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉ ంది.

# 'ఆ వెంచర్'లో.. అంతా'మాయ'!

*మున్సిపాలిటీలో పంచాయతీ పేరుతో అనుమతులు *ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
*విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి

**ప్రజాపక్షం/ఖమ్మం :** రియల్ వ్యాపారులు వెంచర్లు వేసి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికోడుతున్నారు. వైరాలో ఒక రియల్ ఎస్టేట్ వెంచర్ అనుమతులు మొత్తం డొల్ల అని మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత వెంచర్ వేసి పంచాయతీ పేరుతో అనుమతులు తీసుకున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. డిటిసిపి లే అవుట్ ప్రకారం అనుమతులు తీసుకోవాల్సి ఉండగా గ్రామ పంచాయతీ సోమవరం ఈవోగా పనిచేసిన ఉద్యోగి ద్వారా అనుమతులు తీసుకుని వెంచర్ ఏర్పాటు చేశారని తెలుస్తుంది. 2018 ఆగస్టు రెండున వైరా మున్సిపాలిటీ ఏర్పాటు చేశారు. అప్పటి వరకు సోమవరం గ్రామ పంచాయతీగా ఉంది మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత బ్రాహ్మణపల్లి సమీపంలోని వ్యవసాయ భూమిలో రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటు చేశారు. వైరా మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాతే రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఏర్పాటు చేసినప్పటికీ మున్సిపాలిటీ అనుమతులు తీసుకుంటే అదనపు ఖర్చు అవుతుందని భావించిన సదరు రియల్ వ్యాపారి రియల్ వెంచర్ ఏర్పాటుకు ముందే సోమవరం గ్రామ పంచాయతీ వద్ద అనుమతులు తీసుకున్నట్లు రికార్డులు సృష్టించారు. మున్సిపాలిటీ ఏర్పాటుకు మూడు నెలల ముందు పంచాయతీ అనుమతులు తీసుకున్నట్లు చూపించి వ్యాపారాలు నిర్వహించారు. స్థానిక ఎనిమిదవ వార్డులో ఉన్న ఈ వెంచర్‌కు సంబంధించి ఇప్పటికి మున్సిపాలిటీ వద్ద ఎటువంటి రికార్డులు లేవు. అనుమతులు ఇచ్చిన ప్రభుత్వపరంగా అనుమతులు పొంది ఉంటే రికార్డులు ఏమయ్యాయన్న ప్రశ్నకు సమాధానం లేదు. వెంచర్ అనుమతుల రికార్డు మాయం చేయడం వెనక పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. జిల్లా అధికారులు ఈ వెంచర్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అనుమతులు ఇచ్చింది ఎవరు, ఎలా ఇచ్చారు, వెంచర్ ఏర్పాటు కాకముందే ఇచ్చిన అనుమతులకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఇందులో స్థలాలు కొనుగోలు చేసిన వారు కోరుతున్నారు.






## సిఎం, మంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరేషన్ పథకం) ను ప్రకటించడం హర్షణీయమని ప్రభుత్వ రుణం తీర్చుకోలేనిదని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని శ్రీబాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రకటించడంపై ధన్యవాదాలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వత్సవాయి రవి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అకుంఠిత దీక్షతో కృషి చేశారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రకటించడంతో పాటు 25 శాతం రాయితీని ప్రకటించడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని కొనియాడారు. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల ప్రజలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఏజెంట్లకు వరంగా మారిందన్నారు. ఈ పథకం కోసం గత నాలుగున్నర ఏళ్ల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎదురు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే ఎల్‌ఆర్‌ఎస్ సమస్యను పరిష్కరించిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు సద్వినియోగం చేసుకుంటారని ఆయన తెలిపారు. సబ్సిడీ గడువు కాలం మార్చి 31 వరకు ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్లాట్లు కొన్న వారికి రిజిస్ట్రేషన్ గడువుకు సమయం పడుతుంది కాబట్టి సబ్సిడీ సమయాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో పాటు సహకరించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి వర్గ ఉప సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల మాజీ ఎంపిపి గోసు మధు, ఆఫీస్ ఇన్‌చార్జి పోగుల రవికుమార్, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్లు షేక్ తాజుద్దీన్, కాసాని శ్రీశైలం, గాలినారాయణ, తోట వెంకటేశ్వర్లు, బాబురావు, జాని, ఉపేందర్,సుమన్,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్ ఎంఎల్‌సి స్థానాల ఎన్నికలపై జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌లు పాల్గొన్నారు. ఎన్ని కల ప్రవర్తన నియమావాళి, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ల జారీ, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు, వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాటు, పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదీర్ఘంగా చర్చించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో టీచర్ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణను అందించామన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లను నేరుగా నల్లగొండకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉన్నాయని పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. సిపి సునీల్ దత్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ. పద్మశ్రీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శైవ క్షేత్రాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు సమీప డిపోల నుంచి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజులు భక్తుల రద్దీని బట్టి బస్సులను నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని శైవ క్షేత్రాలకు సమీప డిపోల నుండి 75 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇట్టి ప్రత్యేక బస్సులు అదనపు ఛార్జీతో నడపబడతాయని, మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అనుమతించబడుతుందని ఆర్‌ఎం తెలిపారు. . పెద్దలకు రూ. 30లు, పిల్లలకు రూ.20 ఛార్జీ, వైరా లక్ష్మి పురంకు మధిర డిపో నుంచి 10 బస్సులు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ. 20, నీలాద్రి ఆలయానికి సత్తుపల్లి డిపో నుంచి 25 బస్సులు నడపనున్నట్లు ఛార్జీ పెద్దలకు రూ. 50, పిల్లలకు రూ. 30, మోతెగడ్డ ఆలయానికి భద్రాచలం డిపో నుంచి ఐదు బస్సులు నడపనున్నట్లు ఛార్జీ పెద్దలకు రూ. 30, పిల్లలకు రూ. 20, నీలాద్రి, అన్నపురెడ్డి పల్లి, బెండాలపాడు ఆలయాలకు కొత్తగూడెం డిపో నుంచి 10 బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. నీలాద్రి, అన్నపురెడ్డిపల్లికి ఛార్జీ పెద్దలకు రూ. 90, పిల్లలకు రూ. 50, బెండాలపాడుకు చార్జీ పెద్దలకు రూ. 30, పిల్లలకు రూ. 20 ఛార్జీ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికుల రద్దీని బట్టి అదనపు సర్వీసులను నడిపనున్నట్లు ఆయన తెలిపారు. మరింత సమాచారం కొరకు ఖమ్మం నూతన బస్టాండ్ సెల్ నెం. 9959225958, 99592 25979, ఖమ్మం పాత బస్టాండ్ సెల్ నెం. 99 59225965, సత్తుపల్లి డిపోకు సంబంధించి 99 59 22 5962, 9959225990, మణుగూ రు డిపోకు సంబంధించి 9959225963, 89 853 61796, కొత్తగూడెం డిపోకు సంబంధిం చి 99 59225959, 9959225982, మధిర డిపోకు సంబంధించి 9959225961, 73 82 92 5289, భద్రాచలం డిపోకు సంబంధించి నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. సురక్షిత, సౌ కర్యవంతమైన ప్రయాణం కోసం ఆర్టిసి బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం తెలిపారు.

## స్థానికులకు ఇసుక తోలుకునే అవకాశం: సిపిఐ



**ప్రజాపక్షం/చర్ల :** గోదావరి పరివాహక ప్రాం తంలోని ఇసుక రిచ్‌ల నుంచి స్థానిక అవసరాలకు ఇసుక తోలుకునే అవకాశం కల్పించాలని సిపిఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో సైతం స్థానిక అవసరాలకు అనుగుణంగా ఇసుక రిచ్‌లలో స్థానికులకు అవకాశం కల్పించారని ఆయన గుర్తు చేశారు. శుక్రవారం చర్ల మండల సిపిఐ కార్యకర్తల సమావేశం అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. భవన నిర్మాణ రంగంపై తాపీమేస్త్రీలు, రాడ్‌బెండింగ్, పెయింటింగ్, ఎలక్ట్రిషియన్, ప్లంబింగ్ మొదలైన విభాగాల్లో పనిచేసే కార్మికులు ఆధారపడి ఉన్నారని ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణాలు ఆగిపోతే వీరి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడతాయన్నారు. చర్ల ప్రాంతంలో మిర్చి కల్లాల్లో ఇసుకను వాడతారని మిర్చి రైతులకు కల్లాలకు తోలుకునేందుకు స్థానిక రిచ్‌ల నుంచి అనుమతి ఇవ్వాలని కల్లూరి కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి నూపా పోతయ్య, నాయకులు పాల్వంచ రామారావు, నూపా తిరుపతిరావు, ఆదిలక్ష్మి ,రామ్మూర్తి,ముత్తయ్యతదితరులు పాల్గొన్నా రు.

## ఉదయ్‌కుమార్ ఆశయ సాధనకు పునరంకితంకండి

19వ వర్ధంతి సభలో సిపిఐ నేత బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** దివంగత కమ్యూనిస్టు నేత పువ్వాడ ఉదయ్‌కుమార్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగా సమాజ మార్పు కోసం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు పువ్వాడ ఉదయ్‌కుమార్ అని ఆయన తెలిపారు. పువ్వాడ ఉదయ్‌కుమార్ 19వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మమత ఆసుపత్రిలోని ఉదయ్ ఘాట్‌లో స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష భావాజలంతో ఉదయ్‌కుమార్ పనిచేశారని ఖమ్మం నగరంలో పేదల నివాస స్థలాల కోసం ఆయన సాగించిన పోరాటం అజరామరమన్నారు. ఏ ఆశయ సాధన కోసం ఉదయ్‌కుమార్ తుదిశ్వాస వరకు పనిచేశారో ఆ ఆశయ సాధనతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు , ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, సిపిఐ నాయకులు పోటు పూర్ణ, సిపిఐ కార్యాలయ కార్యదర్శి కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఆటో వర్కర్లకు దుస్తుల పంపిణీ :**
పువ్వాడ ఉదయ్‌కుమార్ 19వ వర్ధంతిని పురస్కరించుకుని ఆటో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, మమత సంస్థల డైరెక్టర్ డాక్టర్ నరేన్ దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ఉదయ్‌కుమార్ పేదల అభ్యున్నతి కోసం తుదిశ్వాస వరకు పనిచేశారని గుర్తు చేశారు. పేదల అభ్యున్నతి కోసం పాలక వర్గాలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నివాళులర్పించిన మాజీ మంత్రి అజయ్ :**
పువ్వాడ ఉదయ్‌కుమార్ 19వ వర్ధంతి సందర్భంగా స్థానిక మమత ఆసుపత్రిలోని ఉదయ్ ఘాట్ వద్ద అజయ్‌కుమార్ ఉదయ్‌కుమార్ స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదాశయంతో పనిచేసిన ఉదయ్‌కుమార్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మహ్మద్ సలాం, ఏనుగు గాంధీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్‌ఆర్ నగర్‌లో :**వైఎస్‌ఆర్ నగర్‌లో పువ్వాడ ఉదయ్‌కుమార్ 19వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి సిపిఐ నాయకులు, ఆటో కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

**ప్రజాపక్షం/ఖమ్మం :** యుఎఫ్‌బియు పిలుపు మేరకు అన్ని జాతీయ బ్యాంకుల సిబ్బంది శుక్రవారం ఆందోళన నిర్వహించారు. వైరా రోడ్డులోని భారతీయ స్టేట్ బ్యాంక్ శాఖ ఎదుట ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. వారానికి ఐదు రోజులు మాత్రమే పని దినాలు ఉండాలని వారు డిమాండ్ చేశారు. బ్యాంకుల్లో సిబ్బంది నియమాకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. బ్యాంకింగ్ రంగంలో అనేక ప్రజా వ్యతిరేక విధానాలను తీసుకు వస్తున్నారని దీనిని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి షేక్ ఇబ్రహీం, రీజినల్ కార్యదర్శి ఆర్. శివకుమార్, బ్యాంక్ ఉద్యోగుల సంఘం నేతలు శ్రీనివాస్ నందన్, చిన్నప్పరెడ్డి, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు తోడ్పాటు నందించాలి

*అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లుమంజూరు చేస్తే కఠిన చర్యలు *ప్రజలకు అవగాహన కల్పించాలి *ప్రతీ మండలంలో ఇసుక డంప్ ఏర్పాటుకు చర్యలు*శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ప్రతి దశలో తోడ్పాటు నందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణ పథకం (నిర్మాణం)పై ఖమ్మం, పాలేరు, మధిర నియోజక వర్గాల మండల, గ్రామ పంచాయతీ స్థాయి అధికారులతో పాటు మండల ప్రత్యేకాధికారులకు అందించిన శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రజల జీవన విధానంలో అద్భుతమైన మార్పు తీసుకు రావచ్చునని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అర్హులకు ఇండ్లు అందేలా చూడాలన్నారు. అలాగే ఇండ్ల నిర్మాణంపై ప్రతి ఒక్కరికీ సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా మరోసారి వెరిఫై చేయడం జరుగుతుందన్నారు. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు చేరవద్దని, తప్పులు ఏమైనా జరిగితే ముందుగానే చెప్పాలని ప్రతి దరఖాస్తును ఎవరు వెరిఫై చేస్తున్నారు వివరాలు పక్కాగా రికార్డులలో ఉంటాయని అనర్హులను అర్హులుగా చూపి ఇండ్లు మంజూరైనట్లు తేలితే కఠినంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జనవరి 26న ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో లాంఛనంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించామన్నారు. సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారు జాగా, ఇల్లు రెండు లేనివారు, ఆర్‌సిసి రూఫ్‌తో ఉన్న వారి వివరాలతో ఎల్1, ఎల్2, ఎల్3 లుగా మూడు జాబితాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విడతల వారీగా ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. అత్యంత పేదలకు ఇండ్లు లేని సొంత స్థలం ఉన్న వారికి మొదటి విడతలో ఇల్లు అందించడం జరుగుతుందన్నారు. భూమి పూజ నుంచి గృహప్రవేశం వరకు ఇంటి నిర్మాణంలో ప్రతి అడుగులో లబ్ధిదారులకు మనం తోడ్పాటునందజేయాలన్నారు. లబ్ధిదారులతో ఇంటరాక్ట్ అవుతూ ప్రతి దశ నిర్మాణంలో సామాగ్రి ధరలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణం ఐదు లక్షలు దాటితే పూర్తి చేయడం లబ్ధిదారులకు కష్టమవుతుందని తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా అవగాహన కల్పించాలన్నారు. ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రతి మండల కేంద్రానికి తీసుకువచ్చే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకుంటుందని మండల కేంద్రం నుంచి లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలన్నారు. మండల కేంద్రంలో పెట్టే ఇసుక డంప్ దుర్వినియోగం కాకుండా చూసుకోవాలన్నారు. సిమెంటు కూడా ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకు సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండ్ చేయాలని రెండు వారాల్లో ఇంటి బేస్‌మెంట్ పూర్తయ్యేలా చూడాలని బేస్‌మెంట్ పూర్తయితే లక్ష రూపాయలు విడుదల అవుతాయన్నారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాస్తామని అది ఎలా కడుతున్నారో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పేదవాని ఇంటి కల సాకారం చేసే అవకాశం మనకు వచ్చిందని దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిపివో ఆశాలత, హౌజింగ్ పిడి శ్రీనివాసరావు, పిఆర్ఈఈ వెంకటరెడ్డి, మండల ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విలేజ్ పోలీసుల నియామకం



**ప్రజాపక్షం/దుగ్గొండి :** మండల పిఎస్ పరిధిలోని అన్ని గ్రామాలకు విలేజ్ పోలీసు ఆఫీసర్లను నియమించినట్లు దుగ్గొండి ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో పివిఒ తన పూర్తి వివరాలు గ్రామస్తులకు అం దు బాటులో ఉండే విధంగా ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ఫ్లెక్సీలు తయారుచేసి దుగ్గొండి సిఐ సాయిరమణ చేతుల మీదు గా చలపర్తి గ్రామంలో పివిఒ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రజలకు పోలీసుల సేవలు అందించడంలో ముందంజలో ఉంటారని, పోలీసులకు ప్రజలకు విలేజ్ పోలీస్ ఆఫీసర్లకు ఎప్పుడూ స్నేహ భావం పెరుగుతుందన్నారు. ప్రజలు పోలీసులకు ఏ సమయంలోనైనా సమాచారం అందించవచ్చన్నారు. పివిఒ అధికారి డయల్ 100, 108 సర్వీస్ లాగా పనిచేస్తారని, అధికారి మొబైల్ నంబరును గ్రామ, గ్రామానికి సంబంధించిన గ్రూపులో యాడ్ చేయాలన్నారు.ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్, గ్రామ పోలీసు అధికారులు వేణుకుమార్, రంజిత్‌కుమార్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉద్యమకారులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/రాయపర్తి:** తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఉద్యమకారుల సంఘం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఎనగందుల శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉద్య మకారుల సంఘం మండల పురం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశా నుసారం, జిల్లా అధ్యక్షులు నందగిరి రజనీకాంత్ సూచనల మేరకు మం డల కేంద్రంలో సబ్ పోస్ట్ ఆఫీస్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ప్రతి ఉద్యమకారుడుని గుర్తించి ప్రతి ఒక్కరికి 250 చదరపు గజముల స్థలం, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కో రారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మందాటి సుదర్శన రెడ్డి, సుద గాని వెంకటేశ్వర్లు, ఎండి నయీమ్, నాగండ్ల భాస్కర్, ఊడుగుల వెంకన్న, మంద యాకూబ్ రెడ్డి, మునావత్ సేవిలాల్, మునా వతి లక్ష్మణ్ తేజావత్ సంతోష్, రావు రాజిరెడ్డి, చిలుముల్ల యాకయ్య పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

### వాజేడు ఎస్ఐ రాజ్ కుమార్



**ప్రజాపక్షం/వాజేడు:** మండలంలో ఎవరైనా గంజాయి విక్రయించిన, గంజాయి సేవించిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని వాజేడు ఎస్సై రా జ్ కుమార్ అన్నారు. ములుగు జిల్లా ఎస్పి డాక్టర్ శబరేష్, ఏటూరు నాగా రం ఎస్పీ, శివం ఉపా ధ్యాయ ఆదేశాల మేరకు వాజేడు మండలంలో వెం కటాపురం సిఐ బండారు కుమార్ ఆధ్వర్యంలో వాజేడు ఎస్సై రాజ్ కు మార్, సిఆర్పిఎఫ్ సిబ్బందితో కలిసి చెరుకూరు గ్రామంలోని అన్ని కిరాణా షాపులు, పరిసరాలు, ఛత్తీస్గడ్ రాష్ట్రం నుండి వచ్చిపోయే వాహనాలను నార్కోటిక్స్ స్నిపర్ డాగ్ టీం తో క్షుణ్ణంగా శుక్రవారం తనిఖీలు చేశారు. గంజాయి కి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని, యువత తమ భవిష్యత్తును విద్యార్థులే తీర్చేదిద్దుకోవాలని అన్నారు.

## యాసంగికి సాగునీరు అందించాలి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రైతులకు గోదావరి నీటిని విడుదల చేసి యాసంగి పంటకు సాగు నీటిని అందించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిసాయన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చొప్పరి సోమన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతుసంఘం రెండవ మహాసభ ముప్పిడి ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించగా వారు హాజరై మాట్లా డుతూ కేంద్రంలో ఉన్న బిజెపి పభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవే ర్చడంలో విఫలమైందన్నారు. మేకలగట్టు, ఖిలాషాపురం పటేల్ చెరువులో నీరు లేక, బోర్లలో సైతం నీరు లేక రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నా యన్నారు. వెంటనే గోదావరి జలాలు విడుదల చేసి మండలంలోని చెరువు లకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం రైతు సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా ఇటుకాల హనుమాజీ, మండల అధ్యక్షునిగా ము ప్పిడి ఎల్లయ్య, మండల కార్యదర్శిగా సాధన అశోక్‌ను ఎన్నుకోగా మొత్తం 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటుచేయడం జరి గింది. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకుడు కావటి యాదగిరి, నాయకులు కంబాల వెంకన్న, రామగుండం దశరథ, సాదం అశోక్, ముప్పిడి ఎల్లయ్య, సురుగు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగడి భూమిని కాపాడాలని వినతి



**ప్రజాపక్షం/హసన్ పర్తి:** గ్రేటర్ వరంగల్ మున్సి పల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రా మంలోని సర్వే నెం.316 లో4.15 ఎకరాల భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, ఆర్డిఒ, హసన్‌పర్తి డిప్యూటీ తహసీల్దార్‌లకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే దాది సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఎల్లా పూర్ గ్రామ అభివృద్ధి కోసం దాతలు 4.15 ఎకరాల భూమిని 60 సంవత్సరాల క్రితం గ్రామానికి గిఫ్టుగా ఇచ్చారు. దాది సామాజిక వర్గానికి చెందిన వారి వారసులు గ్రామానికి గిఫ్టుగా ఇచ్చిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకొని పట్టా చేసుకొని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారు. గిఫ్ట్‌గా ఇచ్చిన భూమినివారి వారసులు ఎలా తిరిగి స్వాధీనం చేసుకుంటారని వారి వారసుల పట్టాపాసు బుక్కులు రద్దు చేయాలని శుక్రవారంపై అధికారులకు గ్రామస్తులు వినపత్రం అందజేశారు. అధికా రులు స్పందించని ఎడల నేషనల్ హైవే పై గ్రామస్తులు అందరూ ధర్నా చేయనున్నట్లు 65వ డివిజన్ కార్పొరేటర్ దివ్యరాజు నాయక్ తదితరులు అధికారులనుహెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్, సిపిఐ, బిఆర్ఎస్ , బిజెపి పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భద్రకాళి చెరువు మట్టిని రైతులు సద్వినియోగం

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య





**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** భద్రకాళి చెరువు పూ డికతీత మట్టిని ఇటుక బట్టీల యజమానులు ఇటుకల తయారీకి, పొలాలను సారవంతం చేసుకునేందుకు రైతు లు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తర లింపు, తదితర అంశాలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అ శ్విని తానాజీ వాకడే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణిలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. మట్టి నాణ్యత, ఏవైనా సమస్యలు ఎదురవు తున్నాయా అనే వివరాలను సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సాగునీటి పారుదలశాఖ ఈఈ శంకర్ మాట్లాడుతూ భద్రకాళీ చెరువు పూడికతీత మట్టి లో ఇప్పటివరకు నాలుగు లక్షల 60 వేల క్యూబిక్ మీట ర్లను తీసుకెళ్లేందుకుదరఖాస్తులను తీసుకెళ్లారని. మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ భద్ర కాళి చెరువు పూడికతీత మట్టిని తరలించేందుకు రూట్ సర్వేను రేపటి కల్లా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో హనుమ కొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా పిఒఅజిత్‌రెడ్డి, ట్రా ఫిక్ ఎసిపి సత్యనారాయణ, హనుమకొండ తహసిల్దార్ శ్రీపాల్ రెడ్డి, సిఐ సీతా రెడ్డి, మున్సిపల్ డీఈ సంతోష్, మైనింగ్, రవాణా, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

### వి-హబ్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

మహిళా సాధికారత దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రణాళికతో ఏర్పాటు చేయా లని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫ రెన్స్ హాల్ లో డీఆర్డీఏ, వి హబ్ అధికారులతో దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న పరకాల స్కిల్ డెవ లప్మెంట్ సెంటర్, మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు కలెక్టర్ సమీక్షించారు. ఉదయం ల్యాదెల్లలో ఏర్పాటు చే యనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను విహబ్ (ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్‌హబ్) ప్రతినిధులు, ఇతర అధికా రు లు సందర్శించారు. జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ నైపుణ్య అభివృద్ధికి, ఉత్పత్తి తయారీకి సంబంధించి వార్షిక ప్రణా ళికను సమన్వయంతో రూపొందించ చా లని, నైపుణ్యాభివృద్ధి శిక్ష ణకు అభ్యర్థుల ఎంపికను పూర్తిచేయాలన్నారు. డిఆర్‌డిఎ, విహబ్ ఆధ్వర్యంలో ల్యాదెల్లలో నైపుణ్యాభివృద్ధి, మాన్యూఫాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ నైపుణ్యఅభివృద్ధి కేం ద్రం లో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ తయారీ, ఫుడ్ ప్రా సెసింగ్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, మగ్గంవర్క్స్, బ్యూ టీ పార్లర్ మేనేజ్మెంట్, తదితర అం శాల్లో శిక్షణ ఇవ్వ నున్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, వి హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ సజ్జ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు సం బం ధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కన్వరెన్స్ హాలులో వచ్చేనెల (మార్చి) 5వతేదీ నుండి ప్రారంభమవుతున్న ఇంటర్మీడి యట్ వార్షిక పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహ ణలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ, పాఠశాల విద్య, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, పోస్టల్, ఆర్టీసీ, ఎన్పీడీసీ ఎల్, తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ మార్చ్ 5వ తేదీ నుండి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ఎక్కడా కూడా ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు పరీక్ష కేంద్రాలు ఉన్న ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవసరమైన వారికి వైద్య సేవలను అందించే విధంగా ఏఎన్ఎంలు, ఆశాలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఈవో వాసంతి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఎసిపి దేవేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రబీకి అవసరమైన నీటి సరఫరాకు చర్యలు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి**

రబీ పంటకు అవసరమైన నీటి సరఫరా కోసం తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవ సాయ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవా రం ఐడిఒసి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులతో రబీలో సాగునీటి సౌక ర్యంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రబీ పంటకు అవసరమైన నీటి సరఫరా కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పం టలకు సమృద్ధిగా సమయానికి సాగు నీరు అందించేం దుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదే శిం చారు. ఆయా ప్రాంతాల్లో నీటి పరిస్థితి, కాలువల ద్వారా నీటి సరఫరా, భూగర్భ జలాల స్థితిగతులు మొదలైన అం శాలను అధికారులు పరిగణలోకి తీసుకుంటూ పంటలు ఎండిపోకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. గత సంవత్సరం నీరందక పంటలు ఎండిపోయిన ప్రా ంతాలను, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను గుర్తించి ప్రత్యా మ్నాయ ఏర్పాట్లుపై రైతులకు అవగా హన కల్పించాలని, అందుబాటులో వనరులను సమర్థ వంతంగా వినియో గించుకోవాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ టీములు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ స్టా కు వివరాలు పరిశీలించాలని ఆదేశించారు. రైతులకు ఎ లాంటి జాప్యం లేకుండా యూరియా సరఫరా చేయాల ని తెలిపారు. ఆధార్ నమోదుతో మా త్రమే యూరియా ఇవ్వాలని తెలిపారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే పిడి యాక్టు నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్య క్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఇరిగేషన్ ఈఈలు బసవ ప్రసాద్, యాదగిరి, తిరుపతి రావు, ఇరిగేషన్ ఏఈలు, వ్యవసాయ శాఖ ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** 27న జరగనున్న ఉమ్మడి మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, గెలుపు కోసం నేతలు పకడ్బందీ వ్యూహంతో ముందుకువెళ్లాలని ఎమ్మెల్సీ ఎన్నికల బోథ్ నియోజకవర్గ ఇంచార్జీ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం బోథ్ పట్ట ణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నియో జకవర్గ స్థాయి పట్ట భద్రుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యో గులను తీ వ్రంగా వంచించిందని, బిఆర్ఎస్, బిజెపి కలిసిపోయి లోపా యికారి ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. యువ త నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు యంగ్ ఇ ండియా స్కిల్ యూనివర్శిటీని నెలకొల్పినట్లు తెలి పారు. పేద, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడె న్షియల్ స్కూల్స్ ను ప్రారంభించి నట్లు ఎమ్మెల్యే తెలి పారు. ఈ ఎన్నిక చాలా కీలకమైనదని, ప్రతి ఒక్కరూ చాలెంజ్‌గా తీసుకొని సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టేలా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ ఉన్నారు.

## బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వినతి

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతి పత్రం సమర్పించారు. కేయూ బోధ నేతర కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల జాక్ నాయకులు. శుక్రవారం హైదరాబాద్ లోని విద్యా కమిషన్ కార్యాల యంలోని ఆయన ఛాంబర్ లో చైర్మన్,సభ్యులను కలిసి వినతి పత్రం అందించి కాకతీయ విశ్వవిద్యాలయ బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగు లను క్రమబద్ధీకరించాలని కొన్ని సంవత్సరాల నుండి పని చేస్తూ రెగ్యులరైజ్ కాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ముఖ్యమంత్రి, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరగా చైర్మన్ సానుకూలంగా స్పం దించినట్లు సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జాక్ నాయ కులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, నాగుల శివప్రసాద్,రాయికంటి సురేష్ కుమార్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, కొడవటిగంటి దయా కర్,సంగాల రాజమౌళి,డాక్టర్ ఆకునూరి సూదయ్య పాల్గొన్నారు.

## పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

### ములుగు ఎస్పి శబరీష్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** పంట పొలాల చుట్టు విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని ములుగు ఎస్పి శబరీష్ హెచ్చరించారు. ములుగు ఎస్పి సమక్షంలో ములుగు డిఎస్పి, సిఐ, ఎస్ఐ ద్వారా విద్యుత్ తీగలు అమర్చడం వ లన కలిగే ప్రమాదాలు, ఈ లాంటి కేసులలో నేర స్థులు చట్టపరంగా ఎదుర్కొనే శిక్షల గురించి, నే రాలు చేసే వారి గురించి ముందస్తు సమాచారం ఇచ్చిన వారికి రూ.5వేల నగదు బహుమతి ప్రో త్సాహం అందిస్తామని పోస్టర్‌ను విడుదల చేశా రు. ఈ పోస్టర్లను ములుగు మండలంలోని అన్ని మండల, గ్రామ ప్రజా కూడలిలో పోలీస్ అధికారు లు అంటించారు. మండలం వారీగా ఆటోల సహా యంతో మైక్ ద్వారా కూడా వాయిస్ రూపంలో ప్రజలలో అవగాహన పెంపొందించినట్లు తెలి పారు. ఇటీవల ములుగు జిల్లాలో కొంత మంది రైతులు, వేటగాళ్లు వన్యప్రాణుల కోసం అమ ర్చిన కరెంట్ తీగల వలన ములుగు మండలం అబ్బాపూర్ గ్రామ సమీపంలోని మొక్కజొన్న తోట వద్ద ఒక మహిళా మరణించగా, మంగపేట మ ండలం పాలయిగూడెం గ్రామ సమీప అటవీ ప్రా ంతంలో ఒక మగ వ్యక్తి గాయాలపాలయ్యాడు. దీనిపై స్పందించిన ములుగు ఎస్పి డాక్టర్ శబ రీష్ జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరా వృతం కాకుండా మరే ఇతర ప్రజల ప్రాణాలకు హానికల్గకుండా ములుగు జిల్లాలో వన్య ప్రాణుల వేట కోసం కరెంట్ తీగలు అమర్చుతున్న వారిని గ్రామాల వారిగా గుర్తించి వారిపై జిల్లా పోలీస్ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేయ డం జరిగింది. ఈ ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన రావడం జరిగింది. అబ్బాపూర్‌లో విద్యుత్ తీగలు అమర్చిన వారిపై ములుగు ఎస్ఐ ఆధ్వర్యంలో కేసులు నమోదు చేసినట్లు తెలి పారు. ఈ సందర్భంగా డిఎస్పి ఎన్ రవీందర్, సిఐ శంకర్, ఎస్ఐ ములుగు ఎస్ఐ వెంకటేశ్వర రావును ఎస్పి అభినందించారు. ఈ విధంగా తీ గలు అమర్చినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పి హెచ్చరించారు.

## పారదర్శకంగా ఎంఎల్‌సి ఎన్నికలు : జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నిక లలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారద ర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల విధులకు నియమించిన పిఒ, ఎపిఒ, సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎం ఎల్‌సి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సం ఘం జారీ చేసిన పిఒ హ్యాండ్ బుక్‌ను బాగా చదవాలని చెప్పారు. పిఒ, ఏపిఒ, మైక్రో అబ్జర్వర్లు వారికి కేటాయించిన విధుల ప్రకారం పోలింగ్ నిర్వహించాల న్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం వంటి అన్ని అంశాల పట్ల పూర్తి జాగ్ర త్తలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రం పరిధిలో శాంతి భద్రతలు, అలాగే పోలింగ్ కేంద్రంలోకి అనుమ తించబడే వారి వివరాలు అన్నింటి పట్ల పిఒ, ఎపిఒలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికలలో ఫా రం 16 అత్యంత కీలకమన్నారు.స్టాట్యూరీ నాన్ స్టాచ్యు టరీ కవర్లు వీటన్నిటి పట్ల అవగాహన కలిగి ఉండా లని, నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించబద్దని పూర్తి జాగ్ర త్తగా,అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను విజయవంతం గా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, ములుగు తహసీల్దారు విజయభా స్కర్, పర్యవేక్షకులు సలీమ్, శివకుమార్ ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

### ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

### జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్ని కల కోసం అన్ని ఏర్పా ట్లు పకడ్బ ందీగా చేయాలని రాష్ట్ర ప్ర ధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఐడిఓసి కార్యా లయం నుండి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. మెదక్ నిజామాబాద్‌ఆది లాబా ద్, కరీం నగర్ పట్టభద్రుల నియోజకవర్గం, వరంగల్‌ఖమ్మంన ల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సం బంధిం చిన ఏర్పాట్లుపై అన్ని ఆయా జిల్లాల జిల్లా ఎన్ని కల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రి బ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలి పారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్ని కల అధికారి, జిల్లా కలెక్టర్ రా హుల్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ స్లిప్పులు పంపిణీ 90 శాతం జరిగిందని, శనివారం వర కు మిగిలిన 10 శాతం పూర్తి చేస్తా మని తెలిపారు. భూ పాలపల్లి 7, కా టారం డివిజన్లలో 10పోలింగ్ కేంద్రాలు ఏర్పా టు చేశామని, 76 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐడిఓసి కార్యాల యంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఓటరు ఫలిసి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావే శంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

## విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి

### ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** పదవ తరగతి, ఇంటర్ మీడియట్ విదార్థులు పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యా యులు కృషి చేయాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. జిల్లాలోని అన్నిసంక్షేమ వసతి గృహాల నిర్వహణ కోసం మండలాలెకల ప్రత్యేక అధికారులు మూ డు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. రాన్నున్న పదవ తరగతి, ఇంటర్మీ డియట్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని అన్ని సం క్షేమ వసతి గృహాల్లో వచ్చే మూడు రోజులు జిల్లా లోని సీనియర్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని శుక్ర వారం కలెక్టర్ ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యం, శానిటేషన్,అందుకు అనుగుణంగా సంక్షేమ హాస్టళ్ళపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తహ సీల్దార్లు ఎంపిడిఒల సమ న్వయంతో వసతి గృహా లను విస్తృతంగా సందర్శించి రోజువారీ నివేదిక లను అందజేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధవహించాలని, పదవ తరగతి పరీక్షల దృష్ట్యా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు నూరు శాతం హాజరు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు ఏదైనా సబ్జ క్ట్‌లో వెనుకబడి ఉంటే వారిని గుర్తించి నిపుణు లతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఇప్పటికే సూచించిన ప్రణాళిక ప్రకారం ప్రత్యేక అధికారులు వసతి గృహాల సందర్శన, తనికీలు చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా శిరీష



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చెందిన రామారావు శిరీష రెండవసారి నర్సంపేట నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ మహి ళా అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. రామారావు శిరీ ష ఇది రెండవ సారి బ్లాక్ కాంగ్రెస్ మహిళ అధ్య క్షురాలు ఎంపిక ఇవ్వడం, శిరీష నాయకత్వం గుర్తించిన శాసన సభ్యుడు దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో రెండవసారి ఎంపికైనట్లు రాష్ట్ర మహి ళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు అన్నారు. నియామక పత్రాన్ని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అక్షరాలు శిరీష కు అందించారు.జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పర్వతమ్మ, నియో జకవర్గంలోని అన్ని మండలాల మహిళ కాంగ్రెస్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## సమర్థవంతంగా స్థానిక ఎన్నికలు

### అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్





**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** రాబోయే స్థా నిక సంస్థల ఎన్నికలైన గ్రామ పంచాయతీ, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎ న్నికలు సమర్థవంతం గా నిర్వయించాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదర్శ ఎన్నికల నియమావలి మోడ ల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచిస్తూ నోడల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్య క్రమం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వ యించారు. అదనపు కలెక్టర్ పింకే ష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణలో భాగంగా నామినేషన్లు, పో లింగ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ విధులపై శిక్షణ పొందాలన్నారు. నామినే షన్ల ప్రక్రియ మొదలు కొని ఓట్ల లెక్కింపు వరకు అంత్యం జాగ్రత్తగా వ్యవహ రించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నిర్వాహణలో అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామ పంచాయితీ, ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, సమయానుగుణంగా ప్రతి అధికారి పూర్తి నిబద్ధతలో పనిచేయాలన్నారు. ఎన్నికల నిర్వాహణపై పూర్తి అవగాహన కలిగి, వాటిని ఖచ్చితంగా అనుసరిం చాలన్నారు. ఎంపిటిసి ఎన్నికలకు సంబందించి ఆర్‌ఓలు 55 మంది,ఏఆర్ ఓలు 55 ఎంపిడిఓలు, ఎంపిఓలు ఈ ఎన్నికలు హాజరయ్యారు. ఈ సమావే శంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సుహాసిని, జడ్‌పి సీఈఓ మాధురీషా, డిప్యూటి సీఈఓ సరిత, డిపిఓ స్వరూప, నోడల్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, రిట ర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఫోకస్ సైన్స్

## గుట్టువిప్పుతున్న వెబ్ టెలిస్కోప్


మన పాలపుంత గెలాక్సీ మధ్యలో ఉన్న సూపర్ మాసివ్ బ్లాక్ హోల్ చుట్టూ జరుగుతున్న అస్తవ్యస్తమైన సంఘటనల గురించి అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ప్రయోగించిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ అరుదైన సమాచారాన్ని అందిస్తూ, వాటి రహస్యాల గుట్టువిప్పుతువన్నది. 2021లో నాసా ప్రయోగించిన అత్యంత శక్తివంతమైన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ 2022 నుంచి డేటాను సేకరించడం ప్రారంభించింది. మన పాలపుంతలోని ధనస్సు ఎ* లేదా ఎస్‌జిఆర్ ఎ*గా పేర్కొనే కాలరంధ్రం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని ఎక్కువ కాలంపాటు మొదటిసారి చూసే అవకాశం శాస్త్రవేత్తలకు లభించింది. అత్యంత ప్రకాశవంతమైన మంటల కారణంగా, విరామ కాంతితో స్థిరంగా, మిణుకుమిణుకుమనే కాంతిని గమనిస్తూ, ఈ బ్లాక్‌హోల్ తన అపారమైన గురుత్వాకర్షణ శక్తిద్వారా పదార్థాలను లోపలికి లాగేసుకుంటుందని ఇల్లినాయిస్‌లోని నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ బ్లాక్‌హోల్ చుట్టూ చుట్టూ తిరుగుతున్న గ్యాస్ డిస్క్ నుండి నిరంతరం కాంతి వెలువవడాన్ని పరిశోధకులు గమనించారు దీనిని 'అక్రెషన్ డిస్క్' అని పిలుస్తారు. ఈవెంట్ హోరిజోన్‌కు చాలా దగ్గరగా ఉన్న పదార్థం నుండి ఈ వెలుగు వెలువడుతున్నట్లు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. నక్షత్రాలు, గ్రహాలు, వాయువు, ధూళిసహా అన్ని రకాల పదార్థాలను బ్లాక్‌హోల్స్ ఎస్‌జిఆర్ ఎ* బ్లాక్ హోల్ ఆకర్షిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. కేవలం పదార్థాలు, ఇతరత్రా ఖగోళ వస్తువులేకాదు... కాంతి కూడా ఈ కాలరంధ్రం నుంచి తప్పించుకోలేక పోతున్నదని వారి అధ్యయనం స్పష్టం చేసింది. ఈ ఎస్‌జిఆర్ ఎ* ద్రవ్యరాశి మన సూర్యుడి ద్రవ్యరాశి కంటే దాదాపు 4 మిలియన్ రెట్లు ఎక్కువ. ఇది భూమి నుండి దాదాపు 26,000 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. ఒక కాంతి సంవత్సరం అంటే కాంతి ఒక సంవత్సరంలో ప్రయాణించే దూరం, అంటే 5.9 ట్రిలియన్ మైళ్ళు (9.5 ట్రిలియన్ కిమీ).

# సూపర్ బ్లాక్‌హోల్



## పురాతన రాతప్రతిలో తేనెటీగ మెదడు బొమ్మ

అధునాతన పరికరాలుగానీ, పరిశోధనా సామాగ్రిగానీ లేని కాలంలో, ఒక శాస్త్రవేత్త తేనెటీగ స్కెచ్‌ని, దాని మెదడులోని భాగాలను వివరిస్తూ బొమ్మగీయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. 1670 దశకాల్లో డచ్ జీవశాస్త్రవేత్త, మైక్రోస్కోపిస్ట్ జొహాన్నెస్ స్వామెర్‌డామ్ తాను చేసినప్రయోగాలు, డిసెక్షన్ల వివరాలను పుస్తకంలో రాసి, భద్రపరిచాడు. ఈ మ్యాన్‌స్క్రిప్ట్‌లోనే తేనెటీగ డ్రోన్ మెదడు మొక్క వివరణ్మాక వర్ణన ఉంది. ఇటలీలోని ట్యూరిన్ విశ్వవిద్యాలయానికి చెందిన సైన్స్ చరిత్రకారిణి ఆండ్రియా స్ట్రాజోని ఇటీవల రాయల్ సొసైటీ నోట్స్ అండ్ రికార్డ్స్‌లో స్వామెర్‌డామ్ చిత్రాన్ని ప్రస్తావించింది. ఆమె తెలిపిన వివరాలను అనుసరించి స్వామెర్‌డామ్ తేనెటీగ డ్రోన్ మెదడు భాగాలను చాలా వరకు గుర్తించగలిగాడు. 1658లో ఎర్ర రక్తకణాలను చూసి, వర్ణించిన మొదటి వ్యక్తిగా స్వామెర్‌డామ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతాడు. మనిషి, జంతువుల మెదళ్లను పరిశీలించిన అనుభవం ఉండడంతో, అతను తేనెటీగ మెదడును కూడా అధ్యయనం చేసి, వివరాలను డ్రాయింగ్ రూపంలో భద్రపరిచాడు. జంతువుల్లో మాదిరిగా తేనెటీగ మెదడులోనూ పీనియర్ గ్రంథి, చిన్నమెదడు ఉంటాయని స్వామెర్‌డామ్ ఊహించాడు. నిజానికి తేనెటీగకు అవి లేవు. అయితే, సుమారు 350 సంవత్సరాల క్రితం ఇంతటి ప్రయత్నం చేయడాన్ని మెచ్చుకొనితీరాలి.



## 'మమ్మీ'ల వాసన ఏమిటి?

ఈజిప్టు 'మమ్మీ'ల గురించి అంతదరికీ తెలిసే ఉంటుంది. వేలాది సంవత్సరాల పూర్వమే, శవాలను మమ్మీఫికేషన్ ప్రక్రియద్వారా భద్రత పరిచారు. పిరమిడ్ల నిర్మాణం, మమ్మీఫికేషన్ ఇప్పటికీ అధునాతన సాంకేతికకు సవాళ్లు విసురుతున్నాయి. మమ్మిఫికేషన్ గురించిన కొన్ని సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. అయితే, ఈ మమ్మీల నుంచి వచ్చే వాసనపై చాలాకాలంగా చర్చ ఉంది. ఇటీవల ఈ సస్పెన్స్‌కు పరిశోధకులు తెరదించారు. ఈజిప్షియన్ మమ్మీలు 'చెక్క', 'కారం', 'తీపి' వాసునతో ఉంటాయని ఇటీవల జరిపిన ఒక ప్రత్యేకమైన అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకులు ప్రకటించారు. మమ్మీఫికేషన్ చేసిన తొమ్మిది శరీరాల వాసనపై ఈ పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇందుకు కోసం వారు అత్యాధునిక శిక్షణ పొంది, 'మానవ స్నిఫర్'లుగా మారారు. అనంతరం వీరు మమ్మీల వాసనను గుర్తించారు. సుమారు 5000 సంవత్సరాల క్రితం మమ్మీఫికేషన్ చేసిన శవాలు ఇప్పటికీ భద్రంగా ఉండడానికి వాడిన రసాయనాల విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో, వాసనను బట్టి, రసాయనాల గురించి అంచనా వేయడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. మమ్మీఫైడ్ శరీరాల వాసన సంవత్సరాలుగా నిపుణులు, సాధారణ ప్రజల నుండి గణనీయమైన ఆసక్తిని ఆకర్షించిందనీ, కానీ ఇప్పటివరకు మిశ్రమ రసాయన, గ్రహణ శాస్త్రీయ అధ్యయనం జరగలేదని శాస్త్రవేత్తలు అంటున్నారు. కొత్తగా కనుగొన్న 'వాసన' ద్వారా రసాయనాల గురించిన పరిశోధన కొనసాగే అవకాశం ఉంది.




## మొక్కల గాయాలకు 'బ్యాండ్‌ఎయిడ్'!



మొక్కలకూ ప్రాణం ఉంటుందని మనకు తెలుసు. వాటికి గాయాలవుతాయనిగానీ, ఆ గాయాలు బాధిస్తాయనిగానీ ఆలోచించేవారు చాలా తక్కువ. ఇక ఆ గాయాలను నయం చేయడానికి బ్యాండ్‌ఎయిడ్ వాడడాన్ని ఎవరూ ఊహించరు. అయితే, బ్యాండ్‌ఎయిడ్‌తో మొక్కల గాయాలను నయం చేయవచ్చని బార్సిలోనాలోని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ అగ్రికల్చర్ జెనోమిక్స్ (సిఎఫ్‌ఆర్‌ఐఎజె) శాస్త్రవేత్తలు అంటున్నారు. ఒక మొక్క కోతకు గురైనప్పుడు, బాక్టీరియా సెల్యూలోజ్ ప్యాచ్‌తో దానికి చికిత్స చేయవచ్చన్నది వారి వాదన. 'సైన్స్ అడ్వాన్సెస్'లో ప్రచురింతమైన పరిశోధనా పత్రాన్ని అనుసరించి, పాచెస్ ప్రభావాన్ని పరీక్షించడానికి, శాస్త్రవేత్తలు రెండు సాధారణ ప్రయోగశాల మొక్కలైన నికోటియానా బెంథామియానా, అరబిడోప్సిస్ థాలియానా ఆకులలో చిన్న కోతలు చేసి , సగం గాయాలకు బ్యాండఎయిడ్స్ ను ప్రయోగించారు. ఒక వారం తర్వాత, చికిత్స అందిన మొక్క 80 శాతం కంటే ఎక్కువ భాగం గాయం లేదా కోత నయమైంది. చికిత్స చేయని మొక్కల్లో 20 శాతం మాత్రమే సహజంగా నయమైంది. చికిత్స జరిపిన తర్వాత గాయాల్లోని కణజాలాలు ఆరోగ్యంగా కనిపించాయి. చికిత్స చేయని గాయాలు బాధ, నిర్జలీకరణ సంకేతాలను ప్రదర్శించాయి. అంతేగాక, గాయం నమయైన వెంటనే ఆ మొక్క వేగంగా పెరగడం కనిపించింది. మిగతా రెండు మొక్కలో ఎలాంటి ఎదుగదల లేదు. బ్యాక్టీరియా సెల్యులోజ్ ప్యాచ్ లేదా బ్యాండ్‌ఎయిడ్ ద్వారా మొక్కలకు చికిత్స అరుదేగానీ, అసాధ్యం కాదని ఈ అధ్యయనం పేర్కొంది. జంతువుల మాదిరి మొక్కలు ప్రమాదాల నుంచి తప్పించుకోలేవు. ఒకవేళ కోతకు గురైనా, ఎవరైనా పూర్తిగా తుంపేసినా లేదా పెకలించినా, మళ్లీ చిగురించడానికి అవి పునరుత్పత్తి సామర్థ్యాలపైనే ఆధారపడతాయి. అయితే, మొక్కల గాయాలకు నయం చేయడం ద్వారా, వాటి పెరుగుదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయవచ్చన్నది తాజా పరిశోధనల సారాంశం. ఇలాంటి ప్రయోగాలు భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి ఎంతగానో ఉపయోగపడతానయడంలో అనుమానం లేదు.

## భయపెడుతున్న 'లావా బాంబులు'



అగ్ని పర్వతాలు పేలినప్పుడు ఉద్భవించే లావా సృష్టించే విధ్వంసంపై ఎంతోకొంత అవగాహన ప్రజలకు ఉంది. అందుకే అగ్నిపర్వతాలకు దూరంగా, ప్రత్యేకించి, లావా ప్రవహించని ప్రాంతాలను నివాసం కోసం ఎంపిక చేసుకుంటారు. అయితే, ఇటీవల కాలంలో 'లావా బాంబులు' ఎగసిపడుతున్న సందర్భాలు పెరగడం, సమీప ప్రాంతాల్లోని ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నది. హవాయ్ ద్వీపాల్లోని మౌనా లోవా ప్రాంతం తరచు వీటిని చూడవచ్చు. లావా బాంబులు అనేవి ఒక రకమైన శిధిలాలు. అగ్నిపర్వత విస్ఫోటనాల వల్ల గాలిలోకి వెదజల్లబడే లావా కొన్ని సందర్భాల్లో గట్టిపడి, దూర ప్రాంతాల్లో పడుతుంది. బూడి, స్పటికాలు, రాయి, ఇతర శకలాల మిశ్రమంతో ఏర్పడిన ఈ లావా గోళాలు ప్రమాదం సృష్టించకపోయినా, ఒకవేళ జనావాసాలపై పడితే మాత్రం సమస్యలు తప్పవు. భూమి లోపలి నుండి కరిగిన శిలాద్రవంగా ఇవి ప్రారంభమవుతాయి. శిలాద్రవం అగ్నిపర్వతం నుండి బయటకు వచ్చినప్పుడు, లావాగా మారి చల్లబడుతుంది. లావాలో కొంత భాగం గోళాల రూపంలో దూరంగా వెదజల్లబడతాయి. ఇవి కనీసం 6.4 సెంటీమీటర్లు (2.5 అంగుళాలు) వెడల్పుతో గుండ్రంగా ఉంటాయి. వీటికి పదునైన కోణాలు లేనంత వరకు. లావా బాంబులు ఎక్కువగా బాస్కెట్‌బాల్‌ల మాదిరిగా గుండ్రంగా లేదా ఫుట్‌బాల్‌ల మాదిరిగా పొడవుగా ఉంటాయి. కొన్నిసార్లు లావా తీగలు విస్తరించి రిబ్బన్ ఆకారపు లావా బాంబులు ఏర్పడతాయి. కొన్ని సందర్భాల్లో ఈ లావాబాంబులు పెద్దవిగా కూడా ఉండవచ్చు.. ఇప్పటివరకు కనిపించిన అతిపెద్ద లావాబాంబు వెడల్పు 6 మీటర్లు (20 అడుగులు). ఇవి ల్యాండింగ్‌కు ముందు గాలిలో 10 సెకన్ల వరకు ఎగురుతాయి. లావా వాతావరణం యొక్క చల్లని గాలిని ఎదుర్కొన్నప్పుడు, అది చల్లబడి బయటి నుండి గట్టిపడుతుంది. చిన్న లావా బాంబులు ల్యాండింగ్‌కు ముందు పూర్తిగా చల్లబడతాయి. పెద్దవి బయట మాత్రమే గట్టిపడతాయి. ఇవి సాధారణంగా, విస్ఫోటనం జరిగిన 5 కిలోమీటర్ల (3 మైళ్ళు) దూరంలోనే ల్యాండ అవుతాయి. కానీ కొన్ని 10 కిలోమీటర్ల (6మైళ్ళు) వరకు ప్రయాణిస్తాయి. అగ్నిపర్వత విస్ఫోటనం వల్ల కలిగే అన్ని ముప్పులలో, లావాబాంబులు అత్యంత ప్రమాదకరమైనవని పరిశోధకులు అంచనా వేస్తున్నారు.

## 25న వరంగల్ నగరంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాలు

### పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** వందేళ్ళ ఘనమైన చరిత్ర కలిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. ఈ నెల 25న సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జరిగే వరంగల్ నగరంలోని అబ్బునస్ ఫంక్షన్ హాల్‌ను తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ హాజరవుతారని తెలిపారు. జిల్లాలో పల్లెపల్లెన సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జరపాలని పార్టీ శ్రేణులను కోరారు. అందులో భాగంగా ఈనెల 25న అబ్బునస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి శతాబ్ది ఉత్సవాలు వరంగల్ నగరంలో జరుగుతుందని అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యులు పంజల రమేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ భాషమియా, పనాస ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, బుస్స రవిందర్, సంఘి ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టియు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

### సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** ఎస్‌టియు టిఎస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు రఘూత్తంరెడ్డి, నరేందర్‌రెడ్డిలను గెలిపించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకేంద్రలోని ఎస్‌టియు భవన్‌లో జరిగిన సమావేశంలో పర్వతరెడ్డి మాట్లాడారు. ఎస్‌టియు బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘూత్తంరెడ్డి 30 సంవత్సరాలపాటు ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాధికారిగా, 6 సంవత్సరాలపాటు ఎమ్మెల్సీగా పని చేసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. వారిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. అదే విధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పర్వతరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, ప్రధానకార్యదర్శి పోచయ్య, నాయకులు భూపతిగౌడ్, అశోక్, శ్రీనివాస్, అరుణ్ కుమార్, దిలీప్, రత్నాకర్, రతన్, నరేష్, జబ్బార్, సత్యనారాయణ, లింగం తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో వ్యవసాయరంగం

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెకోడు గ్రామంలో ఎఐకెఎస్ (తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం) మూడవ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఎఐకెఎస్ జెండాను రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ ఆవిష్కరించారు. రైతు సంఘం నాయకులు ఏలూరు భాస్కర్, మామిడి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో బాగం మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడి ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రైతుల గోస వర్ణనాతీతంగా మారిందని, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని స్వామినాథం చేసిన సిఫారసులను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులకు రైతు సంక్షేమ పథకాలు ఎటువంటి కొర్రీలు లేకుండా అమలు జరిగాయన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలులో అనేక నిబంధనలు పెట్టి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. సమావేశంలో 21 మందితో రైతు సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడి సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, ఉప్పుగుండ్ల ప్రభాకర్, జంగాల ఉపేందర్, కార్యదర్శిగా ఏలూరి భాస్కర్, సహాయ కార్యదర్శిగా బానోతు సీతారాం, వెన్నం భాస్కర్, శీలంశెట్టి ధనమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాసంగుల చంద్రావు ఎన్నికయ్యారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు, సాగునీరు ప్రాజెక్టులు నిర్మాణం, రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12 వేలు, ఇందిరమ్మ భరోసా అమలు చేయాలని తీర్మానాలను చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బానోతు రాంకోటి, ఎడ్లపల్లి శంకరయ్య, పగిళ్ల వీరభద్రం, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సైదులు, బానోతు రామ్మూర్తి, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మామిడాల కిరణ్, పొన్నగంటి అఖిల్ పాల్గొన్నారు.

## 'సదరం' సర్టిఫికెట్ల అధికారులపై చర్యలేవీ?

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగేందర్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** సదరం సర్టిఫికెట్ల అవకతవకలపై సంబంధించిన ప్రధాన సూత్రధారులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి యుగేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లలో లక్షల రూపాయల కుంభకోణం జరిగిందని, ఫోర్త్‌క్లాస్ ఉద్యోగుల నుంచి అధికారుల వరకు విచారణ జరిపించాలని మొదటి నుంచి ఎఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు. అధికారులందరూ లక్షల రూపాయలను పప్పుబెల్లంలా పంచుకున్నారని, కంచె చేను మేసిందని ప్రశ్నించారు. పాత్రధారులు, సూత్రదారులు అందరూ ఆ శాఖలోనే ఉన్నారని ఆయన ఆరోపించారు. ఒక డిపార్ట్‌మెంట్ వారు తప్పు చేస్తే వేరే డిపార్ట్‌మెంట్ అధికారితో పూర్తిస్థాయిలో పార్శదర్శకంగా విచారణ జరిపిస్తారని, కానీ అందుకు విరుద్ధంగా నామమాత్రంగా విచారణ జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం సదరం క్యాంపు 200 మందికి మాత్రమే స్లాట్ బుకింగ్ విధానం ఉంటుందని, కానీ దానికి భిన్నంగా హుజురాబాద్‌లో సదరం క్యాంపు ఆకస్మికంగా నిర్వహించడంలో ఆంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు. అడిషనల్ డిఆర్డీవో వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిగిన విచారణ కమిటీ గతేడాది జనవరి 2021 జనవరి నుంచి 2022 ఫిబ్రవరి వరకు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించిందని, కానీ హుజురాబాద్‌లో జరిగిన సదరం సర్టిఫికెట్లపై విచారణ ఎందుకు జరగలేదని ఆయన ప్రశ్నించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు లక్షల రూపాయలు వసూలు చేశారని, వారితో పాటుగా సంబంధిత అధికారులు ఉన్నారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి వెనుక ఉన్న సూత్రదారులను బయటకు లాగాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్లలో లక్షల రూపాయలు చేతులు మారాయని, కానీ అధికారులు ఫోర్త్ క్లాస్ ఉద్యోగులను తొలగించి చేతులు దులుపుకున్నారని, సూత్రధారులను సస్పెండ్ చేసే వరకు వదిలేది లేదని ఎఐవైఎఫ్ పోరాడుతుందన్నారు.

## బీడీ కార్మికులకు కనీస పెన్షన్ రూ.5వేలు

### సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, రాములు డిమాండ్



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** బీడీ పరిశ్రమల్లో పనిచేసే బీడీ కార్మికులకు కనీస పెన్షన్ 5000 రూపాయలను వెంటనే అమలు చేయాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.గోవర్ధన్, సుతారి రాములు డిమాండ్ చేశారు. రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఆదిలాబాద్ జిల్లా బోత్ మండల కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజాంబాద్, వరంగల్ జిల్లాల నాయకులు కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ఒక్క పైసా కూడా కేటాయించలేదన్నారు. జిఎస్‌టి మాత్రం కొనుగోళ్లు, అమ్మకాలపై 28 అమలు చేస్తోందన్నారు. మహిళా బీడీ కార్మికులకు కనీస పెన్షన్ పెంపు జరగలేదన్నారు. గతంలో 1000 రూపాయలు మాత్రమే ఇప్పటికీ అమల్లో ఉందన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఆర్థిక శాఖ మంత్రికి బీడీ కార్మికులకు పెన్షన్ రూ.5వేలు పెంచాలని ప్రతిపాదనలు అందిస్తే బడ్జెట్లో ఆ ఊసే లేదన్నారు. ఎన్నికలలో అనేక హామీలు ఇస్తూ బీడీ కార్మికుల ఓట్లు దండుకుని, వారి సమస్యలు పరిష్కరించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా కనీస పెన్షన్ పెంచకపోతే చలో ఢిల్లీ చలో పార్లమెంటు నిర్వహిస్తామని హెచ్చరించారు అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద అర్హులైన నిరుపేద బీడీ కార్మికులకు ఇల్లు కట్టించి ఇవ్వాలని, ఇపిఎఫ్ బోర్డు నుంచి సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు రూ.2016 జీవన భృతిని నాలుగువేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. బీడీ కార్మికులకు కూలీ డబ్బులు బ్యాంకు ఖాతా నుంచి కాకుండా నేరుగా ఇవ్వాలని కోరారు. కరువు భత్యం ఒక పాయింట్ కు పది పైసల నుండి 20 పైసలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎండి.మౌలానా, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, రాష్ట్ర కోశాధికారి ఎండి ముక్రం, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొక్కుల శాంత, కేవీ అనసూయ, గోదావరి, రాష్ట్ర సహాయ కార్యదర్శి అయ్యవార్ల లక్ష్మణ్, అడ్డవేలు ఆరే రంగారెడ్డి, వెన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు

### మిర్చి క్వింటాకు రూ.25వేలు మద్దతు ధర నిర్ణయించాలి

### రైతు సంఘాల డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, మిర్చి క్వింటాకు రూ.25 వేలు మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐక్య రైతు సంఘాల సమావేశం శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గిన నేపథ్యంలో ధర కూడా గణనీయంగా పడిపోయిందన్నారు. కేవలం రూ. 13 వేల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని క్వింటా రూ.25వేల చొప్పు న కొనుగోలు చేయాలన్నారు. మిర్చి బోర్డు ఖమ్మం లో ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 22 నుంచి 26వరకు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయడంతో పాటు భవిష్యత్తు పో రాటాలకు రైతులను సమాయత్తం చేయాలని నిర్ణయించారు. మార్చి 3న కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు దొండపాటి రమేష్, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, బిఆర్‌ఎస్ రైతు సంఘం నాయకులు మంకెన రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలన

### జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్

ప్రజాపక్షం /గొల్లపల్లి : ప్రభుత్వ నిర్దేశించిన ఇండ్ల నమూనా ప్రకారం లబ్దిదారులు ఇల్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల స్థలాలను శుక్రవారం సంబంధిత అధికారులతో కలసి పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయించిన నమూనా ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలని అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ ,హౌసింగ్ డి ఈ ప్రసాద్ ,తహసీల్దార్ వరందన్ ,గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీవో రామ్ రెడ్డి ,ఎంపీ ఓ సురేష్ రెడ్డి ,పంచాయతీరాజ్ ఏఈ కళ్యాణ్ రెడ్డి,ఏ పి ఓ వేణు ,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ,హార్టికల్చర్ అధికారి,నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

ప్రజాపక్షం/వీర్నపల్లి: గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని మద్దిమల్ల, రంగంపేట, వదిర గ్రామాలలో శుక్రవారం ఎక్సైజ్ సిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడులలో 200 లీటర్ల బెల్లం పానకం, అయిదు లీటర్ల గుడుంబా లభ్యం అయినట్లు తెలిపారు. అనుమానితులను మండల ఎంఆర్వో ముందు బైండోవర్ చేశామన్నారు. సిఐ మాట్లాడుతూ నాటుసారా తయారీ చేసినా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ సర్దార్, సిబ్బంది రాజు, మల్లేష్, కిషోర్ వర్మ, రాకేష్, సుమన్, శంకర్‌లు ఉన్నారు.

## ఆరోగ్య పథకాలు సద్వినియోగం



ప్రజాపక్షం/చొప్పదండి: చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సందర్శించి ఉద్యోగుల హాజరు పరిశీలించారు. అంతకుముందు రుక్మాపూర్ గ్రామంలో జరిగిన శుక్రవారం సభ కార్యక్రమానికి హాజరై ప్రస్తుత ప్రభుత్వ ఆరోగ్య పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి మహిళా వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ అరుణ, సిహెచ్ఓ రవినాయక్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులున్నారు.

## కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్న నరేందర్‌రెడ్డికి పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత శ్రీనివాస్‌రెడ్డి, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి మహేందర్, పడితపల్లి కిషన్, కోల ప్రభాకర్, చందు, చిప్ప చక్రపాణి ఉన్నారు.

## నిత్యావసరాలు ప్రభుత్వమే ఇవ్వాలి



ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : మార్కెట్ ధరలకు అనుగుణంగా కోడిగుడ్లు నిత్యవసర వస్తువులు గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే పంపిణీ చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమ్‌పావనీ, గౌరవ అధ్యక్షురాలు కమలరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాక్షులు తోపునూరి చక్రపాణిలతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మ ణ్ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారికి విజ్ఞప్తి కోడిగుడ్లకు ప్రభుత్వం ఐదు రూపాయలు చెల్లిస్తే మార్కెట్‌లో 8 రూ.లకు గుడ్డు దొరుకుతుందని దానిపై మూడు రూ.లు నష్టంతో విద్యార్థులకు అందించలేమన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు లేనందున రెండు కూరలతో భోజనాలు అందించలేమని, నిత్యవసర వస్తువులు గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని మెనూ చార్జీలు ప్రతి విద్యార్థికి 25 రూ.లు చెల్లించాలని కోరారు. వంట కార్మికులను తొలగించకుండా జీవోను విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వంట కార్మికులకు 10వేల వేతనం చెల్లించాలని కోరారు. కార్మికులకు ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా వారిని కోరారు.

## ప్రసన్నహరికృష్ణకు మద్దతుగా సింహగర్జన

ప్రజాపక్షం/కరీంనగర్: మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ బిఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా ఆదివారం కరీంనగర్‌లో పట్టభద్రుల సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాస్, అజయ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసన్న హరికృష్ణకు మద్దతు ప్రకటించిన 53 ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కరీంనగర్‌లోని గీతాభవన్ దగ్గర ఉన్న సర్కస్ గ్రౌండ్‌లో ఈ సభ జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి వేలాదిగా పట్టభద్రులు తరలివచ్చి ప్రసన్న హరికృష్ణకు సంఘీభావం తెలియజేయాలని వారు కోరారు.

# ఎంఎల్‌సి సిట్టింగ్ స్థానం కాంగ్రెస్‌దే

### ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయిద్దాం

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ప్రజాపక్షం/శంకరపట్నం: ఉత్తర తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల్లోనూ అల్ఫోర్స విధ్యాసంస్థలను నెలకొల్పి 5 వేలమందినిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను వూట్కూరి నరేందర్‌రెడ్డి కల్పించారని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శంకరపట్నం మండలం కేశవపట్నంలోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధిగా సత్యనారాయణ మాట్లాడుతూప్రతిపక్షంలో ఉన్నప్పుడు పట్టభద్రుల స్థానాన్ని కాంగ్రెస్ అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని గెలిపించుకున్నామన్నారు. ఈ సిట్టింగ్ స్థానాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పట్టభద్రులకు అవగాహన కల్పించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించాలని సూచించారు. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత లేదని, కెసిఆర్ కుటుంబంపైనే ప్రజల్లో వ్యతిరేకత ఉందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోన అందించామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. వైద్య వృత్తిని వదిలేని 17 ఏళ్లు పోరాటం చేసి ఎమ్మెల్యే అయ్యానని, తనకు ఇతర పదవులపై వ్యామోహం లేదని స్పష్టం చేశారు. మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌కు రాష్ట్రస్థాయిలో సముచిత స్థానం కల్పించేందుకు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిపై సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని శంకరపట్నం మండలం నుంచి సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు తిప్పికొట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరిగిందని, గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. ఈ ఎన్నికల ప్రభావం రానున్న స్థానిక సంస్థలపై పడుతుందని గ్రహించాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కవ్వ పద్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తనకు ప్రభాకర్, కాంగ్రెస్‌మహిళా అధ్యక్షురాలు చింతరెడ్డి పద్మ, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులుపాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి

ప్రజాపక్షం/బెజ్జంకి: కాంగ్రెస్ పార్టీతోనే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందని మెదక్,ఆదిలాబాద్,నిజామాబాద్,కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వూట్కూరి నరేందర్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలని మానకొండూర్ ఎంఎల్‌ఏ డా. కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు.శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఫంక్షన్ హల్‌లో కాంగ్రెస్ పార్టీ మముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా ఎంఎంల్‌ఏ హాజరై మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం యాభై ఐదు వేల ఉద్యోగాలను అందించామని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,ఏఎంసీ చైర్మెన్ పులి కష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ ఎంపిపి ఒగ్గు దామోదర్,ఏఎంసి వైస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు,మాజీ సర్పంచ్‌లున్నారు.

# ప్రతీ బ్యాలెట్ పేపరూ పరిశీలించాలి






ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపధ్యంలో అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ పేపర్ల పరిశీలన కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బ్యాలెట్ పేపర్ పరిశీలనలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి బ్యాలెట్ పేపర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఏదైనా బ్యాలెట్ పేపర్లు రిమార్కులు ఉంటే నిర్ణీత ఫారం పూరించాలని, ఆ బ్యాలెట్ పేపర్ వరుస సంఖ్య నమోదు చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ప్రతి బ్యాలెట్ పేపర్‌ను అభ్యర్థుల సమక్షంలో అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లపై ఉన్న వరుస సంఖ్య, ఫోటోలు, అభ్యర్థుల పేర్లు తదితర వివరాలను సరిచూశారు. అభ్యర్థులు, అభ్యర్థుల తరపున వచ్చిన ఏజెంట్లు బ్యాలెట్ పేపర్ల తనిఖీని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డిఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ తదితరులున్నారు.

### టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖ ఆద్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పదవ తరగతి పరీక్షలపై చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సూపరింటెంట్లు ప్రతిపరీక్ష కేంద్రాన్నిపరిశీలించాలని, అక్కడ అన్ని వసతులను పరిశీలించాలని ఆదేశించారు. ప్రతిగదిలో ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలని, మరుగుదొడ్లు వినియోగంలో ఉండాలన్నారు. విద్యార్థులందరికీ తాగునీరు వసతి కల్పించాలన్నారు. వైద్య శాఖ ఆద్వర్యంలో ప్రతి పరీక్ష కేంద్రంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పరీక్షకు ముందు ప్రతి విద్యార్థికి ఓఆర్ఎస్ ద్రావణం అందించాలని సూచించారు. గుర్తింపు పొందిన వారు మినహా పరీక్ష కేంద్రంలోకి ఎవరినీ అనుమతించారాదని ఆదేశించారు. ఇన్విజిలేటర్లు గంట ముందు కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులు కూర్చోవడానికి మంచి ఫర్నిచర్ వాడాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వరాదని తెలిపారు. దివ్యాంగులు పరీక్ష రాసేందుకు సౌకర్యవంతమైన ప్రదేశాన్ని ఎంపిక చేయాలన్నారు. వీలైన చోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ ఒకే గేటు నుంచి ఉండేలా చూడాలన్నారు. నిబంధనలు అనుసరించి 10వ తరగతి పరీక్షలు సాఫీగా సాగేలా చూడాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'సిద్దిపేట'లో 43 పరీక్షా కేంద్రాలు

### ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి




ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : ఇంటర్మీడియట్ పరీక్షలను మాల్ ప్రాక్టిస్‌కు తావులేకుండ ప్రశాంతమైన వాతావరణంలో సజవుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ అనురాధతో కలసి ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు రవాణ,వైద్య ఆరోగ్యం, విద్యుత్ పోస్టర్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్ష నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ మార్చి 5 నుండి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 43 పరీక్ష కేంద్రాల్లో 20595 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. వీరిలో ఇంటర్ ఫస్టియర్ స్టూడెంట్లు9770, సెకండ్‌ఇయర్ స్టూడెంట్లు 10 815 విద్యార్థులున్నారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులను నడిపేలా ఆర్టీసి అధికారులను ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, రెవెన్యూ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ సదానందం, చంద్రకళ, ఆడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్,జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి రవీందర్‌రెడ్డి, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ పట్టణంలోని పలు పాఠశాలల్లో, బార్ అసోసియేషన్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు.ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు మీ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యతగా వేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి. గతంలో జీవన్ రెడ్డిని ఆదరించినట్లుగా నేడు నరేందర్ రెడ్డిని ఆశీర్వదించాలి కోరారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డిఎస్సీ జరిగింది. మళ్ళీ గత పదేళ్లుగా డిఎస్సీ వేయలేదు. మళ్ళీ కాంగ్రెస్ వచ్చాక డిఎస్సీ వేశామని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసిఆర్‌కి దక్కింది. రేవంత్‌రెడ్డి ప్రతి రోజు 18 గంటలు కష్టపడి పనిచేస్తూ రాష్ట్రాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. వేములవాడ నియోజకవర్గంలో పడవుపడ్డ ప్రాజెక్టులను నేడు ముందుకు తీసుకెళ్లడం జరుగుతుంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు.

## కాంగ్రెస్‌తోనే పట్టభద్రులకు న్యాయం




ప్రజాపక్షం/గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇంచార్జి అలవాల కార్తీక్ అన్నారు. నిరుద్యోగులు, పట్టభద్రులను మోసం చేస్తున్న బిజెపికి ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరే అవుతుందన్నారు. గంగాధర మండలం మధురానగర్‌లోని ప్రజా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పట్టభద్రులను ఏవిధంగా మోసం చేస్తుందో ప్రజలందరికీ తెలుసన్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి కష్టాలను ఎదుర్కొని విద్యాసంస్థలను స్థాపించి వేలాదిమంది విధ్యార్థులకు ఉన్నత విద్యను అందించిన వ్యక్తి వూట్కూరు నరేందర్‌రెడ్డి అని కొనియాడారు. నరేందర్‌రెడ్డి గెలుపుకోసం యువజన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, చొప్పదండి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వొడ్నాల యగ్నేష్, గోల్కొండ రాజు, ఆముదాల రోహిత్ రెడ్డి, అనుపురం పరశురాం, నేరెళ్ల సతీష్ రెడ్డి, నల్లాల అఖిల్, రోండ్ల అనిల్‌రెడ్డి తదితరులున్నారు.

## టెన్త్, ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : జిల్లాలో ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బంధీగా చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్,పదో తరగతి పరీక్షల నిర్వహణ పై శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యుల్ ప్రకారం నిర్వహించుటకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో మార్చి 5నుండి మార్చి 25వరకు ఇంటర్, మార్చి 21 నుండి ఏప్రిల్ 04వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తామని దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలు ఉదయం 9గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఇంటర్ మొదటి సంవత్సరం 5065, రెండవ సంవత్సరం 4245 మొత్తం 9310 మంది విద్యార్థులు పరీక్షలకు హజరుకానున్నట్లు ఇందుకుగాను 16 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఆర్డీవోలు రాజేశ్వర్, రాధాబాయి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్, డిఎంహెచ్‌వో డా. రజితలున్నారు.

# 'వికసిత్ భారత్'కి అనుగుణంగా కేటాయింపులు




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని, దేశ స్థితిగతిని మార్చే విధంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని, త్వరతి, సమ్మిళిత, అభివృద్ధి, పెట్టుబడుల సాధన లక్ష్యంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అద్భుతమైన బడ్జెట్ రూపొందించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, పార్లమెంటు సభ్యులు దగ్గుపాటి పురందరేశ్వరి అన్నారు. 2025–26 కేంద్ర బడ్జెట్‌పై శుక్రవారం కరీంనగర్‌లోని వైశ్యభవన్‌లో మేధావులతో సదస్సుకు ముఖ్య అతిధిగా మాట్లాడారు. అంతకుముందు కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో బడ్జెట్ కేటాయింపుల అంశంపై మీడియాతో ఆమె మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులపై తగిన అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పార్టీ ఆద్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపక్షాలకు మింగుడుపడడం లేదన్నారు. సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు , వికసిత్ భారత్ బడ్జెట్ ప్రోగ్రాం స్టేట్ కో ఆర్డినేటర్ గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తాజా మాజీ మేయర్ సునీల్‌రావు తదితరులున్నారు.

## మల్క కొమురయ్యకు సంపూర్ణ మద్దతు

ప్రజాపక్షం/కరీంనగర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపు తధ్యమని బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మంకమ్మతోటలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో బిసి యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్ ఆద్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి దొగ్గలి శ్రీధర్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యకు బిసి సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఈఎన్నికలు 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్ అన్నారు. ఇది రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతున్నాయని పేర్కొన్నారు. బిసి అభ్యర్థులను చట్టసభల్లో పంపటం ఖాయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి ఉపాధ్యాయ అగ్రకుల పార్టీలలో విసిగిపోయారన్నారు. బహుజనులు అంతా టీచర్ ఎమ్మెల్సీ బిసి అభ్యర్థి మల్క కొమురయ్యను భారీ మెజార్టీతో గెలిపించి చరిత్ర సృష్టించబోతున్నారని తెలిపారు. వాయిల రాజ్ కుమార్ గుమ్మడి శ్రీనివాస్, అంతరిగి రాజు, కుమార్ తదితరులున్నారు.

## పేదల పెన్నిధి సర్దార్ రవీందర్‌సింగ్

ప్రజాపక్షం/రామగుండం: కరీంనగర్‌లో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పేదలకు పలు పథకాలను అమలు చేసి పేదల పెన్నిధిగా నిలిచారని, ప్రస్తుత మెదక్‌నిజామాబాద్‌ఆదిలాబాద్‌కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ పట్టభద్రుల ఓటర్లను కోరారు. శుక్రవారం రామగుండం రైల్వే స్టేషన్ ప్రాంతంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క రూపాయికే అంతిమయాత్ర, నల్ల కనెక్షన్, సరస్వతీ ప్రసాదం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేశారన్నారు. బ్యాలెట్ పత్రంలోని క్రమ సంఖ్య 11లో ఉన్న సర్దార్ రవీందర్ సింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

# కాలుష్య రహిత భారత్ కోసం ఖనిజాల ఉత్పత్తి అత్యవసరం

### 'జాతీయస్థాయి కీలక ఖనిజాల సదస్సు'లో సింగరేణి సిఎండి ఎన్.బలరామ్




ప్రజాపక్షం/రామగిరి : బ్యాటరీ వాహనాలు, సోలార్ విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలకఖనిజాలకు అనూహ్య డిమాండ్ ఏర్పడుతోందని, ఈ విషయంలో భారత్ స్వయంసమృద్ధి సాధించడానికి ప్రభుత్వరంగ సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఉందని సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి ఎన్.బలరామ్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో శుక్రవారం కీలక ఖనిజాలపై క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో ఆయన ముఖ్య అతిథిగాప్రసంగించారు. 2070 నాటికి భారత్ ను కర్బన ఉద్గార రహిత " నెట్ జీరో " దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది నెరవేరాలంటే దేశీయ ఖనిజ పరిశ్రమల వారు క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాల) ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కీలక ఖనిజాల పై పరిశోధన, అన్వేషణ, ఉత్పత్తి వంటి విషయాలలో ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం, సహకారం అవసరం అన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగం, సాంప్రదాయేతర ఇంధన వనరుల రంగం, విద్యుత్ వాహనాలు, రక్షణ రంగాల్లో కీలక ఖనిజాల వినియోగం ఎంతో ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఈ ఖనిజాలను విదేశాలనుంచే ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారు 30 రకాల కీలక ఖనిజాల జాబితాని విడుదల చేశారని, వీటిని దేశీయంగా ఉత్పత్తి చేయడం కోసం, తద్వారా స్వయం సమృద్ధి సాధనకు పరిశ్రమలు కృషి చేయాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కూడా కీలక ఖనిజ పరిశ్రమ రంగంలోనికి అడుగుపెట్టడానికి సంసిద్ధమయిందన్నారు. సింగరేణి ఇప్పటికే ఈ విషయంలో ముందడుగు వేసి, జనవరి మొదటి వారంలో ఐఐటి హైదరాబాద్ వారితో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విడుదలయ్యే ఫ్లై యాష్, క్లే మరియు ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ నుండి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను వెలికి తీసే అంశంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయన్నారు.. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బి.ఎస్. మూర్తి, సింగరేణి ఈడీ కోల్ మూమెంట్, జీ.ఎం కోఆర్డినేషన్ ఎస్. డి.ఎం.సుభాని, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ చైతన్యమొయి గంగూలీ, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ హామిల్టన్, సింగరేణి జీ.ఎంలు మనోహర్, నారాయణరావు, మిథానీ, న్యూక్లియర్ ఫ్యూయల్ కార్పోరేషన్, వేదంతా తదితర కంపెనీల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాలకు సకాలంలో శస్త్ర చికిత్సలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** జిల్లాలోని పశువులకు వాతావరణ మార్పులకు అనుగుణంగా అవసరమైన శస్త్ర చికిత్సలను సకాలంలో అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పశువైద్యశాల, పశు వైద్య కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి భవన పరిసరాలు, రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పశు వైద్య కార్యాలయానికి సంబంధించి ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం పశు వైద్య అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మూగజీవాలకు సకాలంలో వైద్య చికిత్సలు అందించాలని, నిర్ణీత సమయంలో వాక్సినేషన్ చేయాలని తెలిపారు. జిల్లాలో నూతనంగా 7 మంది పశు వైద్యులు రావడంతో జిల్లాలు పశు వైద్యుల కొరత లేదని, మారుమూల గ్రామాలలో సైతం శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ క్రమంలో పశువుల యజమానులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సురేష్, పశు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో 'ఈ బాహా బగ్గీ'ల పోటీలు



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ పట్టణ సమీపం లోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాల లో రెండవ రోజు ఈ బాహా బగ్గీల పోటీలు నిర్వహించారు. ఈ బాహా కేటగిరి కోసం సే ఇండియా పోటీలలో రెండవ రోజు సాంకేతిక విషయాలపై పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలలో 19 రాష్ట్రాల నుండి 88 టీములు దరఖాస్తు చేసుకోగా ఇందులో 77 జట్లు పాల్గొన్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి 2 మహారాష్ట్ర, 23 తమిళనాడు, 17 తెలంగాణ, 2 కేరళ, ఏడు ఢిల్లీ, ఒకటి ఒరిస్సా, రెండు మధ్యప్రదేశ్, 3 ఉత్తరప్రదేశ్, 3 గుజరాత్, 4 కర్ణాటక, 4 ఉత్తరాఖండ్, ఒకటి త్రిపుర, ఒకటి కర్ణాటక, 4 చతీస్గడ్, ఒకటి చండీగడ్, ఒకటి ఝార్ఖండ్, ఒకటి జమ్ము కాశ్మీర్, ఒకటి హర్యానా, ఒకటి ఈ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. మన దేశంలోని 19 రాష్ట్రాలకు చెందిన ప్రతిష్ఠాత్మకంగా చెందిన విద్యాసంస్థలు ఐఐటి ఎన్ఐటి పేరుపొందిన యూనివర్సిటీల నుండి 77 విద్యార్థుల చేత సొంతంగా డిజైన్ చేసుకొని తయారు చేసిన వారి బగ్గీలతో ఈ బాహా సే ఇండియా 2025 పోటీలో పాల్గొన్నారు. ఈరోజు బగ్గీలకు సాంకేతిక తనిఖీలు బ్రేక్ టెస్ట్ వర్క్షప్ తుఫాన్ పరీక్షలు డిజైన్ ఫైనల్స్ ఆవిష్కరణల ప్రదర్శన ద్రోణాచార్య తరఫున డైనమిక్ సంఘటనలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విష్ణు విద్యా సంస్థల వైస్ చైర్మన్ రవిచంద్రన్, రాజగోపాల్, సీమోనా ఆదేలినా లక్ష్మీప్రసాద్, సంజయ్, బాపిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో భద్రత పెంపు.. సిఐ శశిధర్ రెడ్డి




**ప్రజాపక్షం/మందమర్రి:** కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మందమర్రి పట్టణంలోని అంగడి బజార్‌లో సీసీ కెమెరాల ఉపయోగంపై నెల క్రితం అవగాహన కల్పించగా, కాలనీ వాసుల సహకారంతో అంగడి బజార్ సెంటర్‌లో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా శుక్రవారం మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులకు సమానం అని, నేర నిరోధకతలో వీటి పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వీటి ఏర్పాటుతో నేరస్థులు భయభక్తులతో ఉంటారని తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో నేర ఘటనలు గణనీయంగా తగ్గాయని, ఏదైనా సంఘటన జరిగినా వాటి ద్వారా నిజానిజాలను వెంటనే గుర్తించవచ్చన్నారు. అంతేకాకుండా, కేసుల విచారణ సమయంలో సీసీ కెమెరాల రికార్డింగ్‌లు ప్రధాన సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## నందిపేట్‌లో పోలీసుల రాపిడ్ ఫోర్స్‌ల మాక్ డ్రిల్



**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండల కేంద్రంలో శుక్రవారం పోలీసు శాఖ ఆద్వర్యంలో పోలీసు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో పోలీసు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి సమక్షంలో జరిగింది. స్తానిక వివేకానంద విగ్రహం నుండి గ్రామ పంచాయతీ వరకు మాక్ డ్రిల్ జరిగింది. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ శాంతి భద్రతలలో భాగంగా ఎంఎల్సి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నిర్వహించారు. ప్రధాన పండుగలు, ఎన్నికల సమయంలో ప్రజలకు, శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా బలగాలు సిద్ధంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో నందిపేట్ ఎస్ఐ చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డైరెక్టర్ (పిపి) వెంకటేశ్వర్లును సన్మానించిన ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ జిఎం కార్యాలయంలో నూతనంగా నియమితులైన డైరెక్టర్ (పిపి) వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ జిఎంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను శుక్రవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ, డైరెక్టర్ (పిపి)గా వెంకటేశ్వర్లు ఎన్నికవడం హర్షణీయమని, సింగరేణి సంస్థలో కార్మికుల సంక్షేమం కోసం ఆయన విశేషంగా సేవలందించారని కొనియాడారు. అలాగే, శ్రీరాంపూర్ ఏరియాకు కొత్తగా వచ్చిన జిఎం శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి జనరల్ సెక్రటరీ ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధులు, అన్ని గనుల ఫిట్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం: కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హామీ ఇచ్చారు. శుక్రవారం పెంబి మండలం రాయదారి గ్రామంలో నిన్న జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను అధికారులతో కలిసి ఆమె పరామర్శించారు. బాధితులతో ప్రమాదానికి గురైన ఇండ్ల ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో కలెక్టర్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాద ఘటన దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలో 8ఇండ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద రేపటిలోగా బాధితుల ఖాతాల్లోకి లక్ష రూపాయలు జమ చేస్తామని తెలిపారు. వారికి నిత్యవసర సరుకులు,బట్టలను కలెక్టర్ అందజేశారు. బాధితులు యధాస్థితికి చేరుకునే వరకు వారికి భోజనం అందించాలని, రాత్రి బస చేసేందుకు ఏర్పాట్లను చేయాలన్నారు. బాధితులు నూతన ఇండ్ల కోసం అధికారులకు తమ వివరాలను అందజేయాలన్నారు. నూతన ఇండ్ల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మండల ప్రత్యేక అధికారి నరసింహ రెడ్డి, డిఎస్ఓ కిరణ్ కుమార్, తహసిల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**విద్యార్థులకు మెరుగైనవిద్య, నాణ్యమైన భోజనం అందించాలి**

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులందరికీ మెరుగైన విద్య, నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మామడ మండలం రాసిమెట్ల ప్రభుత్వ ఐటిడిఏ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, సరుకుల గదులను పరిశీలించి ప్రతి రోజు విద్యార్థులందరికీ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాల పరిసర ప్రాంతాలలో నిరంతరం మెరుగైన పారిశుధ్యాన్ని నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పాఠశాలకు హాజరవుతూ వంద శాతం విద్యార్థులు తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్టాకు, అటెండెన్స్, తదితర రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోడిగుడ్లు, నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే సప్లై చేయాలి...

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** నిత్యవసర వస్తువులు, గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు చక్రపాణి అన్నారు. శుక్రవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై 25 రూపాయల స్లాబ్‌రేట్ ఇవ్వాలని, రాగి జావా కాసి నందుకు రూ. 2 స్లాబ్ ఇవ్వాలని అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆద్వర్యంలో డిమాండ్లతో కూడిన మెమోరండం అందజేశారు.

**తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి డిమాండ్**

శుక్రవారం తెలంగాణ మధ్యాహ్న బోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో విద్యాశాఖ చైర్మన్‌ని ఆకూరి మురళిని కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా కార్మికులకు నిత్యవసర వస్తువులు గ్యాస్ కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని లేదా రూ. 25 స్లాబ్‌రేట్ ఇవ్వలని రాగి జావా కాసి నందకు రూ. 2 స్లాబ్ ఇవ్వాలని మిగతా డిమాండ్లతో అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు కమలారెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేమ్ పావని, మరో రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి నిరోధకుడు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**ప్రజాపక్షం/సోన్:** సోన్ మండలంలో మాజీ మంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గ్రామాలలో అయన పర్యటించారు.దారి పొడవు నా వృధాగా పడి ఉన్న అమృత పథకం పైపులను చూసి మాజీ మంత్రి అల్లోల చలించి పోయారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల్ పట్టణ ప్రజల నీటి తిప్పలను పరిష్కరించేందుకు అమృత పథకం కింద 62కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టవలసి ఉండగా ఆ పనులు కాకుండా ఎమ్మెల్యే ఏలేటి అడ్డుపడడం శోచనీయమన్నారు.ప్రముఖ వ్యాపారవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి,నిర్మల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంబరి గంగాధర్,ఎఫ్.ఎస్.సి ఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్,కృష్ణా ప్రసాద్ రెడ్డి,రమణా రెడ్డి వినోద్ కుమార్,శ్రీకాంత్ యాదవ్,ఎంపిటీసీ సంతోష్,నిర్మల్ మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు పోలాస మల్లేష్,ఇతర నాయకులు,కార్యకర్తలు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## బర్డ్ ఫ్లూతో మూతపడుతున్న చికెన్ సెంటర్లు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని సుంకేట్, తిమ్మాపూర్, పాలెం, తోర్తి, ధర్మారో, శెట్టి పల్లి, దోన్కల్ గ్రామాలతో పాటు చుట్టు పక్కల కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలంలోని వివిధ గ్రామాలలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకడం వల్ల ఆయా గ్రామాల్లోని చికెన్ సెంటర్ లు మూసుకోవాల్సి వస్తుందని చికెన్ సెంటర్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. బర్డ్ ఫ్లూ రావడం వల్ల గ్రామాలలో చికెన్ తినే ప్రియులు బర్డ్ ఫ్లూకు భయపడి చికెన్ తినడం పూర్తిగా మానేయడంతో చికెన్ సెంటర్ యజమానులు రోడ్డు పడ్డట్లు అయ్యింది. రోజు ఫైనాన్స్ కట్టే చికెన్ సెంటర్ యజమానులు మాత్రం దిక్కుతోచక అయోమయంతో రోజులు గడిపేస్తున్నారు. ప్రభుత్వం ఇకముందు అయిన కోళ్లకు ఎటువంటి వైరస్‌లు సోకకుండా ముందుగానే చర్యలు చేపట్టి చికెన్ సెంటర్లు సాఫీగా నడుస్తూ చికెన్ తినే వారికి ఎటువంటి హాని కలుగకుండా చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మైనింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి: ఎఐటియుసి



**ప్రజాపక్షం/నస్పూర్:** ఎంఎల్‌సి ఎన్నికల నియమావళి కారణంగా నిలిచిపోయిన ప్రమోషన్లు, రిలీవింగ్ అంశాలను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరించేందుకు యాజమాన్య దృష్టికి తీసుకెళ్లనున్నాం అని ఎఐటియుసి నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ లోని ఐకె 1ఎ, ఐకె ఓసిపి గనుల మైనింగ్ సిబ్బందిని మర్యాదపూర్వకంగా కలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎఐటియుసి జనరల్ సెక్రటరీ రాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రధానంగా 2016 బ్యాచ్ జెఎంఇటిల ప్రమోషన్, చార్జ్ భత్యం, బంగ్లా నిర్వహణ భత్యం, ఓసి కౌన్సిలింగ్‌లో పాల్గొన్న ఓవర్ మెన్‌ల ఓసి రిలీవింగ్ వంటి కీలక అంశాలపై చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి సంబంధించి మరో సమావేశాన్ని 22 ఫిబ్రవరి 2025, శనివారం సాయంత్రం 5 గంటలకు నర్సయ్య భవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు ముఖ్య అతిథులుగా హాజరవనున్నారని తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని, సిబ్బంది తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి వంగరి రాజేశ్వరరావు, శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ పిట్ కార్యదర్శి ప్రశాంత్, శ్రీనివాస్ రెడ్డి, ఐకె 1ఎ వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఐకె ఓసిపి వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ శంకరయ్య మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వయోజన విద్యకు ప్రోత్సాహం

**కలెక్టర్ కుమార్ దీపక్**



**ప్రజాపక్షం/కాసిపేట :** మంచిర్యాల జిల్లా వయోజన విద్యాశాఖ, ఓరియన్ సిమెంట్ దేవపూర్ సహకారంతో కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో అక్షరాస్యత కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వయోజన విద్య సమాజ అభివృద్ధికి కీలక భూమికను పోషిస్తుందని, అక్షరాస్యత పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు నిర్లక్ష్యం చేయబడిన వృద్ధులకు, మహిళలకు, యువతకు ఈ అక్షరాస్యత కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. చదువు అనే ఆయుధాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరిస్తేనే సమాజం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కుట్లు, హస్తకళలు, ఇతర ఉపాధి సంబంధిత శిక్షణ కార్యక్రమాలు గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధిని పెంపొందించుకొని, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడానికి ఈ శిక్షణ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అక్షరాస్యత కేంద్రాల్లో విద్యతో పాటు మహిళలకు కుట్టు శిక్షణ, హస్తకళలపై ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తామని అధికారులు తెలిపారు. అక్షరాస్యత పెంచడం ద్వారా మహిళలు, వయోజనులు తమ హక్కులను తెలుసుకుని, సొంతంగా ఉపాధి మార్గాలు అన్వేషించేందుకు వీలుకల్పించగలుగుతారని వివరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఓరియంట్ సిమెంట్ జిఎం ఆనంద్ కులకర్ణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎస్. కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిడబ్ల్యూఓ రావుఫ్ ఖాన్, ఎంపిడి సత్యనారాయణ సింగ్, ఎంఆర్ఓ బోజన్న తదితరులు హాజరై వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, అధికారులు, శిక్షణ పొందే మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని వయోజన విద్యపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## ఎంఎంపిటిఎఫ్ అమలుకు సహాయ సహకారాలందిస్తాం: కలెక్టర్




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** వలసదారులు దుర్భల కుటుంబాల స్థితి స్థాపకతను మెరుగుపర్చాలనే లక్ష్యంతో యుఎన్ఓ ద్వారా ప్రయోగాత్మకంగా జిల్లాలో అమలు చేయనున్న మైగ్రేషన్ మల్టీ పార్ట్నర్ ఫండ్ (ఎంఎంపిటిఎఫ్) కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ, నిర్ధేశిత లక్ష్యాలు సిద్ధించేలా జిల్లా యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఈ కార్యక్రమం అమలు విషయమై కేంద్ర ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స ద్వారా జిల్లా స్థాయి కమిటీ సభ్యులతో శుక్రవారం సమీక్ష సమావేశం జరిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యం పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాను ఎంపిక చేయటానికి గల కారణాలు ఎంఎంపీటీఎఫ్‌ను అమలు చేయాల్సిన విధానం, యుఎన్ఓ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందించే తోడ్పాటు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో వసలదారులు, దుర్భల కుటుంబాల స్థితిగతులపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. వారి స్థితిగతులలో మార్పును ఆశిస్తూ అమలు చేయ సంకల్పించిన పైలెట్స్ ప్రాజెక్టును జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలందేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి పారదర్శకంగా ఈ కార్యక్రమం అమలయ్యేలా చూస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ సాయగౌడ్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యుఓ రసూల్ బి, పశు సంవర్ధకశాఖ అధికారి జగన్నాథచారి, డీపీఓ శ్రీనివాస్, రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్, సిరికొండ, ధర్పల్లి ఎఓలు నర్సయ్య, వెంకటేష్, యుఎన్ఓ ప్రతినిధులు జగన్మోహన్, డాక్టర్ లిస్సీ జోసెఫ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అనిల్, వాసిల్ పాల్గొన్నారు.

## చిన్నారిపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:** సంగారెడ్డి మండలం ఫసల్ వాధి గ్రామంలో చిన్నారి పై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహబూబ్ ఖాన్, వినోద్‌లు డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. గురువారం రాత్రి ఇంటి బయట ఆడుకుంటున్న 8 ఏండ్ల చిన్నారిని నిందితులు మద్యమత్తులో లైగింక దాడికి పాల్పడ్డారని ,ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. వారం రోజుల క్రితం జ్యోతిర్వాస్తు పీఠం ఆవరణలో భర్త కళ్ల ముందే మహిళపై అత్యాచార ఘటన జరిగిందని ఇలాంటి వరుస ఘటనలు నేపథ్యంలో శివారు గ్రామ ప్రజలు , విద్యార్థినిలు, మహిళల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయని వారు అన్నారు. రోడ్డుకు ఇరువైపుల సిసి కెమెరాల నిఘా పెంచి రాత్రి పూట పోలీసు గస్తీ పెంచాలని, మహిళలకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జరుగుతున్న అత్యాచారాలు అరి కట్టడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు వెంటనే కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు అనురాధ నాయకులు పూలమ్మ, బి.పాషా పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ నిర్మాణం చేయొద్దు




**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ పర్యావరణాన్ని కలుషితం చేసి పచ్చని అడవిలో చిచ్చు పెడుతున్న డంపింగ్ యార్డ్ ను వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని అఖిలపక్ష నాయకులు అన్నారు. డంపు యాడు నిర్మాణం చేపట్టొద్దని నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపం వద్ద అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షగురు శుక్రవారం ఐదవ రోజుకు చేరింది. హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ, ఈ డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపడితే భవిష్యత్తు భావితరాలకు ముప్పు వాటిల్లుతుందని, ఇట్టి డంపింగ్ యార్డ్ ను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు ఏకమై డంపింగ్ యార్డు నిర్మాణాన్ని చేపట్టనియ్యవద్దని వారు పిలుపునిచ్చారు. అదే విధంగా ఈ రిలే నిరాహార భారీగా తరలివచ్చిన మహిళలు దీక్షలో పాల్గొని మద్దతు ఇచ్చారు. డంపు యాడు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం రిటైర్మెంట్ ఉద్యోగులు లింగారెడ్డి, కృష్ణ స్వామి, యాకూబ్, నర్సింలు, సత్యనారాయణ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## పసుపు ధర రూ.10 వేలు.. సాంగ్లిలో 13 వేలా?

**ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి**




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్‌లో పసుపు ధర పది వేలుంటే సాంగ్లీ మార్కెట్‌లో 13 వేలు ఉందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిజామాబాద్‌లో పసుపు ప్రధాన వాణిజ్య పంట అని కుటుంబం మొత్తం 9 నెలలు కష్టపడి పని చేస్తే పసుపు చేతికొస్తుందని అలాంటి పసుపు ఒకప్పుడు క్వింటాలు అమ్మితే తులం బంగారం వస్తుండేనని, ఇప్పుడు తులం బంగారం దేవుడెరుగు ప్రస్తుతం రెండు గ్రాములు కూడా రావటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్‌లో దళారులను అరికట్టాలన్నారు. బీజేపీ ఎంఎస్‌పి లేని పసుపు బోర్డు పెట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు మూడు నాలుగు రోజులు పసుపు కుప్పల మీద పడుకునే పరిస్థితి ఏర్పడుతుందని, పసుపు బోర్డు కార్యాలయం ఢిల్లీలో, చైర్మన్ అంకాపూర్‌లో ఎంపీ అరవింద్ హైదరాబాద్‌లో ఉంటే రైతులకు ఇలాంటి తిప్పలు తప్పవని గుర్తు చేశారు. మద్దతు ధర ఇవ్వలేకపోవటంతో రైతులు దగ పడుతున్నారన్నారు. మార్కెట్ గంజ్ చాలా పెద్దదని, నిర్మల్, జగిత్యాల, కోరుట్ల, ఆర్మూర్, బాల్కొండ రూరల్ నియోజకవర్గాల రైతులు పసుపు రైతుల పసుపును క్రయవిక్రయాలు ఇక్కడే జరుగుతాయన్నారు. ఇలాంటి మార్కెట్‌లో పసుపు ధర క్వింటాలుకు 8, 9 వేలకు తగ్గిపోవటానికి కారణం కాంగ్రెస్, బీజేపీలు కారణమన్నారు. మార్కెట్‌లో ఒకటి రెండు కుప్పలకు పదివేలు, పదివేల ఒక్క రూపాయి రెండు అని చెప్పి మిగతా వారి పసుపును తక్కువకు కొంటున్నారన్నారు. ఇనాంలో 10 వేలకు తక్కువ ఇవ్వొద్దని చెప్పిన దళారులు పక్కదారుల్లో 8500 కు కొంటున్నారన్నారు. పల్లె గంగారెడ్డి, ఎంపీ అరవింద్‌ను ఒకటే డిమాండ్ చేస్తున్నామని నామమాత్రం బోర్డు సరిపోదని, రైతులను శిక్షించడం భావ్యం కాదన్నారు. సమావేశంలో మాజీ నుడా చైర్మన్‌ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ రెడ్‌కో చైర్మన్ అలీమ్, నగర అధ్యక్షులు సిర్ప రాజు, సత్యప్రకాష్, పసుపు రైతులు పాల్గొన్నారు.

క్రీడ

# రేపు భారత్-పాక్ పోరు..

దాయాదుల పోరంటే కేవలం వినోదమే కాదు.. వివాదాలూ ఉంటాయి. ఐసిసి టోర్నీల్లో విజయం కోసం ఇరు జట్ల ఆటగాళ్లు చివరి వరకూ పోరాడతారు.



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజయంతో బోణీ కొట్టగా.. పాకిస్థాన్ ఓటమితో ఆరంభించింది.

డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాక్‌కు కివీస్ చేతిలో పరాభవం ఎదురైంది. అలాగే ఓపెనర్ ఫకర్ జమాన్ గాయం కారణంగా దూరం కావడం ఆ జట్టుకు మరో దెబ్బ. ఇలాంటి పరిస్థితుల్లో టీమ్ ఇండియాను ఢీకొట్టేందుకు పాక్ సిద్ధమవుతోంది. ఆదివారం భారత్–పాక్ మ్యాచ్ జరగనుంది. దాయాదుల పోరంటే సర్వత్రా ఆసక్తి ఉంటుందని తెలుసు కదా. ఇప్పటి వరకు చాలా మ్యాచుల్లో ఇరు జట్లూ తలపడగా.. వివాదస్పదంగా మారిన సందర్భాలూ ఉన్నాయి.

## చెలరేగిన సౌతాఫ్రికా



ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్లు చెలరేగిపోయారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా అఫ్గానిస్థాన్ ముందు 316 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. తొలి ఇన్నింగ్స్ ఆరంభంలోనే సౌతాఫ్రికా ఓపెనర్ జోర్జీ(11) వికెట్‌ను కోల్పోయింది. ఈ క్రమంలో ఓపెనర్‌గా దిగిన రికెల్‌టన్ అఫ్గాన్ బౌలర్లను ఉతికేశాడు. 106 బంతుల్లో 7 ఫోర్లు 1 సిక్సుతో 103 పరుగులు చేశాడు. మరోవైపు కెప్టెన్ బవుమా కూడా రికెల్‌టన్‌కు మంచి సహకారం అందిస్తునే అర్ధశతకాన్ని సాధించాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దుస్సెన్(52) అద్భుతమైన బ్యాటింగ్‌తో సౌతాఫ్రికా స్కోర్ పెంచగా.. ఆఖర్లో మార్క్రం 36 బంతుల్లో 52 పరుగులతో చెలరేగిపోవడంతో సౌతాఫ్రికా 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసి అఫ్గానిస్థాన్‌కు భారీ టార్గెట్‌ను ఇచ్చింది.

# ఆ జట్టేమైనా పాకిస్థానా? ఆసీసా?

### 35 ఓవర్లలోనే ముగిస్తారనుకున్నా: సెహ్వాగ్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌పై టీమ్‌ఇండియా విజయం సాధించింది. 229 పరుగుల లక్ష్య ఛేదనను 46.3 ఓవర్లలో పూర్తి చేసి గెలిచింది. ఒక దశలో 144/4 స్కోరుతో భారత్ ఇబ్బందుల్లో పడేలా కనిపించింది. కానీ, శతక వీరుడు శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ కలిసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ సమయంలో ఏమైనా కంగారు పడ్డారా? అనే ప్రశ్నకు భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. టీమ్‌ఇండియా ఇంకాస్త ముందుగానే టార్గెట్‌ను ఛేదిస్తుందని భావించానని.. బంగ్లాపై ఏమాత్రం కంగారు పడలేదని వ్యాఖ్యానించాడు. అలా జరగడానికి అదేమైనా పాకిస్థాన్ జట్టా లేదా ఆస్ట్రేలియానా అని పేర్కొన్నాడు. ''భారత్ బంగ్లాదేశ్ మ్యాచ్‌లో నేను ఏదశలోనూ టెన్షన్ పడలేదు. ఎందుకంటే అక్కడ ఉంది బంగ్లా. మీరు ఆ జట్టును నాతో పొగిడించు కోవాలనుకుంటున్నారా? అలా జరగాలంటే అది అద్భుతమైన టీమ్‌గా మారాలి. నేను క్రికెట్ ఆడినప్పుడే బంగ్లాను చూసి ఎప్పుడూ భయపడలేదు. అలాంటిది ఇప్పుడు అసలు కంగారే లేదు. అసాధారణ ప్రదర్శన చేయడానికి అదేమైనా పాకిస్థానా..? ఆస్ట్రేలియానా? మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్లను కోల్పోయినా సరే ఇబ్బందే పడలేదు. అయితే, చాలా తేలికగా విజయం సాధించాల్సిన మ్యాచ్. నాలుగు ఓవర్లు మాత్రమే మిగిలి ఉండగా.. భారత్ గెలిచింది. రోహిత్, విరాట్, శ్రేయస్‌లో ఒకరు క్రీజ్‌లో ఉండుంటే భారత్ 35 ఓవర్లలోనే మ్యాచ్ ముగించేది'' అని సెహ్వాగ్ తెలిపాడు.

**కోహ్లి ఛేజ్ మాస్టర్...**

''ప్రతి ఒక్కరి ఫేవరెట్, నాకు రోల్ మోడల్ సచిన్ తెందూల్కర్. అతడితో కలిసి మైదానంలో నడుస్తుంటే ఆ భావనే అద్భుతంగా ఉంటుంది. అడవిలోకి సింహంతో వెళ్తున్నట్లే ఉంటుంది. ప్రతి ఒక్కరి చూపు అతడిపైనే. అప్పుడు నేను నిశ్శబ్దంగా పరుగులు చేసేవాడిని. అయితే, ఛేజింగ్‌లో మాత్రం సచిన్, విరాట్‌లో ఎవరు అంటే మాత్రం నేను విరాట్‌వైపే మొగ్గు చూపిస్తా. 201112 నుంచి ఇప్పటి వరకు కోహ్లి చాలా మారిపోయాడు. అతడి ఫిట్‌నెస్, నిలకడ అద్భుతం. భారత్ కోసం ఎన్నో కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు'' అని సెహ్వాగ్ తెలిపాడు.

## రంజీ ఫైనల్లో కేరళ వర్సెస్ విదర్భ


**నాగపూర్:** రంజీ ట్రోఫీ రెండో సెమీఫైనల్లో ముంబై జట్టు ఓటమి పాలైంది. 80 రన్స్ తేడాతో విదర్భ విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించింది. 406 రన్స్ టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్ ఆడిన ముంబై జట్టు.. శుక్రవారం అయిదో రోజు 325 రన్స్ చేసి ఆలౌటైంది. ముంబై జట్టులో శార్దూల్ ఠాకూర్ హాఫ్ సెంచరీ చేశాడు. విదర్భ బౌలర్ హర్ష్ దూబే.. తన ఖాతాలో అయిదు వికెట్లు వేసుకున్నాడు. విదర్భ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 383, రెండో ఇన్నింగ్స్‌లో 292 రన్స్ చేసింది. అయితే ముంబై తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 270 రన్స్ మాత్రమే చేసి ఆలౌటైంది. ఇక గుజరాత్, కేరళ మధ్య జరిగిన తొలి సెమీఫైనల్ డ్రా అయ్యింది. అయితే ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేరళ ఆధిక్యం సాధించడం వల్ల ఆ జట్టు ఫైనల్‌కు క్వాలిఫై అయ్యింది. రంజీ చరిత్రలో తొలిసారి కేరళ ఫైనల్‌కు ఎంట్రీ ఇచ్చింది. కేరళ తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేవలం రెండు పరుగుల ఆధిక్యం మాత్రమే సాధించింది.



కానీ లీడ్ వల్ల ఆ జట్టు ఫైనల్‌కు ప్రవేశించింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 457 , రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 114 రన్స్ చేసింది. గుజరాత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 455 రన్స్ చేసింది. **26 నుంచి కేరళ, విదర్భ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనున్నది.**

రీల్

## 'హరిహర వీరమల్లు' నుంచి 'కొల్లగొట్టినాదిరో' ప్రోమో రిలీజ్



నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం హరిహర వీరమల్లు. పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇప్పటికే మాట వినాలి అనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా సెకండ్ సింగిల్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా నుంచి కొల్లగొట్టినాదిరో అనే రెండో సింగిల్ ప్రోమోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. కోర కోర మీసాలతో కోదమ కోదమ అడుగులతో.. జర జర వచ్చినాడు చిచ్చర పిడుగంటివాడు అంటూ విడుదల చేసిన ప్రోమో గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ సినిమాలో చాలా రోజుల తర్వాత ఒక సూపర్ హిట్ సాంగ్ రాబోతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ పాటలో నిధి ఆగర్వాల్‌తో పాటు అనసుయ కూడా తళుక్కున మెరిసింది.

## ధనుష్‌పై కీర్తిసురేశ్ ప్రశంసలు



హీరో ధనుష్ మేనల్లుడు పవిష్ నారాయణ్ నటుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'నిలవుకు ఎన్‌మేల్ ఎన్నడి కోబమ్'. ధనుష్ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. అనిఖ సురేంద్రన్, ప్రియాప్రకాశ్ వారియర్, మాథ్యూ థామస్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. తాజాగా దీనిని నటి కీర్తిసురేశ్ వీక్షించారు. ఈ సినిమా తనకెంతో నచ్చిందని సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ధనుష్ మేకింగ్ స్టైల్‌ను ఆమె మెచ్చుకున్నారు. ''ఇప్పుడే ఈ చిత్రాన్ని వీక్షించాను. సినిమా చాలా కొత్తగా, చూడచక్కగా ఉంది. ధనుష్.. మీ డైరెక్షన్‌లో మరో విభిన్నమైన కథను సృష్టించారు. మీ మేకింగ్ స్టైల్ నాకెంతో నచ్చింది. ఇంతమంది నటీనటులను స్క్రీన్‌పై చూడటం ఎంతో సంతోషంగా ఉంది. పవిష్.. హావభావాలు, వాయిస్, యాక్షన్ ఇలా ప్రతి విషయంలో నువ్వు ధనుష్‌ని గుర్తుచేశావు. అద్భుతమైన చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టావు. మాథ్యూ థామస్.. నీ పాత్ర ప్రేక్షకులకు ఎంతగానో గుర్తుండిపోతుంది. ప్రియాంకా మోహన్.. నీ డ్యాన్స్ అదిరింది. టీమ్ అందరికీ అభినందనలు'' అని ఆమె రాసుకొచ్చారు. ఇదే చిత్రం తెలుగులో 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే పేరుతో విడుదలైంది. రొమాంటిక్ కామెడీ కథతో దీనిని సిద్ధం చేశారు. 'రాయన్' తర్వాత ధనుష్ దర్శకత్వం వహించిన చిత్రమిదే కావడంతో ప్రమోషన్స్ సమయంలోనే ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది.

## చిరంజీవి మాట.. నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది

– సందీప్ కిషన్



'మజాకా'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు నటుడు సందీప్ కిషన్. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఇది విడుదల కానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందీప్‌కిషన్ పలు విశేషాలు పంచుకున్నారు. కెరీర్‌లో తాను ఎన్నో ఎత్తుపల్లాలు చూశానన్నారు. ప్రస్తుతం మంచి ప్రాజెక్ట్‌లు చేస్తున్నానని తెలిపారు. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా తెరకెక్కిస్తోన్న చిత్రంలో యాక్ట్ చేయడంపై మాట్లాడుతూ.. 'ఆ సినిమా చిత్రీకరణ మొదలుపెట్టామంతే. వరుస ప్రాజెక్ట్‌ల వల్ల నా డేట్స్ సర్దుబాటు చేయడం వీలుపడలేదు. త్వరలోనే ఆ సెట్‌లోకి అడుగుపెడతా. 'మజాకా' షూట్ సమయంలో ఓసారి అనుకోకుండా అగ్ర కథానాయకుడు చిరంజీవిని కలిశాను. మా మధ్య మంచి అనుబంధం ఉంది. 'మజాకా' కథ చేస్తున్నందుకు నన్ను మెచ్చుకున్నారు. ఈ కథ తనకెంతో నచ్చిందని.. తాను చేయలేకపోయినందుకు బాధపడ్డానని తెలిపారు. 'సంజయ్‌తో నువ్వు సినిమా చేస్తున్నావని తెలిసింది. ఒక తెలుగు హీరోతో వాళ్లు సినిమా చేయాలనుకుంటున్నారంటే మనం గర్వపడాల్సిన విషయం' అన్నారు. ఆ మాట నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. నేను ఆ విధమైన ప్రశంసలనే అందరి నుంచి కోరుకుంటున్నా'' అని చెప్పారు.

## ఆ సీన్‌లో మోహన్‌లాల్ యాక్టింగ్ నచ్చలేదు

ఆర్‌జివి



మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ నటనపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ప్రశంసలు కురిపించారు. ఆయన సహజ నటుడని పేర్కొన్నారు. తమ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'కంపెనీ' రోజులను గుర్తు చేసుకున్నారు. కంపెనీ స్క్రిప్ట్ చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ చూసి షాకయ్యానని తెలిపారు. 'కంపెనీ' కథ చెప్పడం కోసం తొలిసారి మోహన్‌లాల్‌ను కలిశా. కథ, తన పాత్రను ఉద్దేశించి చాలా సందేహాలు అడుగుతారని.. ఆ మేరకు సన్నద్ధమయ్యా. ఆయన ఏం అడిగినా సమాధానం చెప్పాలనుకున్నా. తీరా కథ చెప్పడం పూర్తి కాగానే ఆయన.. ఎన్ని రోజులు షూట్ చేస్తారని మాత్రమే అడిగారు. ఇలాంటి క్లైమాక్స్ నేను అస్సలు ఊహించలేదు. నాకు తెలిసి దర్శకులందరితో ఆయన ఇదే విధంగా వ్యవహరిస్తుంటారు. ఎందుకంటే ఆయనకు సినిమా గురించి ఎంతో అవగాహన ఉంది. అలాగే, దర్శకులపై ఆయన నమ్మకం ఉంచుతారు' 'కంపెనీ' షూట్ సమయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఓ సీన్‌లో ఆయన ప్రదర్శన నాకు ఏమాత్రం నచ్చలేదు. సీన్‌కు అనుగుణంగా ఆయన నటించడం లేదనిపించింది. అదే సన్నివేశాన్ని సుమారు ఏడెనిమిది చేశాం. తర్వాత వాటన్నింటినీ పరిశీలిస్తే ఆయన తొలి టేకే బాగా చేశారనిపించింది. నిజం చెప్పాలంటే ఆయన సహజ నటుడు. సీన్ వివరిస్తే చాలు దర్శకుడికి కావాల్సిన విధంగా నటిస్తారు'' అని ఆర్‌జీవి తెలిపారు.





### భవన నిర్మాణ కార్మికులకు
# థంబ్ రద్దు చేయాలి

నూతన లేబర్ కార్డులివ్వాలి : చాడ వెంకటరెడ్డి డిమాండ్

కార్మికులకు శ్రమ దోపిడీ తప్ప పెన్షన్‌లు లేవు : కూనంనేని

ప్రజాపక్షం/వేములవాడ

భవన నిర్మాణ కార్మికులకు థంబ్ సిస్టం రద్దు చేయాలని, నూతన లేబర్ కార్డులు ఇవ్వాలని, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభ వేములవాడలోని మహాలక్ష్మి వీధిలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, రాష్ట్ర ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బాలరాజు, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగొని. ప్రవీణ్ కుమార్, ఎఐటియుసి జిల్లా ఇంచార్జి టేకుమళ్ల సమ్మయ్య, రాంబాబు, పిట్టల సమ్మయ్య ,జిల్లా సిపిఐ కార్యదర్శి గుంటి వేణు హాజరెనారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్మికులు సహజ మరణం పొందితే రూ.5 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్, డెలివరీకి రూ.50 వేలు, వివాహానికి రూ.1లక్ష ఇవ్వాలన్నారు. అర్హులైన కార్మికులకు డబల్ బెడ్ రూంలు, అడ్డాల వద్ద విశ్రాంతి గదులు, మౌలిక వసతులు కల్పించి, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పాత లేబర్ కార్డులను రెన్యూవల్ చేయాలని, రేషన్ కార్డునే ఫ్యామిలీ మెంబర్ కార్డుగా గుర్తించాలని కార్మికుల నామినికి బెనిఫిట్స్ అందించాలని, దహన సంస్కారం ఖర్చు రూ.20 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చే స్థితిలో లేదని అవుట్సోర్సింగ్ కాంటాక్ట్ బేస్ ఉద్యోగులను తీసుకుంటూ శ్రమదోపిడి చేస్తుందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఎంతో నెపుణ్యంతో టెక్నాలజీతో భవన నిర్మాణం చేస్తున్న వారికి శ్రమ దోపిడీ తప్ప పెన్షన్లు ఇవ్వడం లేదని టీచర్లుగా ఉద్యోగుల రిటైర్డ్ అయినా వారికి పెన్షన్ అందిస్తున్నారు తప్ప శ్రమించి భవన నిర్మాణాలు చేసిన కార్మికులకు పెన్షన్ అందించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ తరపున పోటీ చేసి అధిక సంఖ్యలో సీట్లను కెవసం చేకోవాలని పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గాజుల పోశెట్టి, జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైతులతో కేంద్ర బృందం భేటీ

**చండీగఢ్ :** ఆందోళన చేస్తున్న రైతులు, కేంద్ర ప్రభుత్వం మధ్య ఈనెల 22న మరో దఫా చర్చలు జరగనున్నాయి. శనివారం సాయంత్రం సమావేశమై పంటలకు ఎంఎస్‌పిపై చట్టబద్ధత సహా వివిధ డిమాండ్లపై చర్చించనున్నారు. అయితే తదుపరి సమావేశాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయాలని రైతులు కోరినప్పటికీ వారి విజ్ఞప్తిని పట్టించుకోకుండా చండీగఢ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కాగా, కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిశాఖ జాయింట్ సెక్రటరీ పూర్ణ చంద్ర కిషన్ సమావేశానికి సంబంధించిన లేఖను ఈనెల 19వ తేదీన రైతు నేతలు జగజిత్ సంగ్ డల్లేవాల్, సర్వన్ సింగ్ పంధేర్‌లకు పంపారు. 14వ తేదీన చండీగఢ్‌లో రైతు సంఘాలు ఎస్‌కెఎం (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) నేతలతో జరిగిన సమావేశానికి కొనసాగింపేనని ఆ లేఖలో కేంద్రం పేర్కొంది. ఈ క్రమంలోనే రైతుల సంఘాల డిమాండ్లకు సంబంధించి కేంద్ర మంత్రులు, పంజాబ్ ప్రభుత్వంతో ఈనెల 22వ తేదీన సాయంత్రం చండీగఢ్‌లోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో సమావేశం జరగనుందని, సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానిస్తున్నట్లు లేఖలో అధికారులు పేర్కొన్నారు. కాగా, ఈనెల 14వ తేదీన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోష్ నేతృత్వంలోని కేంద్రం బృందం రైతులసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. స్నేహపూరిత వాతావరణంలో చర్చలు జరిగినట్లు ఇరువర్గాలు వెల్లడించాయి. పంటలపై కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీతో సహా రైతుల వివిధ డిమాండ్లను అమలు చేయాలని ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీనే ప్రధాన డిమాండ్‌గా సంవత్సరకాలంగా రైతులు నిరసన వ్యక్తం చేసిన తర్వాత ఫిబ్రవరి 14న జరిగిన సమావేశంలో చర్చ జరిగింది. రైతు సమాజ సంక్షేమం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి జోషి సమావేశంలో ప్రస్తావించగా, వాస్తవాల ఆధారంగా తమ అభిప్రాయాలను బలంగా వ్యక్తం చేసినట్లు రైతు నాయకులు తెలిపారు. శంభు, ఖనౌరి సరిహద్దు పాయింట్ల వద్ద ఆందోళనకు నాయకత్వం వహించిన రెండు రైతు సంఘాల రైతు ప్రతినిధులు పాల్గొన్న ఫిబ్రవరి 14న జరిగిన సమావేశంలో పంజాబ్ వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుడియాన్, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల మంత్రి లాల్ చంద్ కటారుచక్, ఇతర రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. రైతు ప్రతినిధులతో మరో రౌండ్ చర్చలు ఇక్కడ జరుగుతాయని, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కేంద్ర బృందానికి నాయకత్వం వహిస్తారని జోషి చెప్పారు. ఆ సమావేశంలో తాను కూడా పాల్గొంటానన్నారు. గత వారం జరిగిన సమావేశంలో డల్లేవాల్ కూడా పాల్గొన్నారు. ఫిబ్రవరి 14 సమావేశానికి ముందు, 2024లో కేంద్ర మంత్రులు, నిరసన తెలుపుతున్న రైతుల మధ్య నాలుగు రౌండ్ల సమావేశాలు జరిగాయి, కానీ అసంపూర్తిగా మిగిలాయి.

# 'అదానీ అంశం వ్యక్తిగతం కాదు'

(మొదటి పేజీ తరువాయి)

చర్చించనవసరం లేదు. ఆయన నిజంగా మన ప్రధాని అయితే, అదానీని విచారణ చేసేందుకు అమెరికా పంపి ఉండాల్సింది. కానీ అలా చేయలేదు. అది వ్యక్తిగత విషయంగా కొట్టివేశారు' అని రాహుల్ వివరించారు.

ట్రంప్‌తో చర్చల సందర్భంగా అదానీపై అమెరికా ప్రభుత్వం గౌతం అదానీపై అవినీతి ఆరోపణలు చేసిన విషయాన్ని ప్రస్తావించలేదని మోదీ ఫిబ్రవరి 14న తెలిపారు. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అదానీపై అవినీతి నేరారోపణ విషయాన్ని ట్రంప్‌తో చర్చల సందర్భంగా ప్రస్తావించారా అని మీడియా అడిగిన విషయాన్ని రాహుల్ గుర్తుచేశారు. 'ఇండియా ప్రజాస్వామ్య దేశం. మన సంస్కృతి, తత్వశాస్త్రం 'వసుధైక కుటుంబం' అనే భావనను ప్రకటిస్తున్నాయి. ప్రపంచమంతా ఒకే కుంటుంబం అనేది దాని భావం. ప్రతి భారతీయుడిని నా వాడిగా భావిస్తాను' అని రాహుల్ పేర్కొన్నారు. కాగా ఇద్దరు దేశాధినేతలు సమావేశమైనపుడు ఇటువంటి విషయాలు చర్చించుకోమని మోదీ తెలిపారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అదానీ అంశం చర్చలలో చోటు చేసుకోలేదని విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. కాగా జో బైడెన్ నేతృత్వంలోని గత అమెరికా ప్రభుత్వం సోలార్ పవర్ కాంట్రాక్టుల విషయంలో భారత అధికారులకు లంచం ఇవ్వజూపిన అంశంలో అదానీపై నేరారోపణ చేసింది. ఈ విషయాన్ని దాచిపెట్టి అదానీ కోట్లాది రూపాయలను రుణంగా పొందారని అమెరికా ఎఫ్‌సిపిఏ అధికారులు ఆరోపించిన విషయాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూపు నిరాధారమైనవిగా కొట్టివేసింది.

**'డబుల్ ఇంజన్ కాదు..ఇంజనే లేదు'**

ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి పాలిత డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి అసలు ఇంజనే లేదని కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటైన విమర్శలు చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఇతర సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, కేంద్రం కూడా ప్రైవేటైజేషన్ వైపు మొగ్గు చూపుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలోవలె ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు. 'ఇది డబుల్ ఇంజన్ ప్రభుత్వం కాదు. ఈ ప్రభుత్వానికి అసలు ఇంజనే లేదు' అని రాహుల్ తన రెండు రోజుల పర్యటనలో లాల్‌గంజ్‌లో యువతతో ఇష్టాగోష్టి సందర్భంగా అన్నారు. ఒకవైపు యువత నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలతో సతమతమౌతుంటే, ప్రభుత్వం వాటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యకు బిజెపి ప్రభుత్వమే కారణమన్నారు. నోట్ల రద్దు చిరు వ్యాపారాలను నాశనం చేసిందని, జిఎస్‌టి వ్యవస్థ మద్దతుగా నిలవలేదన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించాలంటే చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని, బ్యాంకు రుణాలు అందుబాటులోకి తేకుంటే చిన్న పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల పెంపు సాధ్యం కాదన్నారు. విద్య, ఆరోగ్య రంగాలు ప్రైవేటీకరణకు గురవుతున్నాయని, సామాన్య ప్రజలకు కనీస అవసరాలు అందుబాటులో లేకుండా పోతున్నాయన్నారు. ప్రైవేటు విద్యాలయాలలో చదువు, ప్రైవేట్ ఆస్పత్రులలో వైద్యం సగటు ప్రజానీకానికి అందని ద్రాక్షలా మారాయన్నారు. సామాన్య ప్రజలు కనీస అవసరాలపైకూడా జిఎస్‌టి చెల్లిస్తుంటే, పారిశ్రామికవేత్తలు అదే నిష్పత్తిలో పన్నులు చెల్లించడం లేదని విమర్శించారు. బిజెపి పాలిత రాష్ట్రాలలోకంటె కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలోనే పాలన మెరుగ్గా ఉందన్నారు. ఒక్కసారి కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అభివృద్ధిని చేసి చూపిస్తామని రాహుల్ అన్నారు. యూనివర్సిటీల ప్రైవేటీకరణ, రిజర్వేషన్లను తొలగించడాన్ని కూడా రాహుల్ వ్యతిరేకించారు. ఇది అట్టడుగు వర్గాల ప్రజల అవకాశాలను మరింతగా దిగజార్చడమేనని విమర్శించారు.



# చర్చలు సఫలం

(మొదటి పేజీ తరువాయి)

ఎ.బిక్షపతి యాదవ్, యం.డి.అఫ్జల్, యం.డి.నజీబ్, ఎస్.రాంకిషన్, అజయ్‌బాబు తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో సంఘాల నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, కూనంనేని సాంబశివరావుకు, ప్రొఫెసర్ కోదండరామ్‌కు జెఎసి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హామీతో జెఎసి ఉద్యమ కార్యక్రమాలను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవాణా మంత్రితో జరిగిన చర్చల వివరాలను జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం వెల్లడించారు. గత ఏడాది నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చేస్తున్న న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి ప్రకటించినట్లు తెలిపారు. ఇతర జిల్లాల ఆటోలను కట్టడి చేయటానికి గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎల్‌పిజి, సిఎన్‌జి, ఎలక్ట్రిక్‌తో కూడిన ఆటోలను నిరుద్యోగులకు కొత్త పర్మిట్లు ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపినట్లు వెంకటేశం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడంలో ఆటోలకు, టూవీల్లర్లకు చాలన్లలో మినహాయింపు ఇస్తామని మంత్రి చెప్పారన్నారు. ఆటోలకు పార్కింగ్ స్థలాలకు సంబంధించి ఎక్కడెక్కడ అవకాశాలు ఉన్నాయో వాటిని గుర్తించి ఏర్పాటు చేస్తామని, అక్రమంగా నడుస్తున్న ఓలా, ఊబర్, రాపిడో టూవీల్లర్ల విషయంలో అధికారులతో చర్చించి వాటిపై ఒక నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

# ఎపి డుమ్మా

(మొదటి పేజీ తరువాయి)

కెఆర్‌ఎంబి ముందు తెలంగాణా రాష్ట్రం తరపున తమ వాదనలు వినిపించారు. వివాదం పరిష్కారానికి గాను రెండు రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాల్సిఉండగా ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గైర్హాజరు అయ్యింది.

**అక్రమనీటివినియోగాన్ని నిలువరించాల్సిందే : రాహుల్ బొజ్జా**

ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలించుకపోతున్న నీటిని కే. ఆర్.యం.బి కచ్చితంగా నిలువరించాల్సిందే నని రాష్ట్ర నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా డిమాండ్ చేశారు.ఈ మేరకు కెఆర్‌ఎంబి సమావేశంలో పాల్గొన్న ఆయన కెఆర్‌ఎంబి చైర్మన్ అతుల్ జైన్ కు లిఖిత పూర్వకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. శ్రీశైలంతో పాటు నాగార్జున సాగర్ నుండి నిబంధనలను ఉల్లంఘించి తరలించుకు పోతున్న నీటిని తక్షణమే నిలిపివేయాలని ఆయన కోరారు. కెఆర్‌ఎంబి రికార్డుల ప్రకారమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనకున్న హక్కులను మించి నీటిని వినియోగించుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నీటిని వినియోగించుకుంటున్న అంశాన్ని 2024 నవంబర్ నుండి ప్రతినెల కెఆర్‌ఎంబికి తెలంగాణా నీటిపారుదల శాఖా ఇ. ఎన్.సి లేఖల రూపంలో ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.అయినా కెఆర్‌ఎంబి ఏ రోజూ పట్టించుకోకుండా ఉపేక్షించడంతో ఇప్పుడు ఈ సమస్య జఠిలంగా మారిందన్నారు. ఉమ్మడి జలాశయాల నుండి ఏకపక్షంగా నీటిని తరలించుకుని పోయే హక్కు ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిదని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ ఏడాది మే మాసాంతానికి తెలంగాణా రాష్ట్రానికి తాగునీరు, సాగునీరు 107 టిఎంసిల నీటి అవసరాన్ని ఆయన వివరంగా చైర్మన్‌కు వివరించారు. తద్వారా కృష్ణా పరివాహక ప్రాంతంలోని 13 లక్షల ఎకరాలలో వేసిన రబీ పంటలను కాపాడడంతో పాటు, కృష్ణా బేసిన్ పరిధిలోని రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన రెండుకోట్ల మంది ప్రజల దాహార్తిని తీర్చాలని కెఆర్‌ఎంబి చైర్మన్‌కు రాసిన లేఖలో రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 650 టి.యం.సిల నీటిని వినియోగించుకుందన్నారు. కాగా తెలంగాణా రాష్ట్రం కేవలం 225 టి.యం.సిల నీటిని మాత్రమే వినియోగించుకుంది. రాష్ట్ర విభజన తరువాత 2014–15లో రెండు తెలుగు రాష్ట్రల మధ్యన కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 66:34 కాగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందాన్ని ఉల్లంఘించి 75:25 నిష్పత్తి లో వాడుకుందని ఆయన తెలిపారు. ఇప్పటికే తెలంగాణా ప్రాంతానికి అవసరమైన త్రాగు,సాగు నీటి వివరాలను మీకు సమగ్రంగా వివరించామని ప్రస్తుతం తెలంగాణాకు అవసరమైన 116 టి.యం.సిల నీటిని అందించాలని,వాటిలో ఎం.జి.కె ఎల్.ఐ.ఎస్ కు 24 టి.యం.సిలు ఎన్.ఎస్.ఎల్.సికి 58 టి.ఎం. సిలు, ఎ.ఎం ఆర్.పికి 34 టి.యంసిలు జూన్ మాసంతానికి అవసరం ఉంటాయని ఆయన తెలిపారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న 72 టి.యం. సిల నీటిని వినియోగించుకునేందుకు తక్షణమే విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని రాహుల్ బొజ్జా కోరారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com